శుక్రవారం
11•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 106
• పేజీలు : 14 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




'నవల'కు నోబెల్


ఓల్గా టొకార్చుజుక్ పీటర్ హాండ్కే

## ఓల్గా, పీటర్ హండ్కేలు విజేతలు

- 2018, 2019 సాహిత్య నోబెల్ ప్రైజులు ప్రకటించిన కమిటీ
- ఇద్దరు నవలా రచయితలకు పురస్కారం



5



## మేరీకోమ్ నవచరిత్ర!

ప్రపంచ చాంపియన్‌షిప్

**ఎనిమిదో పతకం ఖాయంచేసుకున్న దిగ్గజ బాక్సర్**

**భారత** బాక్సింగ్ క్వీన్ మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్ ప్రస్థానంలో ఓ సువర్ణ అధ్యాయాన్ని లిఖించుకుంది. తాను బరిలోకి దిగితే పతకం పక్కా అన్న రీతిలో చెలరేగుతూ రికార్డు స్థాయిలో బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో పతకాన్ని ఖరారు చేసుకుంది. గురువారం 51కిలోల క్వార్టర్స్ పోరులో కొలంబియా బాక్సర్ వాల్సెనియా విక్టోరియాను 5-0తో చిత్తుచేసి మెగాటోర్నీలో మేరీకోమ్ కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. ఇప్పటికే ఆరు స్వర్ణాలు, ఓ రజతంతో కొనసాగుతున్న మేరీకి ఇది ఎనిమిదో పతకం కావడం విశేషం. ఈ క్రమంలో క్యూబా దిగ్గజ బాక్సర్ ఫెలిక్స్ సావన్(7 పతకాలు)ను అధిగమిస్తూ అగ్రస్థానాన నిలిచింది. మరోవైపు ఇదే టోర్నీలో మేరీతోపాటు మంజు రాణి, జమునా బోరో, లవ్లీనా బోర్గొహైన్ సెమీస్‌లోకి ప్రవేశించి పతకాలు ఖాయం చేసుకున్నారు.

- వివరాలు ఆటలో

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

# పంచాయతీ సిబ్బందికి బీమా

### ఎస్కే డేకు నివాళిగా జీవితబీమా పథకం • ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన

సిబ్బంది మరణిస్తే.. కుటుంబానికి రూ.2 లక్షలు

**జిల్లాలకు 64 కోట్లు**

- ప్రతి కలెక్టర్‌కు రూ.2 కోట్ల నిధి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- ప్రతి నెల పంచాయతీలకు రూ.339 కోట్లు
- మొక్కల పెంపకం, చెత్తవేసే పనులకు నరేగా నిధులు
- ఇంటిని శుభ్రంగా ఉంచుకొంటే ఉత్తమ గృహం అవార్డు
- ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌పై మంత్రి ఎర్రబెల్లి నేతృత్వంలో కమిటీ
- విజయవంతమైన పల్లె ప్రగతి
- కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు
- విద్యుత్‌శాఖ పని తీరు అద్భుతం
- ఏటా మూడుసార్లు పల్లె ప్రగతి
- పల్లె ప్రగతి మాదిరిగానే పట్టణ ప్రగతి
- గిరిజన ప్రాంతాల్లో త్రీఫేజ్ కరంట్‌కోసం త్రిసభ్య కమిటీ
- కేంద్ర అవార్డులు పొందిన ముగ్గురు కలెక్టర్లకు సీఎం ప్రశంసలు


గురువారం ప్రగతిభవన్‌లో మంత్రులు, కలెక్టర్లు, డీపీవోలు, డీఎల్పీవోలు, ముఖ్య కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్.. సీఎస్ ఎస్కే జోషితో మాట్లాడుతున్న దృశ్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బంది కోసం పూర్తి ప్రభుత్వ ఖర్చుతో ఎస్కే డే జీవితబీమా పథకాన్ని అమలుచేయనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. పంచాయతీ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల బీమా సొమ్ము అందేలా పథకం ఉంటుందని వివరించారు. రైతుల కోసం అమలుచేస్తున్న రైతుబీమా మాదిరిగానే.. దేశంలో పంచాయతీరాజ్ ఉద్యమానికి ఆద్యుడైన ఎస్కే డే కు నివాళిగా ఈ జీవితబీమాకు ఆయన పేరు పెడుతున్నట్లు చెప్పారు. 30 రోజుల పల్లె ప్రణాళిక కార్యాచరణలో గుర్తించిన పనుల నిర్వహణకోసం జిల్లాలకు రూ.64 కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకం తదితర పనుల నిర్వహణలో అత్యవసరమైన చోట ఖర్చు పెట్టడానికి వీలుగా ప్రతి జిల్లా కలెక్టర్‌కు రూ.2 కోట్ల ప్రత్యేక నిధులు ఉంటాయని, వీటిని కలెక్టర్లు తమ విచక్షణతో వినియోగించాలని సీఎం చెప్పారు. ఈ మేరకు 32 జిల్లాలకు (హైదరాబాద్ జిల్లా మినహా) రాష్ట్ర ప్రత్యేక నిధుల నుంచి రూ.64 కోట్లు విడుదలచేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ప్రగతిభవన్‌లో మంత్రులు, కలెక్టర్లు, డీపీవోలు, డీఎల్పీవోలు, ముఖ్య కార్యదర్శుల సమావేశం జరిగింది. దాదాపు పదిగంటలపాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. గ్రామాల్లో పచ్చదనం- పరిశుభ్రత పెంచడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ (పల్లె ప్రగతి) దిగ్విజయంగా అమలైందని తెలిపారు. అన్ని గ్రామాల్లో పవర్‌వీక్ నిర్వహించి, విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ శాఖ అద్భుతంగా పనిచేసి, అన్ని శాఖల్లోకెల్లా

మిగతా 2వ పేజీలో

# రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేధం

### ఉత్పత్తి, అమ్మకాలను ఆపాలని సీఎం నిర్ణయం

### వచ్చే క్యాబినెట్‌లో విధివిధానాలపై చర్చ.. ఆమోదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పర్యావరణాన్ని విపరీతంగా దెబ్బతీస్తూ, జీవకోటి మనుగడకే ముప్పుగా మారిన ప్లాస్టిక్ ఉత్పత్తి, అమ్మకాలను రాష్ట్రంలో నిషేధించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కీలక నిర్ణయం తీసుకొన్నారు. పల్లె ప్రగతి ప్రణాళిక అమలు తీరుతెన్నులపై గురువారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం ఈ విషయాన్ని ప్రకటించారు. రానున్న మంత్రిమండలి సమావేశంలో ప్లాస్టిక్ నిషేధంపై వివరంగా చర్చించి ఆమోదిస్తామని.. ఆ వెంటనే ఉత్తర్వులు జారీచేస్తామన్నారు. ఇందుకు సంబంధించి విధివిధానాలను ఖరారుచేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని దేశవ్యాప్తంగా ఉద్యమస్ఫూర్తితో ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో సీఎం నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకొన్నది. మనం ఒకసారి వాడిపడేసిన ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వేల ఏండ్లు పడుతున్నది. రీసైక్లింగ్ చేయడం వల్ల వచ్చే విషవాయువులు పర్యావరణంతోపాటు ప్రజలకు హానికారకంగా మారుతున్నాయి. చెరువులు, కుంటలు, నదులు, సముద్ర తీరప్రాంతాలన్నీ కూడా ప్లాస్టిక్‌తో విపరీతంగా నిండిపోయి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. ముఖ్యంగా నీటిలో ఉండే జలచరాలతోపాటు, సాధుజంతువులకు కూడా ప్లాస్టిక్ అనేది ప్రాణాంతకంగా మారింది. సముద్రాల్లో ప్లాస్టిక్ మూలంగా జలచరాల సంఖ్య తగ్గిపోతున్నది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్నది. ప్లాస్టిక్ వల్ల అనర్థాలపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. ఈ నేపథ్యంలోనే దేశాన్ని ప్లాస్టిక్‌రహితం చేయాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు 500 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తాయి. నాలాలు, చెరువుల్లో వేసేవి మరో వంద టన్నుల వరకు ఉంటాయి. ప్లాస్టిక్ కవర్లు, సీసాలతో నాలాలు మూసుకుపోతున్నాయి. దీనివల్ల జంటనగరాల్లో కొంచెం వానపడ్డా రోడ్లు పొంగిపొర్లే పరిస్థితి

మిగతా 2వ పేజీలో

### కోడ్ ముగియగానే

# సమస్యల పరిష్కారం

- ప్రభుత్వోద్యోగులకు సీఎం కేసీఆర్ హామీ
- అక్టోబర్ 21 తర్వాత ఉద్యోగసంఘాల నేతలతో మాట్లాడతానన్న సీఎం
- పల్లె ప్రణాళిక విజయవంతంపై ఉద్యోగులకు సీఎం అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 21న ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వోద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యాక ఉద్యోగ సంఘాల నేతలను పిలిపించి సమస్యలపై మాట్లాడుతానని.. దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం, మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. పల్లె ప్రగతి ప్రణాళికను 30 రోజుల్లో ఉద్యోగులందరూ శ్రమించి విజయవంతంచేశారంటూ సీఎం అభినందించారని జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత చెప్పారు. ఉద్యోగులు గ్రామాలకు తరలివెళ్లి పనులుచేయించి, ఈ కార్యక్రమాన్ని సఫలం చేశారని ప్రశంసించారన్నారు. సీఎంను కలిసినవారిలో జేఏసీ సెక్రటరీలు, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

• విశ్రమించిన తెలంగాణ ఉద్యోగ గళం

# ఆమోస్ కన్నుమూత



- తెలంగాణ ఉద్యమ తొలితరం నేత
- ఉద్యోగులు, విద్యార్థుల్ని ఏకతాటిపైకి తెచ్చిన టీఎన్జీవో తొలి అధ్యక్షుడు
- ఆమోస్ ఉద్యమ స్ఫూర్తి మరువలేనిది
- సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమ తొలితరం నేత కేఆర్ ఆమోస్ ఇకలేరు. 1969 ఉద్యమంలో ముందువరుసలో నిలిచిన నాయకుడు ఆమోస్ గురువారం రాత్రి మల్కాజిగిరిలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1940లో సికింద్రాబాద్‌లో జన్మించిన ఆమోస్ నల్లగొండ జిల్లాకు చెందినవారు. ఆయనకు భార్య విద్యుల్లత ఉన్నారు. తన అక్క కుమారుడు అనిల్‌ను పెంచుకొన్నారు. ఆమోస్ అంత్యక్రియలు శుక్రవారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమోస్ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ఉద్యోగసంఘాల నాయకులు తమ సంతాపం వ్యక్తంచేశారు. తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేసిన ఆమోస్.. రెండు పర్యాయాలు శాసనమండలి సభ్యుడిగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్ర తొలి, మలి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన ఆమోస్ రాష్ట్ర ఉద్యమ కారణంగా ప్రభుత్వ

మిగతా 6వ పేజీలో

# సాఫీగా ప్రయాణం


గురువారం ఖమ్మం బస్టాండ్‌లో బస్సు నిండుగా ప్రయాణికులు

### రద్దీకి అనుగుణంగా సర్వీసులు

### రాష్ట్రంలో తిరిగిన బస్సులు 5,580

- నిరంతర పర్యవేక్షణలో అధికారులు
- ఆరోరోజూ కనిపించని సమ్మె ప్రభావం
- ఖమ్మంలో షెడ్యూల్ ప్రకారం ప్రజారవాణా
- వనపర్తి జిల్లాలో 85 శాతం నడిచిన బస్సులు
- నల్లగొండ జిల్లాలో అధిక చార్జీలు వసూలుచేసిన కండక్టర్లపై కేసు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:** దసరా పండుగ తిరుగు ప్రయాణం సాఫీగా సాగుతున్నది. పండుగలకు ఊరెళ్లిన వారంతా తిరుగుముఖం పట్టడంతో బస్టాండ్లలో రద్దీ పెరిగింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం బస్సుల సంఖ్యను పెంచి నడిపిస్తున్నది. ప్రభుత్వ ప్రత్యామ్నాయ చర్యలతో ఆరోరోజైన గురువారం కూడా ఆర్టీసీ సమ్మె ప్రభావం కనిపించలేదు. గురువారం మొత్తం 5,580 బస్సులు తిరుగగా అందులో 3,540 ఆర్టీసీ, 2,040 అద్దె బస్సులున్నాయి. వీటికి అదనంగా మరో ఆరువేల ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. రవాణా, పోలీసు, ఆర్టీసీ, రెవెన్యూశాఖల అధికారులు సమన్వయంతో బస్సులు నడిపిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ బస్సులు రోజువారీ షెడ్యూల్ తరహాలోనే తిరిగాయి. అర్ధరాత్రి 12 గంటలనుంచి మొదలయ్యే షెడ్యూల్ ప్రకారంగానే తాత్కాలిక సిబ్బందితో బస్సులు నడిపారు. వనపర్తి జిల్లాలో 85 శాతం బస్సులు తిరిగాయి. నారాయణపేట జిల్లాలో 60 శాతానికి పైగా బస్సులు నడిచాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ డిపోలో 60 శాతం, ఉట్నూర్ డిపోలో 70 శాతం బస్సులు ప్రయాణికులను చేరవేశాయి. నల్లగొండ జిల్లాలో ప్రయాణికుల నుంచి టికెట్ ధర కంటే అధిక మొత్తం వసూలుచేసిన ముగ్గురు తాత్కాలిక కండక్టర్లపై పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లాలో డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు.

వివరాలు 7వ పేజీలో

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 80.00 | రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్‌డ్ | 148.00 | స్కిన్‌లెస్ | 168.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 411.00 | రంగారెడ్డి | 411.00 |
| మెదక్ | 411.00 | కరీంనగర్ | 414.00 |
| వరంగల్ | 414.00 | చిల్లర ధర | 4.70 |

## భారత్‌కు మూడీస్ షాక్

ఈ ఏడాది వృద్ధి 5.8 శాతమే
ఆర్థిక మందగమన ప్రభావం
వృద్ధి అంచనాల్లో కోత

9

## ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియా!

- యూపీలో గుర్తించిన శివ్ నాడార్ వర్సిటీ శాస్త్రవేత్తలు
- పాలీస్టైరేన్‌ను విచ్ఛిన్నం చేస్తున్నట్టు నిర్ధారణ
- ఇది ప్లాస్టిక్ భూతాన్ని నియంత్రించే సహజసిద్ధ పరిష్కారమని వెల్లడి



5

## తెలంగాణ 79.. ఏపీ 150 టీఎంసీలు

కృష్ణా బోర్డు ముందు రెండు రాష్ట్రాల ఇండెంట్లు
పోతిరెడ్డిపాడు, కేసీ కెనాల్ నీటి లెక్కల్లో తేడా వాస్తవమే
3 బోర్డు సమావేశంలో అంగీకరించిన ఏపీ ఇంజినీర్లు

## రూ.1.76 లక్షల కోట్ల నష్టం

మూడేండ్లలో నిరర్థక 9
ఆస్తుల దెబ్బకు కుదేలైన బ్యాంకులు
రూ.100 కోట్ల కంటే అధిక మొండి బకాయిదారులు 416
భారీగా రుణాల రద్దు: ఆర్బీఐ వెల్లడి

## ప్లాస్టిక్ నిషేధంపై వచ్చే క్యాబినెట్‌లో ఆమోదం

- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని, ఈ నిర్ణయానికి రాబోయే క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలుపనున్నట్లు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం ట్విట్టర్‌లో ఆయన స్పందిస్తూ.. ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థంగా అమలుచేయడంకోసం పర్యావరణ ప్రేమికులు, ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.


వారాసిగూడలో దుకాణ యజమానికి జరిమానా విధిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

## ప్లాస్టిక్‌పై జీహెచ్ఎంసీ కొరడా

ఒక్కరోజే 13.80 లక్షల జరిమానా విధింపు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఒకవైపు స్వచ్ఛ ఉల్లంఘనలు, మరోవైపు నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై హైదరాబాద్ నగరపాలక సంస్థ పెద్దఎత్తున కదిలింది. వేర్వేరుచోట్ల తనిఖీలు నిర్వహించి గురువారం ఒక్కరోజే 226 మందికి 13.80 లక్షల జరిమానాలు విధించింది. 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం గల నిషేధిత ప్లాస్టిక్ సంచులను తయారుచేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్‌లో అధికారులు మూడు కంపెనీలను సీజ్ చేశారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న దుకాణాదారులకు 1.35 లక్షల జరిమానా విధించారు. రాంనగర్ క్రాస్‌రోడ్స్‌లో బాలాజీ పాపాలాల్ మిఠాయి బండార్‌కు రూ 50వేలు, ప్లాస్టిక్ కవర్లను రోడ్డుపై పారేసినందుకు షాపూర్‌నగర్ ఎంజే వైన్స్‌కు రూ. 50వేలు జరిమానా విధించారు. సికింద్రాబాద్ సర్కిల్‌లోని వారాసిగూడలోని ఒక దుకాణంలో నిల్వచేసి ఉన్న 10 నుంచి 20 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని దుకాణ యజమానికి భారీగా జరిమానా వేశారు.


కేంద్ర ప్రభుత్వం నుంచి అందుకున్న పారిశుద్ధ్య అవార్డుతో గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ దేవసేన. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఉన్నారు.


గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్వహించిన సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, తన్నీరు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్. చిత్రంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి కూడా ఉన్నారు

# పంచాయతీ సిబ్బందికి బీమా

మొదటిపేజీ తరువాయి...

నంబర్‌వన్‌గా నిలిచిందని చెప్పారు. పల్లె ప్రగతిని విజయవంతం చేసిన మంత్రులు, కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో), డివిజన్ లెవల్ పంచాయతీరాజ్ అధికారులు (డీఎల్పీవో), మండల పంచాయతీ అధికారులు (ఎంపీవో), గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు సీఎం అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని ఇకముందుకూడా కొనసాగించాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి నెలకు రూ.339 కోట్లు విడుదల చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ప్రతి జిల్లా కలెక్టర్ 30 రోజుల కార్యక్రమం అమలులో తమ అనుభవాలను సీఎంకు వివరించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు సమిష్టి ప్రణాళిక, కార్యాచరణ, అభివృద్ధి అనే ఆశయాలతో కార్యక్రమం నిర్వహించినట్లు కలెక్టర్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, పీసీసీఎఫ్ శోభ, డిస్కమ్‌ల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాలరావు పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

కలెక్టర్ల అనుభవాల అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడుతూ పల్లె ప్రగతి కార్యక్రమంతో మంచి ఫలితం వచ్చిందని, మన ఊరిని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలనే అవగాహన ప్రజల్లో కలిగిందని అన్నారు. ఈ స్ఫూర్తిని కొనసాగించడానికి భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామాలు బాగుపడాలనే ఉద్దేశంతో గ్రామ కార్యదర్శి నుంచి జిల్లా పంచాయతీ అధికారి వరకు అన్ని ఖాళీలను భర్తీచేసినట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నిధుల కొరత రానివ్వబోమని చెప్పారు. ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు 339 కోట్ల రూపాయల ఆర్థిక సంఘ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తున్నదని, ఇది క్రమం తప్పకుండా కొనసాగుతుందని సీఎం తెలిపారు. గ్రామ పంచాయతీలకు సమకూరే సొంత ఆదాయానికి ఇది అదనమని అన్నారు. చెట్లు పెంచే పనులకు, చెత్త ఎత్తివేసే పనులకు 'నరేగా' నిధులను వాడుకోవాలని సూచించారు. అవసరమైన సిబ్బందిని ఇచ్చామని, అవసరమైన నిధులను విడుదలచేశామని, ఇప్పటికైనా గ్రామాల్లో మార్పు జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎంచెప్పారు. జిల్లా పంచాయతీ అధికారులు బాధ్యత తీసుకుని, నిధులను సక్రమంగా వినియోగించుకొని, గ్రామాల్లో మార్పు తీసుకురావాలని కోరారు. గ్రామస్థాయిలో రూపొందించిన వార్షిక, పంచవర్ష ప్రణాళికలకు అనుగుణంగా పనులు జరుగాలన్నారు.

### ముగ్గురు కలెక్టర్లకు అభినందన

గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణలాంటి పనుల్లో చురుకైన పాత్ర పోషించి కేంద్రప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్న పెద్దపల్లి కలెక్టర్ దేవసేన, సంగారెడ్డి కలెక్టర్ హనుమంతరావు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ వెంకటేశ్వర్లును సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

### అడవులు తక్కువున్నచోట ప్రత్యేక శ్రద్ధ

తెలంగాణలో పచ్చదనం పెంచే లక్ష్యంతో చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని మరింత వ్యూహాత్మకంగా ముందుకు తీసుకుపోవాలని సీఎం సూచించారు. అడువులు తక్కువున్న కరీంనగర్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, వరంగల్ అర్బన్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట తదితర జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

### నరేగా నిధులతో ప్రతి ఇంటిలో సోక్‌పిట్స్

అన్ని గ్రామాల్లో ప్రతి ఇంట్లో నరేగా నిధులతో సోక్ పిట్స్ నిర్మించాలని సిఎం ఆదేశించారు. సోక్‌పిట్స్ వల్ల ఏ ఇంటిలోని వ్యర్థం, మురికి నీరు అక్కడే అంతర్ధానమై, గ్రామంలో దోమలు, ఈగలు వ్యాపించకుండా ఉంటాయని, అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు తగ్గుతాయన్నారు. ఇందువల్ల దీనిని అతి ముఖ్యమైనదిగా భావించాలని, సిద్దిపేట, పెద్దపల్లి జిల్లాలను ఆదర్శంగా తీసుకొని సోక్‌పిట్స్ నిర్మించాలని కోరారు. సోక్‌పిట్స్ నిర్మాణం కోసం అవసరమయ్యే నిధులను విడుదలచేయాలని అధికారులను కోరారు.

### పల్లె ప్రగతి.. ఇకపై ఏటా మూడుసార్లు..

ఇకపై పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఏటా మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఎం చెప్పారు. ప్రతి ఏడాది జూన్, సెప్టెంబర్, జనవరి మాసాల్లో పదిరోజుల చొప్పున పల్లె ప్రగతి నిర్వహించాలని పేర్కొన్నారు. పల్లె ప్రగతి మాదిరిగానే 20 రోజుల పాటు పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించాలని, దీనికోసం మార్గదర్శకాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.


గురువారం ప్రగతిభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

### సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పిన మరిన్ని విషయాలు

- 30 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన పనులు చాలావరకు జరిగాయి. శ్మశాన వాటికలు, డంప్‌యార్డులు, నర్సరీల ఏర్పాటుకు గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మిగిలిన గ్రామాల్లో కూడా వీలైనంత తొందరలో స్థలాలను గుర్తించాలి. ఏ శాఖ పరిధిలో ఉన్నా.. ప్రభుత్వ భూమి ఉంటే దాన్ని సామాజిక అవసరాలకు వాడుకోవాలి.
- వార్షిక, పంచవర్ష ప్రణాళికలు తయారయ్యాయి. గ్రీన్‌ప్లాన్ సిద్ధమైంది. దానికి అనుగుణంగా పనులు జరుగాలి.
- చెట్లకు నీళ్లు పోయడానికి, చెత్త సేకరణకు పంచాయతీలు ట్రాక్టర్లు కొనుక్కోవాలి. దానికి ట్యాంకర్, ట్రాలీ, ఫ్రంట్ బ్లేడ్ ఉండాలి.
- డీపీవో, డీఎల్పీవో, ఎంపీవోలకు క్రమం తప్పకుండా అలవెన్సులు అందించాలి.
- గ్రామంలో విధిగా నర్సరీ నిర్వహించాలి. మేకలు, ఇతర పశువులు మొక్కలను తినకుండా కంచె పెట్టాలి.
- ఇంటిని, పరిసరాలను పచ్చగా, శుభ్రంగా ఉంచుకునేవారి ఇండ్లకు ఉత్తమగృహం అవార్డు ఇస్తాం.
- గ్రామాల్లో బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ అమలు సాధ్యాసాధ్యాలను పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నాయకత్వంలోని కమిటీ పరిశీలిస్తుంది. కమిటీ నివేదిక ఇచ్చాక దీనిపై నిర్ణయం తీసుకొంటాం.
- పల్లె ప్రగతిలో గ్రామంలో వేలాడే తీగలను సరిచేసినట్లే, గ్రామం అవతల, వ్యవసాయ భూముల్లో, రోడ్లపైన, రోడ్ల పక్కన వేలాడే తీగలను విద్యుత్‌శాఖ సరిచేయాలి.
- ప్రతి గ్రామసరిహద్దులను నిర్ణయించాలి. గ్రామకంఠాన్ని ఖరారుచేయాలి. గ్రామరహదారులను ఆ పంచాయతీ పేర రిజిస్టర్ చేయాలి.
- ఈ ఏడాది 75 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నందున, ఆ ధాన్యాన్ని సేకరించేందుకు పౌర సరఫరాలశాఖ చర్యలు తీసుకోవాలి. అవసరమైనన్ని సేకరణ కేంద్రాలను ఏర్పాటుచేయడానికి కలెక్టర్లకు పూర్తి అధికారం ఉన్నది. అందరూ ఒకేసారి సరుకును మార్కెట్‌కు తేకుండా, నియంత్రిత పద్ధతిలో సేకరణ జరగాలి.
- గ్రామకంఠంలోని ఆస్తులు, స్థలాలు, ఇండ్లు ఏదో ఒక పద్ధతి ప్రకారం రికార్డు కావాలి. ఏదో ఒక రకమైన టైటిల్.. ఆస్తి సొంతదారులకు ఉండాలి. దీనికి ఏం చేయాల్నో ఆలోచన జరుగాలి. ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఉన్న అత్యుత్తమ విధానాలను పంచాయతీరాజ్ కార్యదర్శి అధ్యయనం చేయాలి. మనం తీసుకున్న నిర్ణయం దేశానికే ఒక మోడల్ కావాలి.
- గ్రామాల్లో లే ఔట్ ఎలా ఉండాలి? ఏం చేయాలి అనే దాని గురించి పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి అధ్యక్షతన నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి తెలియజేయాలి.
- గ్రామాల్లోగానీ, పట్టణాల్లోగానీ ఇండ్ల మీద నుంచి పోతున్న కరంట్ వైర్లు ఎక్కడెక్కడ ఎన్ని ఉన్నాయో గుర్తించాలి. వాటిని ఎలా తొలగించాలి? అందుకు అయ్యే ఖర్చు ఎంత? అన్న నివేదిక తయారుచేయాలి. తుప్పుపట్టిన కరంట్ స్తంభాలను మార్చి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.
- లంబాడీ తండాల్లో అటవీ భూములు ఎన్ని.. అటవీయేతర భూముల్లో ఎన్ని ఉన్నాయో గుర్తించాలి. తండాలు, గోండు గూడేలు, కోయ గూడేలు, సొంత జాగాల్లో ఎన్ని ఉన్నాయో కలెక్టర్లు లెక్కలు తీయాలి.
- గ్రామపంచాయతీలో నిర్ణయాలు, నిధుల వినియోగం ఏకస్వామ్యంగా ఉండకూడదు. సమిష్టిగా నిర్ణయాలు జరగాలి.
- డంప్ యార్డులపై షెడ్లు ఏర్పాటు చేయాలి. షెడ్లు లేకుంటే వర్షపు నీరు చేరి, కాలుష్యం వ్యాప్తిచెందే ప్రమాదమున్నది.
- పల్లె ప్రగతి మాదిరిగానే త్వరలోనే పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించాలి. గ్రామాలకు ఇచ్చినట్లే మున్సిపల్ ఎన్నికల తర్వాత పట్టణాలకూ ఆర్థికసంఘం నిధులు విడుదలచేస్తాం.
- పట్టణ పరిపాలనను మరింత పటిష్ఠపరిచే విధంగా సెంటర్ ఆఫ్ అర్బన్ ఎక్సలెన్సీ ప్రారంభించాలి.
- గ్రామాల అభివృద్ధికి విధానాల రూపకల్పన, అమలుకు.. పర్యవేక్షణ, శిక్షణ కోసం తెలంగాణ స్టేట్ అకాడమీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్‌ను బలోపేతంచేయాలి.
- గ్రామాలు, పట్టణాల్లో స్మృతివనాలు ఏర్పాటుచేయాలి. ఎవరైనా పుడితే వారి పేరు మీద మొక్కను నాటాలి. ఎవరైనా చనిపోతే వారి జ్ఞాపకం కోసం మొక్క పెట్టాలి.
- వీధిలైట్ల కోసం మీటర్ల బిగింపు పూర్తయిన వెంటనే, మీటర్ రీడింగుకు అనుగుణంగా ప్రతినెలా విద్యుత్ బిల్లులను విధిగా చెల్లించాలి.
- మంకీ పుడ్‌కోర్టులకోసం అవసరమైన పండ్ల మొక్కలను అటవీశాఖ సరఫరా చేయాలి. అటవీభూములు ఎక్కువగా లేనిచోట నదులు, ఉప నదులు, కాల్వలు, వాగులు, చెరువుల ఒడ్డున కోతులు తినడానికి ఉపయోగపడే పండ్ల చెట్లు పెంచాలి.

### పల్లె ప్రగతిలో జరిగిన పనులు

- 12,748 గ్రామాల్లో సమస్యలను గుర్తించేందుకు పాదయాత్రలు చేసి, వార్షిక ప్రణాళికలు తయారుచేశారు.
- 8,20,727 మంది సభ్యులతో స్టాండింగ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. వీరిలో 4,03,758 మంది మహిళలున్నారు.
- 1,24,837 చోట్ల ఇండ్లు, ఖాళీస్థలాల్లో శిథిలాల తొలగింపు పనులను గుర్తించి, 1,09,784 చోట్ల (87.94%) తొలగించారు.
- 2,77,657 ప్రదేశాలలో పిచ్చిమొక్కలు, సర్కారు తుమ్మలను గుర్తించి.. 2,67,535 చోట్ల (96.35 శాతం) తొలగించారు.
- 1,07,288 ఖాళీ ప్లాట్లు, కమ్యూనిటీ స్థలాలను గుర్తించి.. 99,770 చోట్ల (92.98 శాతం) పారిశుద్ధ్య పనులు పూర్తి చేశారు.
- నిరుపయోగంగా ఉన్న 22,167 బావులను గుర్తించి.. 16,380 (73.89 శాతం) బావుల్ని పూడ్చివేశారు. 11,065 పనికిరాని బోరుబావులను గుర్తించి.. 9,888 (89.36శాతం) బోరు బావుల్ని పూడ్చివేశారు.
- 68,862 పల్లపు ప్రాంతాల్ని గుర్తించి.. 64,540 (93.72శాతం) చోట్ల చదును చేశారు.
- 62,723 ప్రదేశాల్లో రోడ్లు, గుంతల్లో నీరు నిలిచినట్లు గుర్తించి.. 58,856 చోట్ల (93.83శాతం) మరమ్మతులుచేశారు.
- 1,30,775 ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి.. 1,25,791 చోట్ల (96.19శాతం) బ్లీచింగ్ పౌడర్, సున్నం చల్లించారు.
- 82,804 ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, పాఠశాలలు, దవాఖానలు, అంగన్‌వాడీ కేంద్రాలు మొదలైనవి అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి.. 80,420 సంస్థలను (97.12శాతం) శుభ్రంచేశారు. 29,25,390 మంది ప్రజలు శ్రమదానంలో పాల్గొన్నారు.
- 10,870 పంచాయతీల్లో శ్మశానవాటికల ఏర్పాటుకోసం స్థలాలు అవసరమని గుర్తించారు.
- డంప్‌యార్డుల కోసం 11,211 పంచాయతీల్లో స్థలాలను గుర్తించారు.
- 12,750 గ్రామాలు హరితహారం ప్రణాళికను సిద్ధం చేశాయి. 12,292 గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటయ్యాయి.
- 30 రోజుల ప్రణాళికలో వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 732.14 లక్షలు (7.32 కోట్ల) మొక్కలను నాటారు.
- గ్రామాల్లోకి వచ్చిన కోతులను అడవుల బాట పట్టించేందుకు ఉద్దేశించిన మంకీ పుడ్ కోర్టులను 1063 ఎకరాల్లో ఏర్పాటు చేశారు.

### విద్యుత్‌శాఖ నంబర్ వన్

**పల్లె ప్రగతి** కార్యాచరణ అమలులో విద్యుత్‌శాఖ నంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించిందని సీఎం కేసీఆర్ ఈ సమావేశంలో ప్రకటించారు. 30 రోజుల నిర్దేశిత కాలం ముగిసినప్పటికీ, విద్యుత్ సిబ్బంది ఇంకా గ్రామాల్లో పనులుచేస్తూనే ఉన్నారని ప్రశంసించారు. 1985 నుంచి తాను ఎమ్మెల్యేగా ఉన్నానని, అప్పట్నుంచి గ్రామాల్లో విద్యుత్ సంబంధ సమస్యలున్నాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటిదాకా ఇంత పెద్ద ప్రయత్నం జరుగలేదన్న సీఎం.. విద్యుత్ అధికారులు, కార్మికులను అభినందించారు. నిర్దేశించిన పనుల్లో ఇప్పటికే 60% పూర్తిచేసిన విద్యుత్‌శాఖ, మిగతాపనులకోసం ఇప్పటికీ గ్రామాల్లో విధులు నిర్వర్తించడం గొప్ప విషయమన్నారు.

#### పల్లె ప్రగతిలో విద్యుత్‌శాఖ భూమిక

- గ్రామాలవారీగా పవర్‌వీక్ నిర్వహించింది.
- వంగిపోయిన, తుప్పుపట్టిన స్తంభాలు.. 1,67,154 ఉన్నట్టు గుర్తించి సరిచేయగలిగినవి సరిచేశారు. తుప్పుపట్టినవాటి స్థానంలో కొత్తవి వేశారు. రెండు స్తంభాల మధ్య దూరం ఎక్కువైతే మధ్య వైర్లు వేలాడకుండా మూడో స్తంభాన్ని వేస్తున్నారు.
- వీధిలైట్ల నిర్వహణకోసం 6,834 కిలోమీటర్లమేర కొత్త వైరు వేస్తున్నారు. వీధి లైట్లకోసం ఏర్పాటుచేసిన మీటర్లలో పాడైపోయిన 7,527 మీటర్ల స్థానంలో కొత్తవాటిని బిగిస్తున్నారు. కొత్తగా 2,54,424 మీటర్లు బిగిస్తున్నారు.
- ఏజెన్సీ ప్రాంతాలతోపాటు, ఇతర ఎస్టీ తండాలు, గూడేలున్న ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎస్టీలు నివసించే ప్రాంతాల్లో విద్యుత్ సమస్య పరిష్కరించడానికి ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ నియమించారు. సోమేశ్‌కుమార్, రఘునందన్‌రావు, అజయ్‌మిశ్రా ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.09 గంటలకు

సూర్యాస్తమయం: 5.53 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, త్రయోదశి రాత్రి 10.19 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పూర్వాభాద్ర (శనివారం ఉదయం 5.09 వరకు), అమృతఘడియలు: రాత్రి 8.10 నుంచి 9.58 వరకు, రాహుకాలం: ఉదయం 10.33 నుంచి మధ్యాహ్నం 12.01 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.30 నుంచి 9.16 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.24 నుంచి 1.11 వరకు, వర్జ్యం: ఉదయం 9.24 నుంచి 11.12 వరకు.

### లోకం పోకడ




# విద్యుత్ సేవలకు గుర్తింపు

- సీఎం ప్రకటన హర్షణీయం
- జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం నిర్వహించిన 30 రోజుల ప్రణాళిక కార్యాచరణలో అన్ని శాఖల్లోకంటే విద్యుత్‌శాఖ అద్భుతంగా సేవలందించి ప్రథమస్థానంలో నిలువడం పట్ల జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. ప్రగతిభవన్‌లో గురువారం జరిగిన సమీక్షలో విద్యుత్‌శాఖ నంబర్ వన్‌గా నిలిచినట్టు సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సిబ్బంది రేయింబవళ్లు పనిచేసి, విద్యుత్ సంబంధిత పనులు చేశారని అభినందించారు. విద్యుత్ సిబ్బంది సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్‌కు ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, భవిష్యత్‌లో కూడా విద్యుత్ సమస్యలను వెనువెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అనేక సేవలు అందిస్తూ అటు ప్రభుత్వం, ఇటు ప్రజల నుంచి అభినందనలు అందుకోవడం వెనుక విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శ్రమ ఫలితం, సీఎం కేసీఆర్ మార్గనిర్దేశం కారణమని సీఎండీ పేర్కొన్నారు.



## రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేధం

మొదటిపేజీ తరువాయి...

నెలకొన్నది. హైదరాబాద్ నగరాన్ని ప్లాస్టిక్‌రహితంగా మార్చడానికి గతంలోనే జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఒక తీర్మానంచేసింది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై ఇప్పటికే నిషేధం ఉన్నది. ఇకపై 50 మైక్రాన్లకంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగమే కాకుండా ఉత్పత్తిని కూడా నిషేధిస్తారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సీఎం ఆదేశాలమేరకు అధికారులు రూపొందించనున్నారు. రానున్న మంత్రిమండలి సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు జారీచేస్తారు.

## ఊపందుకొన్న దరఖాస్తు ప్రక్రియ

మద్యం దుకాణాల దరఖాస్తులకు 16 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు ప్రక్రియ ఊపందుకొన్నది. ఈ నెల 9న స్వీకరణ ప్రారంభం కాగా రెండు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 450 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 16 వరకు గడువు ఉండగా 33 జిల్లాల్లోని 34 కేంద్రాల్లో దరఖాస్తులను తీసుకొంటున్నారు. ఆయా జిల్లాల పరిధిలోని ఎక్సైజ్ కార్యాలయాల్లో స్వయంగా అందజేయాలని, పోస్టు లో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపే దరఖాస్తులను అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలోని అమీర్‌పేట, నాంపల్లి, జూబ్లీహిల్స్, గోల్కొండ, ధూల్‌పేట, చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలకు హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ చల్లా వివేకానందరెడ్డి తెలిపారు.


గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు

## లా కాలేజీల్లో పెరిగిన ఫీజులు

- ఎల్ఎల్‌బీకి గరిష్ఠ ఫీజు రూ.30 వేలు
- ఎల్ఎల్ఎం గరిష్ఠ ఫీజు రూ.35 వేలు
- ప్రస్తుత కౌన్సెలింగ్ నుంచే అమలు
- లాసెట్ అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలోని న్యాయ కళాశాలల్లో 2019-20 నుంచి వరుసగా మూడు విద్యాసంవత్సరాలకు సంబంధించిన ట్యూషన్ ఫీజులను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇందుకు సంబంధించి గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఎల్ఎల్‌బీ (మూడు/ఐదు సంవత్సరాల) కోర్సు కనీస ఫీజును రూ.9 వేల నుంచి రూ.13,500కు పెంచిన ప్రభుత్వం.. గరిష్ఠ ఫీజును రూ.30 వేలకు పెంచింది. ఎల్ఎల్ఎం కనీస ఫీజును రూ. 16 వేలకు, గరిష్ఠ ఫీజును రూ. 35 వేలకు పెంచినట్టు లాసెట్ అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. మొత్తం అన్ని లా కాలేజీల్లో 16 శాతం నుంచి 40 శాతం మేరకు, కొన్ని కాలేజీల్లో రెండు రెట్ల వరకూ ఫీజులు పెరిగాయని అన్నారు. పెరిగిన ట్యూషన్ ఫీజులను ప్రస్తుతం కొనసాగుతున్న లాసెట్ కౌన్సెలింగ్‌లోనే అమలుచేస్తామని, ఆ ఫీజుల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలుచేస్తుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్ఎల్‌బీ మూడేండ్ల కోర్సును అందించే 21 కాలేజీల్లో 3,165 సీట్లు, ఐదేండ్ల కోర్సును అందించే 13 కాలేజీల్లో 1,064 సీట్లు, 15 ఎల్ఎల్ఎం కాలేజీల్లో 554 సీట్లు ఉన్నాయని వివరించారు.



ఈ నెల 13 నుంచి ఖమ్మం జిల్లా నారాయణపురంలోని తన స్వగృహంలో నిర్వహించనున్న సహస్ర చండీయాగంలో పాల్గొనాల్సిందిగా గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కేటీఆర్ కూడా ఉన్నారు.

## నేడు లాజిస్టిక్ పార్కు ప్రారంభం

- హాజరుకానున్న మంత్రులు కేటీఆర్, సబిత
- రూ.20కోట్లతో నిర్మాణం

**ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా మంగల్‌పల్లి వద్ద నిర్మించిన లాజిస్టిక్ పార్కును శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రారంభించనున్నారు. 22 ఎకరాల్లో రూ.20 కోట్లతో లాజిస్టిక్ పార్కును నిర్మించారు. గడువులోపే పూర్తిచేసిన లాజిస్టిక్ పార్కులో 250 ట్రక్కులను పార్కింగ్ చేసుకొనే అవకాశం ఉన్నది. అనంతరం మంత్రులు పటేల్‌గూడలో రూ.10.08 కోట్లతో రెండువందల డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణపనులకు శంకుస్థాపన చేయనున్నారు. హయత్‌నగర్ నుంచి కొత్తగూడ వరకు విజయవాడ హైవేపై రూ.4.8 కోట్లతో ఏర్పాటుచేసిన సెంట్రల్‌లైటింగ్ సిస్టంను ప్రారంభిస్తారు.

## వెలుగులోకి మరిన్ని కీలకాంశాలు

- ఐఎంఎస్ స్కాంలో ముగిసిన నిందితుల కస్టడీ
- మరో నలుగురిని కస్టడీకి ఇవ్వాలని కోర్టులో ఏసీబీ పిటిషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఎంఎస్ మందుల స్కాంలో కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా ఏడుగురు నిందితులను కస్టడీకి తీసుకున్న ఏసీబీ వారినుంచి కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, వరంగల్ జేడీ డాక్టర్ కే పద్మ, ఐఎంఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టోర్స్) డాక్టర్ కే వసంత ఇందిర, శంషాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీ గ్రేడ్-2 ఫార్మసిస్టు ఎం రాధిక, ఎంఐఎస్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హర్షవర్ధన్, ఓమ్నీ మెడి ఎండీ కే శ్రీహరిబాబు, ఓమ్నీమెడి రిప్రెజెంటేటివ్ నాగరాజును బుధ, గురువారాల్లో అధికారులు ప్రశ్నించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నిందితులను వేర్వేరుగా ప్రశ్నించి వారు చెప్పిన అంశాలను రికార్డుచేశారు. ఇప్పటికే వెలుగుచూసిన ఒరిజినల్ పర్చేజ్ ఆర్డర్లు, ఇండెంట్లు తదితర పత్రాలను చూపుతూ సమాచారం రాబట్టారు. దీంతో మరికొన్ని కొత్త విషయాలు వెలుగుచూశాయి. వాటి ఆధారంగా అధికారులు మరిన్ని సోదాలకు సిద్ధమవుతున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన మరో ఆరుగురిలో నలుగురు ఆర్సీపురం ఈఎస్ఐ సీనియర్ అసిస్టెంట్ ముదిమెల సురేంద్రనాథ్ బాబు, లైఫ్ కేర్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఎండీ బద్దం సుధాకర్‌రెడ్డి, బాలానగర్‌లోని వెంకటేశ్వర హెల్త్ సెంటర్ నిర్వాహకుడు చెరుకు అరవింద్‌రెడ్డి, నాచారం ఈఎస్ఐ ఫార్మసిస్టు కొడాలి నాగలక్ష్మిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో అధికారులు పిటిషన్ దాఖలుచేశారు.



# నేటినుంచి వరల్డ్ డిజైన్ అసెంబ్లీ

- 'హ్యూమనైజింగ్ డిజైన్' థీమ్‌తో అంతర్జాతీయ సదస్సు
- వివిధ దేశాల నుంచి ప్రముఖ డిజైనర్లు, ప్రతినిధులు హాజరు
- అన్ని ఏర్పాట్లతో ఆతిథ్యానికి సిద్ధమైన హెచ్ఐసీసీ
- మన దేశంలో ఇదే తొలిసారి

WDO — WORLD DESIGN ASSEMBLY HYDERABAD 2019 Humanizing Design

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ వేదికగా వరల్డ్ డిజైన్ అసెంబ్లీ (డబ్ల్యూడీఏ) శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. హెచ్ఐసీసీలో రెండురోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు వివిధ దేశాల నుంచి ప్రముఖ డిజైనర్లు, ప్రతినిధులు హాజరుకానున్నారు. వరల్డ్ డిజైన్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూడీవో), తెలంగాణ ప్రభుత్వం, ఇండియా డిజైన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సు పారిశ్రామిక డిజైనింగ్ రంగంలో సృజనాత్మకత పెరుగుదలకు దోహదం చేస్తుందని భావిస్తున్నారు. మన దేశంలో డబ్ల్యూడీఏ సదస్సును నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సదస్సుకు ఆతిథ్యమిచ్చేందుకు దేశంలోని అనేక నగరాలు పోటీపడినప్పటికీ హైదరాబాద్‌కున్న అనేక ప్రత్యేకతలు, సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక కృషి కారణంగా ఈ నగరంలోనే నిర్వహించేందుకు నిర్వాహకులు అంగీకరించారు. అంతర్జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించిన నగరాల జాబితా, వాతావరణ పరిస్థితులు, వసతి సదుపాయాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని సదస్సు నిర్వహణకు హైదరాబాద్‌ను ఎంపిక చేశారు. దేశ, విదేశాల నుంచి 600 మందికిపైగా ప్రతినిధులు హాజరుకానున్న డబ్ల్యూడీఏ 31వ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. 'హ్యూమనైజింగ్ డిజైన్' అనే థీమ్ (ఇతివృత్తం)తో నిర్వహించే ఈ సదస్సులో డబ్ల్యూడీవో, హెచ్‌డీడబ్ల్యూ సభ్యులు భారతీయ డిజైన్లను ప్రదర్శించనున్నారు. ప్రముఖ డిజైనర్లు, డిజైనింగ్ రంగానికి చెందిన నిపుణులు ఈ సదస్సులో ప్రసంగించనున్నారు.

### కార్యక్రమ షెడ్యూల్ ఇదీ..

ఈ సదస్సులో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉదయం రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ స్వాగతోపన్యాసం ముగిసిన తర్వాత 'మెటీరియల్ ఫ్యూచర్స్' అనే అంశంపై ప్యానల్ డిస్కషన్ నిర్వహించనున్నారు. 'గుడ్ డిజైన్ ఫర్ ఏ బ్యాడ్ వరల్డ్' అనే అంశంపై ఉదయం 10.15 గంటలకు డిజైన్ వ్యవస్థాపకుడు మార్కస్ ఫెయిర్స్ కీలకోపన్యాసం చేయనున్నారు. మేడిన్ ఇండియా, సుస్థిరమైన ఫ్యాషన్ అంశాలపై ప్యానల్ డిస్కషన్ నిర్వహించడంతోపాటు 'డిజైనింగ్ హ్యూమన్ ఎక్స్‌పీరియన్స్' అంశంపై చర్చిస్తారు. ఈ సదస్సు సందర్భంగా హెచ్ఐసీసీలో రెండురోజులపాటు (శుక్ర, శనివారం) ప్రత్యేక డిజైన్ ఎక్స్‌పోలో ప్రతిష్ఠాత్మక డిజైన్లను ప్రదర్శిస్తారు. భారత విద్యార్థులు, డిజైన్ ప్రొఫెషనల్స్ ప్రదర్శన ఉంటుంది. సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులు హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాలను చూసేందుకు 13న టూర్ ఏర్పాటుచేశారు.

### ప్రముఖ డిజైనర్ల రాక

మార్కస్ ఫెయిర్స్, టిమ్ కోబె, క్రిస్టియానో సెకాటో, జానె విథర్స్, ఎమ్మాగ్రిరో, ప్రతాప్ బోస్, రుచిక సచ్‌దేవా, సందీప్ సంగరు, శివ నల్లపెరుమాల్ తదితర ప్రపంచ ప్రఖ్యాత డిజైనర్లు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన చౌమొహల్లా ప్యాలెస్‌లో యునెస్కో సభ్యురాలు బీబీ రస్సెల్ ఫ్యాషన్ షో నిర్వహించనున్నారు. ప్లాస్టిక్‌తో రూపొందించిన ఉత్పాదనలతో వినియోగదారుల అలవాట్లలో వస్తున్న మార్పులను స్ట్రీట్ ఆర్ట్ ఫౌండేషన్ వివరించనున్నది. రెండేండ్లకోసారి జరిగే డబ్ల్యూడీఏ సదస్సును 1959లో తొలిసారి స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో నిర్వహించారు. 2007లో అమెరికా, 2009లో సింగపూర్, 2011లో తైవాన్, 2013లో కెనడా, 2015లో దక్షిణ కొరియా, 2017లో ఇటలీ ఈ సదస్సుకు ఆతిథ్యమిచ్చాయి.

# రికార్డు స్థాయిలో దిగుబడి

- వానకాలంలో 31.67 లక్షల ఎకరాల్లో వరినాట్లు
- ఈ ఏడాది ధాన్యం ఉత్పత్తి అంచనా 66.07 లక్షల మెట్రిక్ టన్నులు
- గతేడాది 61.55 లక్షల మెట్రిక్ టన్నులు



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** వానకాలం సీజన్‌లో ధాన్యం దిగుబడి రికార్డుస్థాయిలో నమోదవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. గతేడాది ధాన్యం ఉత్పత్తి 20 ఏండ్ల రికార్డును అధిగమించగా.. ఈ ఏడాది దానిని దాటి దిగుబడి వస్తుందని అధికారులు అంచనావేస్తున్నారు. గత వానకాలంలో 61.55 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కాగా, ఈసారి 66.07 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి కానున్నదని పేర్కొంటున్నారు. 2019-20 వానాకాలం సీజన్ గత నెలాఖరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో పంటల ముందస్తు అంచనా నివేదికను అర్థగణాంకశాఖ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది 28.75 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడతాయని, 59.57 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ ముందస్తుగా ప్రకటించింది. కానీ, నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పెద్దఎత్తున వర్షాలు కురియడం, జలాశయాలు, చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో 31.67 లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. దీంతో ధాన్యం దిగుబడి కూడా భారీగా పెరుగనున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు.

### పత్తి ఉత్పత్తి కూడా భారీగా..

వానకాలంలో అన్నిపంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, వర్షాలు సమృద్ధిగా పడటంతో 1.10 కోట్ల ఎకరాల్లో సాగయింది. అందులో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలు కాగా.. ఈ సీజన్‌లో ఏకంగా 46.48 లక్షల ఎకరాల్లో (108 శాతం) సాగయింది. పప్పు ధాన్యాల సాగు సాధారణ విస్తీర్ణం 10.37లక్షల ఎకరాలకుగాను 9.42 లక్షల (91శాతం) ఎకరాల్లో సాగు చేశారు. పత్తి గతేడాది 41 లక్షల బేళ్లు ఉత్పత్తి కాగా.. ఈసారి 45.93 లక్షల బేళ్లు ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. మొక్కజొన్న 13.79 లక్షలు, కందులు 1.94 లక్షలు, జొన్నలు 42 వేలు, పెసర 45 వేలు, వేరుశనగ 30 వేలు, సోయాబీన్ 2.82 లక్షలు, పసుపు 3.14 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి కానున్నాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఉత్పత్తి పెరుగుతుండడటంతో సర్కారు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టి సారించింది. దీనిద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూర్చాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేశారు. మరోవైపు యాసంగి సీజన్ కూడా ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయశాఖవర్గాలు తెలిపాయి.

## మాజీ మంత్రి మాదాటి ఇకలేరు

- అనారోగ్యంతో నర్సింహారెడ్డి కన్నుమూత
- సీఎం కేసీఆర్ సంతాపం
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం



మాదాటి నర్సింహారెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి. ఇన్‌సెట్‌లో (ఫైల్‌ఫొటో)

**హైదరాబాద్/మొగుళ్లపల్లి, నమస్తే తెలంగాణ:** మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత మాదాటి నర్సింహారెడ్డి (85) బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో అనారోగ్యంతో కన్నుమూశారు. మాదాటి మృతిపై సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లికి చెందిన నర్సింహారెడ్డి 1962లో సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1970లో పరకాల సమితి అధ్యక్షుడిగా, 1981లో జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1985లో శాయంపేట నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొంది 1994 వరకు ఎన్ జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి క్యాబినెట్‌లో పురపాలకశాఖ మంత్రిగా పనిచేశారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అత్యంత సన్నిహితంగా ఉండేవారు. హైదరాబాద్‌లోని నరసింహారెడ్డి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఫిల్మ్‌నగర్ సమీపంలోని మహాప్రస్థానంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

### సేవలను గుర్తుచేసుకొన్న సీఎం కేసీఆర్

మాదాటి నర్సింహారెడ్డి మృతిపై సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగంతుడిని ప్రార్థించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని ఆదేశించారు. మాదాటి మృతిపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ సంతాపం వ్యక్తంచేశారు.

# ఆరోగ్యశ్రీయే మెరుగు

- ఆయుష్మాన్‌భారత్‌తో తక్కువ మందికి లబ్ధి
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సదస్సుకు హాజరు
- అభివృద్ధి సాధిస్తున్న తెలంగాణకు కేంద్రం మద్దతివ్వాలని విజ్ఞప్తి



ఢిల్లీలో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సదస్సులో పాల్గొన్న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్, సహాయ మంత్రి అశ్విన్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కన్నా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం ఎంతో మెరుగైనది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రంలో కేవలం 24 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది. ఆరోగ్యశ్రీలో 85 లక్షల మందికి ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి' అని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. గురువారం ఢిల్లీలో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సదస్సు ప్రారంభ సమావేశంలో మంత్రి పాల్గొని వైద్యసంబంధిత అంశాలపై చర్చించారు. రెండు రోజులపాటు జరుగనున్న ఈ సదస్సుకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ చైర్మన్‌గా, కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అశ్విన్ వైస్ చైర్మన్‌గా ఉండగా.. రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ కోచైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ కింద రోగులకు చికిత్స నిమిత్తం అత్యధికంగా రూ.5 లక్షలు మాత్రమే ఇస్తున్నారని, ఆరోగ్యశ్రీలో రూ.13లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని గుర్తుచేశారు. మూత్రపిండాలు, గుండె మార్పిడి చికిత్సలు సైతం నిర్వహిస్తున్నామని వివరించారు. తెలంగాణలాంటి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రానికి కేంద్రం ఎక్కువ మద్దతు ఇవ్వాలని, నేషనల్ హెల్త్‌మిషన్ కింద ఇచ్చే నిధులను పెంచాలని, ఎన్‌హెచ్‌ఎం కింద రాష్ట్రంలో పనిచేస్తున్న వారందరికీ జీతభత్యాలు ఇవ్వాలని మంత్రి ఈటల కోరారు. రాష్ట్రాలకు కేంద్రానికి మధ్య సమన్వయం పెరుగాలని ఆకాంక్షించారు. సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు నేరుగా రాష్ట్రాలకు అందించేలా ఈ సదస్సులో నిర్ణయాలను తీసుకుంటారని ఆశిస్తున్నట్టు మంత్రి ఈటల పేర్కొన్నారు.

## ఏసీబీకి చిక్కిన కేటీపీఎస్ సీఈ

- రూ.మూడు లక్షలు తీసుకుంటుండగా పట్టివేత
- చీఫ్ ఇంజినీర్ ఆనందం రిమాండ్‌కు తరలింపు



రూ.మూడు లక్షల నగదుతో పట్టుబడిన కేటీపీఎస్ సీఈ ఆనందం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) చీఫ్ ఇంజినీర్ ఆనందం రూ.3లక్షలు లంచం తీసుకొంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. కేటీపీఎస్ 5,6 దశల్లో 21 పనులు చేసేందుకు పాల్వంచకు చెందిన వాహిని ఇంజినీరింగ్ సర్వీసెస్ యజమాని లలితామోహన్ టెండర్ దక్కించుకొన్నారు. పూర్తయిన ఈ పనులకు రూ.71 లక్షల నిధులు మంజూరు కావాల్సి ఉన్నది. ఇప్పటివరకు రూ.28 లక్షల బిల్లులు పూర్తయ్యాయి. మిగిలిన పనులకు కూడా బిల్లులు చేయాలని సీఈ ఆనందంను లలితామోహన్ ఈ నెల ఒకటిన కోరగా, రూ.10 లక్షలు ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. రూ.5 లక్షలకు లలితామోహన్ ఒప్పందం చేసుకొని అదేరోజు రూ.2 లక్షలు అందజేశారు. తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పథకం ప్రకారం గురువారం కార్యాలయంలోనే సీఈ ఆనందంకు లలితామోహన్ రూ.3 లక్షలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. నగదుతోపాటు 21 పనులకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఈకి చెందిన బ్యాంకు ఖాతాలు, ఇతర లావాదేవీల వివరాలను స్వాధీనం చేసుకొన్నారు. పాల్వంచలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో, గెస్ట్‌హౌస్‌లో, సీఈ కార్యాలయంలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తర్వాత సీఈ ఆనందంను రిమాండ్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీ ప్రతాప్, సీఐ రవీందర్, ఎస్సైలు రమణమూర్తి, క్రాంతి, ఇర్ఫాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ 79.. ఏపీ 150 టీఎంసీలు

- కృష్ణా బోర్డు ముందు రెండు రాష్ట్రాల ఇండెంట్లు
- పోతిరెడ్డిపాడు, కేసీ కెనాల్ నీటి లెక్కల్లో తేడా వాస్తవమే
- బోర్డు సమావేశంలో అంగీకరించిన ఏపీ ఇంజినీర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి తెలుగు రాష్ట్రాల నీటివినియోగ లెక్కలను కొలిక్కి తెచ్చేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అయితే వాస్తవ డిశ్చార్జి, రికార్డుల్లో నమోదు మధ్య తేడా ఉన్నదని ఏపీ ఇంజినీర్లు అంగీకరించారు. నవంబర్ వరకు తాగు, సాగునీటి అవసరాల కోసం ఏపీ 150 టీఎంసీలకు, తెలంగాణ 79 టీఎంసీలకు ఇండెంట్లు ఇచ్చాయి. గురువారం జలసౌధలోని బోర్డు కార్యాలయంలో తెలుగు రాష్ట్రాల ఇంజినీర్లతో సమావేశం జరిగింది. బోర్డు ఎస్ఈ ఆర్పీ ప్రకాశ్, డీఈ శ్రీధర్ తెలంగాణ తరపున డీసీఈ నరహరిబాబు, ఏపీ తరపున కర్నూలు ఎస్ఈతోపాటు పలువురు ఇంజినీర్లు సమావేశంలో పాల్గొన్నారు. పోతిరెడ్డిపాడు వాస్తవ డిశ్చార్జి కంటే రికార్డుల్లో 18 టీఎంసీల తేడా వచ్చిందని తెలంగాణ ఇంజినీర్లు తెలుపగా.. కేవలం మూడు టీఎంసీలేనని ఏపీ అధికారులు పేర్కొన్నారు. కేసీ కెనాల్‌లో 8.5 టీఎంసీలు తేడా ఉన్నదని తెలంగాణ వాదించగా.. 2.26 టీఎంసీలేనని ఏపీ తెలిపింది. దీనిపై బోర్డు అధికారులు స్పందిస్తూ తేడా ఎన్ని టీఎంసీలు అనేది పక్కనబెడితే అసలు తేడా రావడమే సమంజసం కాదన్నారు. వాస్తవ డిశ్చార్జినే రికార్డుల్లో నమోదుచేయాలని.. అలా చేయని పక్షంలో వివాదాలకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా కేటాయింపు మేరకు నీటి పరిమాణం వస్తున్నదని ఏపీ ఇంజినీర్లు తెలుపడంతో అక్కడి సమస్య కొలిక్కివచ్చినట్టయింది. కృష్ణా డెల్టాకు సంబంధించి రెండు రాష్ట్రాల ఇంజినీర్ల మధ్య బిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. పట్టిసీమ ద్వారా 21.97 టీఎంసీల గోదావరిజలాల్ని వినియోగించుకున్నామని, ఈ నేపథ్యంలో కృష్ణాజలాల వినియోగాన్ని తమ ఖాతాలో వేయొద్దని ఏపీ ఇంజినీర్లు చెప్పారు. కృష్ణా బేసిన్‌లో విస్తారమైన ఇన్‌ఫ్లోలు ఉండి, సముద్రంలో కలుస్తున్న సమయంలో గోదావరి నీటిని ఎందుకు లిఫ్టు చేశారని తెలంగాణ ఇంజినీర్లు ప్రశ్నించారు. ఈనెల 15న జరిగే కృష్ణా బోర్డు వర్కింగ్ మాన్యువల్ సమావేశంలో లెక్కలను కొలిక్కి తేవాలని నిర్ణయించారు.

### ఇండెంట్లకు రెండు రోజుల్లో అనుమతి

నవంబర్ వరకు అవసరాలకు రెండు రాష్ట్రాలు బోర్డుకు ఇండెంట్లు సమర్పించాయి. 79 టీఎంసీలకు తెలంగాణ, 150 టీఎంసీలకు ఏపీ ఇండెంట్లు ఇచ్చాయి. బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండురోజుల్లో నీటి విడుదల ఉత్తర్వులకు చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## యూరియా అక్రమాలపై విజిలెన్స్ విచారణ

- మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యూరియా పంపిణీలో అక్రమాలు జరిగినట్టు గురువారం మీడియాలో వచ్చిన వార్తలపై వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగొద్దని నిత్యం పర్యవేక్షిస్తూ యూరియా రవాణా చేస్తున్నా.. అక్రమాలు జరిగాయనే వార్తల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ జరిపించాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శిని మంత్రి ఆదేశించారు. అక్రమాలు జరిగితే బాధ్యులైన వారందరిపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాయింట్ ఆఫ్ సేల్ (పాస్) ద్వారా ఆన్‌లైన్ విధానం అమలుచేస్తున్నామని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని, రైతులపై బాధ్యతలేనితనాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లుపొడిచే అధికారులు, సిబ్బంది విషయంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.



మేళ్లచెర్వు మండలం వేపలమాధవరంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య తదితరులు ఉన్నారు.



మేళ్లచెర్వు మాజీ ఉపసర్పంచ్ పసుపులేటి నాగేశ్వరరావుకు టీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో అభ్యర్థి సైదిరెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు ఉన్నారు.

# ఉత్తమ్ ఆటలిక సాగవు

- టీఆర్‌ఎస్‌కు ఓటేస్తే హుజూర్‌నగర్‌కు లాభం
- రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నియోజకవర్గంలో జోరుగా టీఆర్‌ఎస్ ప్రచారం

**హుజూర్‌నగర్, నమస్తేతెలంగాణ/మేళ్లచెర్వు/నేరేడుచర్ల/గరిడేపల్లి:** ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మాయమాటలు చెప్తూ గెలుస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆటలు ఇక సాగవని, హుజూర్‌నగర్ అభివృద్ధి చెందాలంటే టీఆర్‌ఎస్‌ను గెలిపించాలని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెర్వు మండలం వేపలమాధవరంలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డితో కలిసి మంత్రి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన ఉత్తమ్ తనను గెలిపిస్తే ముఖ్యమంత్రిని అవుతానని, ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయంలో కేంద్ర మంత్రిని అవుతానని ప్రజలను మభ్య పెట్టి గెలుపొంది పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్న టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే నాలుగేండ్లలో అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. ఉత్తమ్, జానారెడ్డి సహా రైతులందరికీ రైతుబంధు ఇచ్చిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉత్తమ్‌కు ఓటేసి సమస్యలు సైదిరెడ్డికి చెప్తే పరిష్కారం కావని, ఉత్తమ్ పదవి లేకుండా ఉండలేడని, తనకే కాక భార్యకు కూడా పదవి కావాలా అని ప్రశ్నించారు. సైదిరెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ.. ఒక్కసారి ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లో అభివృద్ధిలో దూసుకుపోయేలా కృషిచేస్తానని చెప్పారు. ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు కందిబండలో నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళనైన తనను ఓడించడానికి ఇంత మంది వచ్చారంటున్న పద్మావతికి 2014 ఎన్నికల్లో శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను ఓడించినప్పుడు ఆ సోయిలేదా అని ప్రశ్నించారు. సినీ దర్శకుడు శంకర్ మాట్లాడుతూ.. సైదిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దగ్గరగా ఉండే రాజేశ్వర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి సహకారంతో అధిక నిధులు తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మేళ్లచెర్వు ఉపసర్పంచ్ పసుపులేటి నాగేశ్వరరావుతోపాటు కందిబండకు చెందిన పలువురు టీఆర్‌ఎస్‌లోచేరారు. ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, తేరా చిన్నపరెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వేమిరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి మండలం పొనుగోడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, శానంపూడి సైదిరెడ్డి సతీమణి రజిత తదితరులు

### 59 గ్రామాలను చుట్టివచ్చిన సైదిరెడ్డి

నియోజకవర్గంలో 141 గ్రామాలకుగాను టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గురువారం వరకు 59 గ్రామాల్లో ప్రచారాన్ని పూర్తిచేశారు. హుజూర్‌నగర్‌లో మిల్లర్స్ అసోసియేషన్, దుకాణాల సముదాయ ఓనర్స్ అసోసియేషన్ల సమావేశంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొనగా, తెలంగాణ రాష్ట్ర ఖాదీబోర్డు చైర్మన్ మౌలానా యూసఫ్ జాహిద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేళ్లచెర్వు మండలంలో అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు ప్రచారం నిర్వహించారు. గరిడేపల్లి మండలం పొనుగోడులో మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, శానంపూడి రజిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌లో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ సమక్షంలో కాంగ్రెస్ నుంచి 100 కుటుంబాలు టీఆర్‌ఎస్‌లో చేరాయి. నేరేడుచర్లకు చెందిన లారీ ఓనర్స్, డ్రైవర్లు టీఆర్‌ఎస్‌లో చేరగా వారికి రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### మంత్రి జగదీశ్‌రెడ్డి వాహనం తనిఖీ

**గరిడేపల్లి:** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి శివారులో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ వద్ద గురువారం విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. హుజూర్‌నగర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సూర్యాపేట నుంచి గరిడేపల్లి వైపునకు వస్తుండగా చెక్‌పోస్ట్ వద్దకు రాగానే కారును ఆపి తనిఖీ చేస్తామని చెక్ పోస్ట్ అధికారులు శరత్, రాములు కోరడంతో జగదీశ్‌రెడ్డి వారికి సహకరించారు.



ఆర్టికల్ 370ని రద్దుచేయటాన్ని కాంగ్రెస్, ఎన్సీపీ వ్యతిరేకించాయి.
370 ఆర్టికల్‌ను వారు ఎందుకు వ్యతిరేకించారో మహారాష్ట్ర ప్రజలకు చెప్పాలి.
370ని రద్దుచేస్తే రక్తం ఏరులై ప్రవహిస్తుందని రాహుల్ గాంధీ అన్నాడు.
కానీ ప్రభుత్వం ఒక్క బుల్లెట్ కూడా కాల్చలేదు.

**అమిత్ షా, కేంద్రహోంమంత్రి**

చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కశ్మీర్ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామన్నాడు.
మరి ప్రధాని మోదీ హాంగ్‌కాంగ్‌లో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనలను,
ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమాలను ప్రస్తావించాలి కదా.
టిబెట్‌లో చైనా అనుసరిస్తున్న అణిచివేత, దక్షిణ చైనా సముద్రంలో చైనా తీరును
ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నది.

**మనీష్ తివారీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**



**చరిత్రలో నేడు**



**1737**

కలకత్తాలో భూకంపం. సుమారు 3 లక్షల మంది మృతి. సగానికిపైగా నాశనమైన కలకత్తా.

**1972**

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న పనామా.





**1977**

భూమి మీదికి చేరుకున్న సోయజ్-25.

జపాన్‌లో వచ్చే కొన్నేండ్లలో వైద్య ఖర్చులు బాగా పెరిగేటట్టు ఉన్నాయి. జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. 2025 నాటికి 65 ఏండ్లు దాటిన వృద్ధుల సంఖ్య ముప్పై శాతానికి చేరుకుంటుంది. దవాఖానాలను పునర్వ్యవస్థీకరిస్తామని ప్రభుత్వం అంటున్నది. మారుమూల ప్రాంతాలకు వైద్య చికిత్స అందడం, వృద్ధులకు అవసరమైన చికిత్సలపై దృష్టి పెట్టాలె. క్యాన్సర్ వంటి వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందించాలె. ప్రభుత్వ దవాఖానలు అందించే తరహా వైద్యాన్ని ప్రైవేటు దవాఖానలలో లభించదు.

**ది జపాన్ టైమ్స్**

ఒక వ్యక్తి తన నిరసన ర్యాలీకి హాజరుకావాలని పోతున్నాడు. ఒక మూక అతడు తన నిరసన వ్యక్తీకరించకుండా దాడిచేయాలని ప్రయత్నిస్తున్నది. హింస జరుగుతున్నదనే సాకుతో పోలీసులు నిరసన వ్యక్తంచేసే వ్యక్తిని అరెస్టు చేయవచ్చా? పన్నెండేండ్ల కింద జరిగిన ఈ ఘటనలో పోలీసులు నిరసన వ్యక్తీకరించే వ్యక్తిని అరెస్టు చేయకూడదని కెనడా సుప్రీంకోర్టు గతవారం తీర్పు ఇచ్చింది. హింస జరుగుతుందనే కారణం చూపి చట్టబద్ధంగా నిరసన చెప్పే హక్కును కాలరాయలేమని కోర్టు హితవు చెప్పింది. ఇటువంటి అరెస్టులు జరిగితే నిరసనలు జరుగకుండానే నిరోధించడం జరుగుతుందని అభిప్రాయపడ్డది.

**ది గ్లోబ్ అండ్ మెయిల్**



# సంక్షేమం కోసం విజ్ఞానం

విజ్ఞాన శాస్త్రరంగాలలో మన అవగాహనను, పురోభివృద్ధినీ అర్థం చేసుకోవడానికి, చర్చించడానికి నోబెల్ బహుమతులు ప్రకటించడం ఒక సందర్భాన్ని సృష్టిస్తుంది. వైజ్ఞానికరంగంలో అంతకంతకూ వస్తున్న మార్పులు మానవాళి జీవితాలను ఎంతగా ప్రభావితం చేస్తున్నాయో తెలిసిందే. ఈ ఏడాది భౌతిక, రసాయనిక, శరీరశాస్త్ర రంగాలలో ప్రకటించిన నోబెల్ బహుమతులు మానవ జీవనాన్ని ప్రభావితం చేసేవిగానే కాకుండా, అత్యున్నతస్థాయి పరిశోధనాశక్తిని ఎత్తిచూపేవిగా ఉన్నాయి. భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి ముగ్గురు శాస్త్రవేత్తలకు లభించింది. వీరిలో విశ్వ ఆవిర్భావం, నిర్మాణానికి సంబంధించి కొత్త చూపును ప్రదర్శించిన జేమ్స్ పీబుల్స్‌కు, సౌర మండలానికి ఆవల ఉన్న గ్రహాలను కనుగొన్న మైకెల్ మేయర్, డైడియెర్ క్వెలోజ్‌లకు ఈ పురస్కారం లభించింది. లిథియం అయాన్ బ్యాటరీలను వృద్ధి చేసినందుకు ముగ్గురు శాస్త్రవేత్తలు– జాన్ బి గుడెనఫ్, స్టాన్లీ విటింఘమ్, అకిరా యోషినోలకు రసాయన శాస్త్ర నోబెల్ పురస్కారం లభించింది. తమ పరిశోధన ప్రపంచాన్ని ఇంతగా ప్రభావితం చేస్తుందని పరిశోధకులు కూడా ఊహించి ఉండరు. స్మార్ట్‌ఫోన్స్, లాప్‌టాప్స్‌తో మొదలైన ఈ బ్యాటరీలు విద్యుత్ వాహనాలనూ నడిపిస్తున్నాయి. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం కోసం వెదుకులాడుతున్న దశలో ఈ లిథియం అయాన్ బ్యాటరీలు అందివచ్చాయి. వైర్లతో అనుసంధానం లేకుండా విద్యుత్‌ను భారీగా నిలువ చేసుకోగలగడం, తేలికగా ఉండటం ఎంతో ఉపయోగకరంగా మారింది. వైద్య రంగంలో– శరీరంలోని కణాలు ఆక్సిజన్ మోతాదులను గుర్తించడంతో పాటు ఈ వాయువు స్థాయికి అనుగుణంగా స్పందించే సంక్లిష్ట ప్రక్రియ గుట్టు విప్పినందుకు విలియం కేలిన్ జూనియర్, సర్ పీటర్ రాట్‌క్లిఫ్, గ్రెగ్ సీమెంజాలకు నోబెల్ పురస్కారం లభించింది. శరీరంలో ఆక్సిజన్ మోతాదు పెరుగకూడదు, తగ్గకూడదు కనుక కణాలు ఆయా సందర్భాన్ని బట్టి ఏర్పాట్లు చేసుకుంటాయి. ఈ పరిశోధన క్యాన్సర్ వంటి రోగాలకు కొత్త చికిత్సా విధానానికి దారితీస్తుందని భావిస్తున్నారు.

**మతవాదుల దాడులకు భయపడకుండా తమ ప్రయోగాలను సాగించి నిజాలను నిర్భయంగా బయటపెట్టిన ఘనత శాస్త్రవేత్తలది. అయితే ఇటీవలికాలంలో రెండురకాల పోకడలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకటి–మళ్లా మతవాదం పెరిగిపోయి శాస్త్రీయ, హేతుబద్ధ ఆలోచన ధోరణులపై దాడులు సాగించడం. మరొకటి శాస్త్ర పరిశోధనలను సమాజ హితం కోసం కాకుండా వ్యాపార దృక్పథంతో సాగించడం, తద్వారా మానవ వినాశనానికి దోహదపడటం. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం మానవాళి సంక్షేమానికి దోహదపడేదిగా ఉండాలె.**

ప్రాచీనకాలంలో తత్త్వవేత్తలు ఏ ఉపకరణాలు లేకుండానే చేసిన శాస్త్ర ప్రతిపాదనలు ఆ తర్వాత ధ్రువపడిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రాచీనులు ఆదిమధ్యాంత రహితమంటూ వ్యాఖ్యానించిన విశ్వస్వరూపం కూడా ఇప్పటికీ ఉత్కంఠదాయకంగానే ఉన్నది. మన దేశంలో ఆర్యభట్ట గ్రహ వ్యవస్థ నమూనాను ప్రతిపాదించడం విశేషం. విశ్వం పుట్టుకను, నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి ఎంత పరిశోధించినా అంతు చిక్కకుండా ఉంటుంది. ఈ ఏడాది భౌతికశాస్త్ర నోబెల్ పురస్కారం పొందిన వారిలో ఒకరైన జేమ్స్ పీబుల్స్ తన బృందంతో సాగించిన పరిశోధనలో విశ్వం పుట్టుకనాటి సాంద్ర ఉష్ణవాయు ధార్మికతను గుర్తించారు. ఈ పరిశోధన విశ్వ నిర్మాణాన్ని అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతుంది. మిగతా ఇద్దరు శాస్త్రవేత్తలు మైకెల్ మేయర్, డైడియెర్ క్వెలోజ్ సౌర మండలం వెలుపల గల గ్రహాలను తొలిసారిగా గుర్తించిన ఘనతకు నోబెల్ బహుమతికి అర్హులయ్యారు. విశ్వమంతా అనేక నక్షత్రాలు, వాటి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు, ఉపగ్రహాలు ఉన్నాయనే అవగాహన మనకు ఎంతోకాలంగా ఉన్నది. కానీ ఇదిగో ఫలాన గ్రహం ఫలానా చోట ఉన్న ది అంటూ వాటిని శాస్త్రబద్ధంగా నిరూపించగలుగాలె. గ్రహాల గురుత్వాకర్షణకు ప్రభావానికి నక్షత్రంలో కనిపించే కదలికను కొత్త పద్ధతి ద్వారా వీరు గుర్తించడం ద్వారా నిరూపించారు. ఇప్పుడు హబుల్ వంటి టెలిస్కోపుల ద్వారా కూడా గుర్తించగలుగుతున్నాం. అనంత ఆకాశంలో అల్లంత దూరాన గ్రహం ఒక బిందువు పరిణామంలో కనిపించినా పరిభ్రమణాక్రమంలో నక్షత్రానికి అడ్డువచ్చి మసక చేస్తుంది. దీనిద్వారా గ్రహ ఉనికి స్పష్టమవుతుంది. ఈ ఇరువురు పరిశోధకులు సౌరమండలం బయట గ్రహాన్ని మొదట గుర్తించిన తర్వాత ఇప్పటివరకు నాలుగు వేలకు పైగా సుదూ ర గ్రహాలను గుర్తించగలిగాం.

ఒకప్పుడు ఛాందసవాదుల పెత్తనం సాగినప్పుడు శాస్త్రవిజ్ఞానాన్ని నమ్మడమే పెద్ద నేరంగా భావించే పరిస్థితి ఉండేది. మతవాదుల దాడులకు భయపడకుండా తమ ప్రయోగాలను సాగించి నిజాలను నిర్భయంగా బయటపెట్టిన ఘనత శాస్త్రవేత్తలది. అయితే ఇటీవలికాలంలో రెండురకాల పోకడలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకటి–మళ్లా మతవాదం పెరిగిపోయి శాస్త్రీయ, హేతుబద్ధ ఆలోచన ధోరణులపై దాడులు సాగించడం. మరొకటి శాస్త్ర పరిశోధనలను సమాజ హితం కోసం కాకుండా వ్యాపార దృక్పథంతో సాగించడం, తద్వారా మానవ వినాశనానికి దోహదపడటం. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం మానవాళి సంక్షేమానికి దోహదపడేదిగా ఉండాలె. మానవాళిని, పర్యావరణాన్ని నాశనం చేసేదిగా మారకూడదు. ఈ ఏడాది భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మైకెల్ మేయర్ వెల్లడించిన అభిప్రాయం ఆలోచింపదగినది. 'మనం సౌరమండలం అవతలి గ్రహాలు ఎంతో... ఎంతో దూరంలో ఉన్నాయి. నివాసయోగ్యమైన గ్రహం ఇంకా ఎంతో దూరంగా ఉంటుంది. ఇప్పుడున్న హంగులతో అక్కడికి చేరుకోవడానికి కోట్ల ఏండ్లు పడుతుంది. మనం అక్కడికి వలసపోలేము. అందువల్ల మన సుందరమైన, పూర్తిగా నియోసయోగ్యమైన ఈ భూగోళాన్నే జాగ్రత్తగా చూసుకుందాం'.

**జనగళం**

### నాయకుల తప్పిదమే..

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న సమ్మె వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో క్యాట్‌కార్డులు, బస్సుపాసులు చెల్లకపోవడం పక్కనపెడితే అధికంగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇక ప్రైవేట్ వాహనదారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. అందినకాడికి దోచుకుంటున్నారు. దసరా పండుగ కోసం పల్లెలకు పోయినవారు మళ్లీ పట్టణాలకు చేరుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. పండుగ సీజన్‌లో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే. సమస్యలు ఉంటే సమ్మె పోరాటం చేయటం తప్పు కాదు, కానీ ఆర్టీసీ ఉద్యోగులు పండుగను అడ్డుపెట్టుకొని సమ్మె చేయటం గర్హనీయం. ఇప్పటికైనా ప్రజల కష్టాలను చూడాలి.

**- షేక్ ఇస్లాం షరీఫ్, శాంతినగర్**

### కాలువలు పునరుద్ధరించాలె

రాష్ట్రంలో గత వారం పది రోజులుగా కురుస్తున్న వర్షాలు చూస్తే గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులన్నీ నిండుకుండలవుతాయని ఆశించటం సహజం. కానీ కోపులల్లకు కూడా నీరు రాలేదు. కారణం.. చెరువులోకి వరద నీరు వచ్చే కాలువలన్నీ కబ్జాలకు గురయ్యాయి. రియల్ ఎస్టేట్ కారణంగా ఫీడర్ కాలువలన్నీ పూడుకుపోయాయి. దీంతో చాలా చెరువులు వరద నీటికి నోసుకోక నకనకలాడుతున్నాయి. కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా చెరువులన్నింటికి వరద కాలువలు ఉండేట్లు చర్యలు తీసుకోవాలి.

**- మొగుళ్ల శ్రీనివాస్, వలిగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా**

### రోడ్లను బాగుచేయాలె

నగరంలో ఇటీవల రోజూ కురుస్తున్న వానలతో చాలా ప్రాంతాల్లో రోడ్లు వర్షపు నీరుకు కొట్టుకుపోయి గుంతలుగా మారాయి. మరికొన్న చోట్ల ఇసుక మేటలు వేయటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు అయితే పడిపోతున్నాయి. కాబట్టి వర్షపు నీటితో కొట్టుకుపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- విష్ణు, హయత్‌నగర్, హైదరాబాద్**


**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118


**ప్రాజెక్టులు**



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

# 'కాళేశ్వరం'లో ఎత్తిపోతల ప్రక్రియ

**శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ట్రయల్‌రన్ కోసం వరద కాలువకు నీటిని ఎత్తిపోయడం జరిగింది. ఈ నీరంతా ఎల్లంపల్లి నుంచి తీసుకున్నప్పటికీ ఆ నీరు కాళేశ్వరం నీరే తప్ప వేరుకాదు. ప్రాజెక్టు విమర్శకులు కడెం నీళ్లతో కాళేశ్వరం సోకులు అంటూ అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సబబు కాదు. ప్రాజెక్టు రూపకల్పనా సమయంలో ముఖ్యమంత్రి ఏ కలగన్నారో అది ఇవ్వాళ్ళ సాక్షాత్కారమైంది.**

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఒక్క చుక్క నీరు కూడా ఎత్తిపోయలేదు. ఎత్తిపోసిన నీరంతా కడెం నుంచి ఎల్లంపల్లికి వచ్చిన నీరేనని ఇటీవల కొందరు మాట్లాడుతున్నారు. ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం లింక్ 2 పంపుల ద్వారా మిడ్ మానేరుకు, అక్కడి నుంచి లోయర్ మానేరుకు, వరద కాలువకు ఎత్తిపోసిన నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసినవే కానీ కాళేశ్వరం నీరు కాదని వారు భావిస్తున్నారు. ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్వరూప స్వభావాలపై, ఎత్తిపోతల ప్రక్రియపై ఏ మాత్రం అవగాహన లేని విశ్లేషణ ఇది. ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రత్యేకమైన ప్రాజెక్టుగా పరిగణించడంవల్ల వచ్చిన చిక్కు ఇది. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిలభ్యత నీటి వినియోగాలపై అవగాహన లేకుండా చేసిన మాటలు. ప్రాజెక్టులో నీటిలభ్యత నీటి వినియోగం ఈ కింది పట్టికలో గమనించవచ్చు. ఇవి కేంద్ర జల సంఘం ఆమోదించిన వివరాలు.

**ప్రాజెక్టులో నీటి లభ్యత**

| క్ర.సం. | వివరాలు | టీఎంసీ |
|---|---|---|
| 1 | గోదావరి నుంచి ఎత్తిపోసే నీరు | 195 |
| 2 | ఎల్లంపల్లి ప్రాజెక్టులో లభ్యమయ్యే నీరు | 20 |
| ఎ | ఎల్లంపల్లి వద్ద మొత్తం నీటి లభ్యత | 215 |
| 3 | ఆన్‌లైన్ చెరువుల పరీవాహక ప్రాంతంలో నీటి లభ్యత | 10 |
| 4 | ఆయకట్టు ప్రాంతంలో భూగర్భ జలాల రీచార్జ్ ద్వారా నీటి లభ్యత | 25 |
| 5 | ఆవిరి నష్టాలు | -10 |
| | ప్రాజెక్టు వినియోగానికి నికరంగా నీటి లభ్యత (+3+4-5) | 240 |

**ప్రాజెక్టులో నీటి వినియోగం**

| క్ర.సం. | వివరాలు | టీఎంసీ |
|---|---|---|
| 1 | కొత్త ఆయకట్టుకు సాగు నీరు | 134.5 |
| 2 | శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూర్, వరదకాలువ ఆయకట్టు స్థిరీకరణ (18.82) లక్షల ఎకరాల్లో మొత్తంగా 25 శాతం నీటికొరతను పరిగణించి) | 34.5 |
| 3 | హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా | 30 |
| 4 | దారి పొడుగునా గ్రామాలకు తాగునీరు | 10 |
| 5 | పారిశ్రామిక అవసరాలకు | 16 |
| 6 | ఆవిరి నష్టాలు | (-) 12 |
| | ప్రాజెక్టులో మొత్తం నీటి వినియోగం | 237 |

పై పట్టికను పరిశీలిస్తే తెలిసే విషయం ఏమిటంటే.. ఎల్లంపల్లి ప్రాజెక్టు వేరు కాదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమే. కాబట్టి ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోయడం అంటే కాళేశ్వరం నీరు ఎత్తిపోయడమే. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఎత్తిపోసే నంది పంప్‌హౌజ్ (ప్యాకేజీ 6), గాయత్రి పంప్‌హౌజ్ (ప్యాకేజీ 8) కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించినవే. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసే ప్రక్రియ ఎట్లా ఉంటుందో తెలియక వారు తప్పుడు వాదనలు చేస్తున్నారని భావించాలి.

కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసే ప్రక్రియ ఎట్లా ఉంటుంది? మూడు మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశాలు కాళేశ్వరం సిస్టంలో ఉన్నది. మొదటిది శ్రీరాంసాగర్‌కు వరద వచ్చినప్పుడు వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు, కాకతీయ కాలువ ద్వారా దిగువ మానేరు చేరుతాయి. ఇవిపోగా ఇంకా వరద ఉంటే గేట్ల ద్వారా నదిలోకి వదులుతారు. అవి ఎల్లంపల్లికి వెళ్తాయి. ఎల్లంపల్లి నిండితే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డకు వెళ్తాయి. ఆ తర్వాత తుపాకులగూడెం ద్వారా పోలవరానికి వెళ్తాయి. శ్రీరాంసాగర్‌కు కనీసం మూడేండ్లకు ఒకసారి అయినా వరద వచ్చే అవకాశం ఉన్నదని గత 25 ఏండ్ల వరద చరిత్ర చూస్తే తెలుస్తున్నది. శ్రీరాంసాగర్‌కు వరద వచ్చిన స్థితిలో కాళేశ్వరం లింక్–1 పంపులు (మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి), లింక్–2 పంపులు (ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు) తిప్పే అవసరం రాదు.

ఇక రెండోస్థితి శ్రీరాంసాగర్‌కు వరద రాకున్నా ఎల్లంపల్లికి కడెం నది నుంచి, శ్రీరాంసాగర్ ఎల్లంపల్లికి మధ్యన ఉన్న పరీవాహక ప్రాంతం నుంచి వరదవచ్చే అవకాశం ఉన్నది. ఈ స్థితిని ఈ సంవత్సరం మనం చూశాం. ఈ స్థితిలో కాళేశ్వరం లింక్–1 పంపులు తిప్పే అవసరం రాదు. ఎల్లంపల్లి నుంచే లింక్–2 పంపులు తిప్పి నీటిని మిడ్‌మానేరుకు చేరవేయడం, అక్కడి నుంచి ఎగువకు కొండ పోచమ్మసాగర్ దాకా ఎత్తిపోయడం, దిగువ మానేరుకు, అక్కడి నుంచి కాకతీయ కాలువ ద్వారా శ్రీరాంసాగర్ మొదటిదశ, రెండోదశ ఆయకట్టుకు నీటి సరఫరా, పునరుజ్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్ జలాశయానికి నీటిని ఎత్తిపోయడం జరుగుతుంది.

మూడోదిపై రెండుచోట్ల నీటిలభ్యత లేని సందర్భాల్లో మాత్రమే లింక్–1, లింక్–2 పంపులను తిప్పవలసిన అవసరం ఏర్పడుతుంది.

ఈ సంవత్సరం జూన్, జూలై నెలల్లో రాష్ట్రమంతా కరువు పరిస్థితులు నెలకొని ఉన్న సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి నీటిని ఎల్లంపల్లికి ఎత్తిపోసే ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. గోదావరి నది విజయవంతంగా 115 కి.మీ ఎదురెక్కివచ్చింది. మేడిగడ్డ జలాశయం నుంచి లక్ష్మీ పంప్‌హౌజ్ ద్వారా 12 టీఎంసీలు అన్నారం జలాశయానికి, అన్నారం జలాశయం నుంచి సరస్వతి పంప్‌హౌజ్ ద్వారా 5 టీఎంసీలు సుందిళ్ల జలాశయానికి, పార్వతి పంప్‌హౌజ్ ద్వారా సుందిళ్ల జలాశయం నుంచి ఎల్లంపల్లి జలాశయానికి 0.25 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం జరిగింది. ఈ లోపున ఎగువన కడెం, ఎల్లంపల్లి పరీవాహక ప్రాంతం నుంచి వరద రావడం ప్రారంభమైంది. వెంటనే ప్రభుత్వం లింక్–1 పంపులను ఆపివేసింది. ఎల్లంపల్లిలో ఎఫ్ఆర్ఎల్ వరకు నీరు చేరగానే లింక్ 2 పంపుల ద్వారా మిడ్ మానేరుకు ఎత్తిపోసే ప్రక్రియ ప్రారంభమైంది. లింక్–2 పంపుల ద్వారా ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు 12 టీఎంసీలు, శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకంలో బిగించిన పంపుల వెట్‌రన్ కోసం 2 టీఎంసీలు వరద కాలువకు ఎత్తిపోయడం జరిగింది. మిడ్‌మానేర్‌లో 15 టీఎంసీల నీరు నిండిన తర్వాత డ్యాం క్రెస్ట్ గేట్లను తెరిచి లోయర్ మానేరుకు10 టీఎంసీల నీటిని తరలించడం జరిగింది. అదేవిధంగా శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ట్రయల్‌రన్ కోసం వరద కాలువకు నీటిని ఎత్తిపోయడం జరిగింది. ఈ నీరంతా ఎల్లంపల్లి నుంచి తీసుకున్నప్పటికీ ఆ నీరు కాళేశ్వరం నీరే తప్ప వేరుకాదు. ప్రాజెక్టు విమర్శకులు కడెం నీళ్లతో కాళేశ్వరం సోకులు అంటూ అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం సబబు కాదు. ప్రాజెక్టు రూపకల్పనా సమయంలో ముఖ్యమంత్రి ఏ కలగన్నారో అది ఇవ్వాళ్ళ సాక్షాత్కారమైంది. జూలైలో వానలు లేక కరువు తాండవిస్తున్నది. అయినా గోదావరి నది 150 కిలోమీటర్ల పొడవున సజీవమైంది. గోదావరి నీరు దిగువన మేడిగడ్డ నుంచి అన్నారం, అన్నారం నుంచి సుందిళ్ల, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి ఎదురెక్కి వస్తుంటే ప్రజలు గోదావరి మాతకు జల నీరాజనం పట్టినారు. జల భోజనాలు, జల జాతరలు నిర్వహించుకున్నారు. కరువు కాలంలో గోదావరి ఇట్లా ఎదురెక్కి రావడం వారికి ఒక కొత్త అనుభవం. ఇక గోదావరి ఎండిపోయే పరిస్థితి రాదు. అక్టోబర్ నుంచి వానలు కురువయి. అయితే దిగువ గోదావరిలో నీటి ప్రవాహాలు గణనీయంగా ఉంటాయి. కనుక వర్షాలు లేనికాలంలో నీటిని మేడిగడ్డ జలాశయం నుంచి ఎత్తిపోయడం తప్పదు. అది కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్–1కు ఉన్న ప్రాధాన్యం. ఈ ప్రాధాన్యం గోదావరి ఎదురెక్కి వస్తున్న సందర్భంలోనేనని ప్రజలకు అర్థమైంది. విమర్శకులు మాత్రం వెనుకబడిపోయారు.


**గోదావరి నది 150 కిలో మీటర్ల పొడవున సజీవమైంది. గోదావరి నీరు దిగువన మేడిగడ్డ నుంచి అన్నారం, అన్నారం నుంచి సుందిళ్ల, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి ఎదురెక్కి వస్తుంటే ప్రజలు గోదావరి మాతకు జల నీరాజనం పట్టినారు. జల భోజనాలు, జల జాతరలు నిర్వహించుకున్నారు. కరువు కాలంలో గోదావరి ఇట్లా ఎదురెక్కి రావడం వారికి ఒక కొత్త అనుభవం. ఇక గోదావరి ఎండిపోయే పరిస్థితి రాదు. అక్టోబర్ నుంచి వానలు కురువయి. అయితే దిగువ గోదావరిలో నీటి ప్రవాహాలు గణనీయంగా ఉంటాయి. కనుక వర్షాలు లేనికాలంలో నీటిని మేడిగడ్డ జలాశయం నుంచి ఎత్తిపోయడం తప్పదు. అది కాళేశ్వరం ప్రాజెక్టులో లింక్-1కు ఉన్న ప్రాధాన్యం.**


**(వ్యాసకర్త: ముఖ్యమంత్రి ఓఎస్డీ)**

# 'ముప్పై' రోజుల స్ఫూర్తి కొనసాగాలె

**పల్లెప్రగతి**



**అనభేరి రాజేశ్వర్ రావు**

రాష్ట్ర ఆవిర్భావ అనంతరం దేశంలో రాష్ట్రాలన్నింటికి ఆదర్శప్రాయంగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తున్నది. భౌతిక వనరులు, ప్రకృతి వనరులు, మానవ వనరుల అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పరితపిస్తున్నది. ఇందులో భాగంగానే మన గ్రామాలను, మన పల్లెలను మనమే అభివృద్ధి చేసుకుందామని ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన గ్రామాభ్యుదయ ముప్పై రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకున్నాం. ఈ కార్యక్రమాన్ని ముప్పై రోజులకు మాత్రమే పరిమితం చేయకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించి తెలంగాణ గ్రామాలు అభ్యుదయ, ఆదర్శగ్రామాలుగా రూపుదిద్దాలనే గొప్ప సంకల్పంతో ముందుకుపోవాలి.

పంచాయతీల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు స్థానిక సంస్థలకు కావాల్సిన నిధులు ప్రతి నెల నిరాటంకంగా విడుదల చేస్తున్నది. నిధులపై, విధులపై స్పష్టతనిచ్చి అధికారాలు కూడా బదలాయించింది. అయినా కూడా గ్రామాలు బాగుపడకపోతే ఎలా? స్వాతంత్ర్యం వచ్చి 72 ఏండ్లు పూర్తయ్యాయి.ఈ సందర్భంగానైనా గ్రామాల్లో మార్పు రావాలని ప్రభుత్వం ముప్పైరోజుల కార్యక్రమాన్ని తలపెట్టింది. కాబట్టి ప్రజలందరూ త్రికరణ శుద్ధితో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిత్యం కొనసాగించాల్సిన చారిత్రక అవసరం ఉన్నది. గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డుసభ్యులే కాకుండా యూత్ సభ్యులు, ఉద్యోగులు, మహిళా సంఘాలు, పదవీవిరమణ చేసిన ఉద్యోగులు, విద్యార్థులు సంఘటితంగా కదిలి ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమంలో భాగస్వాములై గ్రామా పాలనలో గుణాత్మక మార్పునకు కృషిచేయాలి.

తెలంగాణ పల్లెలు ఆదర్శ గ్రామాలుగా విలసిల్లాలని చేస్తున్న కృషి ఎనలేనిది. ఇందులో భాగంగానే చెత్త సేకరణ, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నది. కూలిపోయిన ఇండ్లు, పాడైపోయిన పశువుల కొట్టాలు, గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను ఎప్పటికప్పుడు తొలిగిస్తున్నది. పనికిరాని బావులను, బోరు బావులను పూడ్చేస్తున్నది. దోమల మందు పిచికారీ చేస్తూ ప్రజలను విషజ్వరాల నుంచి కాపాడుతున్నది. అక్కెరకు రాని మొక్కలను తొలిగిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటిస్తున్నది. వైకుంఠధామాల నిర్మాణాలు చేపట్టడం, గ్రామాల్లోని చెత్త కోసం డంపింగ్ యార్డులు ఏర్పాటుచేయడం, గ్రామ కమ్యూనిటీ హాళ్లు, గోదాముల నిర్మాణం చేపట్టడం లాంటి అనేక బృహత్తర కార్యక్రమాలను చేపడుతున్నది. గ్రామాలకు కావాల్సిన వార్షిక, పంచవర్ష ప్రణాళికలను రూపొందిస్తున్నది. గ్రామాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం వీధి దీపాల కోసం ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. శిథిలావస్థ కు చేరిన విద్యుత్ స్తంభాలను మరమ్మతులు చేయటమే కాదు, కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నది. ఇనుప స్తంభాలను తొలిగించి సిమెంట్ స్తం భాలను ఏర్పాటు చేస్తున్నది. తెలంగాణకు హరితహారంలో భాగంగా చేయాల్సిన పనుల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ నర్సరీలను ఏర్పాటుచేయడం, నరేగా నిధులను ఉపయోగించి మండల అటవీశాఖ అధికారి నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నది. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి అవి ఎదిగేవరకు ప్రజలను భాగస్వాములను చేస్తున్నది. ఇంటి యజమానులు, రైతులతో మాట్లాడి వారికి కావాల్సిన మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తున్నది. వేప, చింత, నిమ్మ, ఉసిరి, మునగ, జామ, మామిడి చెట్లను అధికంగా పెంచేందుకు ప్రోత్సహిస్తున్నది. గ్రామా ల్లో వందకు వందశాతం పన్నులు వసూలు చేసి, గ్రామ సచివాలయాలను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు ప్రయత్నిస్తున్నది. దీంతో గ్రామాలకు సంబంధించిన చిన్న చిన్న అవసరాలు వెంటనే తీరే పరిస్థితి వస్తుంది. వారాంతపు సంతల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్లను వెంటనే నమోదుచేసి వెంటనే ధృవపత్రాలను అందజేస్తున్నది. విద్యుత్ సంస్థకు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించటం, గ్రామ పరిధిలోని పరిశ్రమలు, కంపెనీలతో సంప్రదించి సాం ఘిక బాధ్యతగా కమ్యూనిటీ, సోషల్ రెస్పాన్స్‌బిలిటీ నిధులు కేటాయించేలా కృషిచేస్తున్నది. ఆ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించటం, గ్రామ ప్రజలకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నది. ఇంతేకాకుండా గ్రామస్థులను, యువకులను శ్రమదానానికి ప్రోత్సహించి సామాజిక పను లు చేపట్టాలి. తద్వారా మన గ్రామాలు ఆదర్శగ్రామాలుగా రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

గ్రామాల్లో యువతీయువకులు, విద్యార్థులు ప్రభుత్వ పథకాలన్నింటిపైనా అవగాహన పెంపొందించుకోవాలి. తద్వారా గ్రామాల్లోని నిరక్షరాస్యులకు, ప్రజలకు గ్రామ సభల్లో పాల్గొనే విధంగా సంపూర్ణ అవగాహన కల్పించాలి. నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించేందుకు డిజిటల్ లిటరసీని పెంపొందించేందుకు కృషి జరుగాలి. గ్రామాల్లో చదువుకున్న వారు,ఉద్యోగులు బాధ్యత కలిగిన పౌరులుగా, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషిచేయాలి. వయోజన విద్యా కార్యక్రమం సైతం అమలయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. తద్వారా మన తెలంగాణ పల్లెల్ని అక్షరాస్యత గల గ్రామా లుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం సూచించిన ముప్పైరోజుల కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలుపరిచిన ప్రజలు, ఇక ముందు కూడా తెలంగాణ రాష్ట్రం దేశ సమగ్రాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించేలా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. రాష్ట్ర పౌరులు, విద్యావంతులు, స్వచ్ఛంద సేవాసంస్థల, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఎన్.ఎస్.ఎస్., ఎన్సీసీ, స్కౌట్స్ జగైడ్స్, యువజన సంఘాలు, వయోజన విద్య, గ్రంథాలయ శాఖ ఉద్యోగులు, గ్రామ పరిపాలనలో భాగస్వాములయ్యే అధికారులందరూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా సమన్వయంతో స్వచ్ఛందంగా పాల్గొనాలి. మన పల్లెల్ని, మన గ్రామాలను మనమే తీర్చిదిద్దుకోవాలి. ఇందుకోసం మనమే చైతన్యపరుచుకోవాలి. గ్రామ వికాసానికి మనమంతా అంకితభావంతో సంఘటితమై పనిచేసినప్పుడే గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ఆవిష్కారమవుతుంది. స్వచ్ఛత, పచ్చదనం, మౌలిక వనరులు, వసతులతో గ్రామ సమగ్రాభివృద్ధి సాధించాలి. ఇదే సీఎం కేసీఆర్ తలపెట్టిన ముప్పై రోజుల గ్రామాభివృద్ధి ప్రణాళిక, కార్యాచరణకు అర్థం, పరమార్థం.


**గ్రామాల్లో యువతీయువకులు, విద్యార్థులు ప్రభుత్వ పథకాలన్నింటిపైనా అవగాహన పెంపొందించుకోవాలి. తద్వారా గ్రామాల్లోని నిరక్షరాస్యులకు, ప్రజలకు గ్రామసభల్లో పాల్గొనే విధంగా సంపూర్ణ అవగాహన కల్పించాలి. నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించేందుకు డిజిటల్ లిటరసీని పెంపొందించేందుకు కృషి జరుగాలి. గ్రామాల్లో చదువుకున్న వారు,ఉద్యోగులు బాధ్యత కలిగిన పౌరులుగా, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషిచేయాలి.**



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి రండి!

మాజీ ప్రధాని మన్మోహన్‌ను ఆహ్వానించిన పాక్



**ఇస్లామాబాద్:** కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవంలో పాల్గొనాలంటూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అధికారికంగా ఆహ్వానించారు. ఈ విషయాన్ని ఆ దేశ విదేశాంగ శాఖ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు ఆయన నేతృత్వంలో అన్ని పార్టీల సభ్యులతో కూడిన బృందాన్ని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ కూడా ఆహ్వానించారు. తన ఆహ్వానాన్ని మన్మోహన్ కూడా అంగీకరించారన్నారు. ఇంకోవైపు, పాక్ ఆహ్వానంపై తమకు ఇప్పటివరకూ ఎలాంటి సమాచారం అందలేదని మన్మోహన్ కార్యాలయం పేర్కొంది. కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి మన్మోహన్ హాజరుకాకపోవచ్చని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్ శివీందర్ అరెస్ట్



**న్యూఢిల్లీ:** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ రాన్‌బాక్సీ, ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ ప్రమోటర్ శివీందర్ సింగ్‌తోపాటు మరో ముగ్గురిని ఢిల్లీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. రూ.2397 కోట్ల రుణాన్ని ఇతర కంపెనీల్లోకి మళ్లించారన్న అభియోగంపై శివీందర్, కవి అరోరా, సునీల్ గోధ్వానీ, అనిల్ సక్సేనా తదితరులను ఢిల్లీ పోలీసు ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శివీందర్ సింగ్ సోదరుడు మాల్వీందర్ సింగ్ పరారీలో ఉన్నాడు. ఆయనపై లుక్‌ఔట్ సర్క్యులర్ జారీచేశారు. శివీందర్, మాల్వీందర్ తమను మోసగించడంతోపాటు తీసుకున్న రూ.2.397 కోట్ల రుణాన్ని దుర్వినియోగం చేశారని రెలిగేర్ ఫైన్ఇన్వెస్ట్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్ఎల్) గత ఏడాది డిసెంబర్‌లో ఫిర్యాదు చేసింది. సింగ్ సోదరులపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదుచేసింది. ఈ ఏడాది ఆగస్టులో సింగ్ సోదరుల ఇండ్లు, కార్యాలయాలపై ఈడీ దాడులు జరిపింది.

## దేశంలో తగ్గిన అంధత్వం

- 1.2 కోట్ల కేసుల నుంచి 48లక్షలకు
- డబ్ల్యూహెచ్‌వో లక్ష్యానికి చేరువగా ఉన్నామన్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** అంధత్వ నివారణలో భారత్ మెరుగైన ఫలితాలను సాధిస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) లక్ష్యానికి చేరువైంది. 2007తో పోల్చితే దేశంలో అంధత్వం 47 శాతం మేర తగ్గిందని ప్రభుత్వ సర్వే వెల్లడించింది. 2006-07లో అంధత్వంతో 1.20 కోట్ల మంది బాధపడగా.. ఈ సంఖ్య 2019 నాటికి 48 లక్షలకు తగ్గిందని తెలిపింది. 2020 నాటికి దేశ జనాభాలో అంధత్వాన్ని 0.3 శాతానికి తగ్గించాలన్న డబ్ల్యూహెచ్‌వో లక్ష్యానికి అతి చేరువగా ఉన్నామని పేర్కొంది. 2006-07లో దేశ జనాభాలో అంధత్వం 1 శాతం ఉండగా.. ప్రస్తుతం 0.36 శాతానికి తగ్గిందని, రానున్న రోజుల్లో డబ్ల్యూహెచ్‌వో లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపింది. కంటిపై ఏర్పడే పొరల వల్ల అంధత్వానికి గురికావడం సాధారణంగా మారిందని, 66.2 శాతం మంది ఇలాంటి సమస్యతోనే అంధులుగా మారుతున్నారని ప్రభుత్వం తెలిపింది. అంతేగాక కార్నియా దెబ్బతినడం వల్ల 7.4శాతం మంది, కంటి శస్త్రచికిత్స సందర్భంగా సమస్యలు తలెత్తి 7.2 శాతం మంది కంటి చూపు కోల్పోతున్నారని వెల్లడించింది. దేశంలో అంధత్వంపై కేంద్ర ఆరోగ్య శాఖ సహకారంతో ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సెంటర్ ఫర్ అప్తాల్మిక్ సైన్సెస్ సర్వే చేపట్టింది. 2015-18 మధ్య జరిగిన ఈ సర్వే నివేదికను గురువారం కేంద్ర ఆరోగ్యమంత్రి హర్షవర్ధన్ విడుదల చేశారు.



# ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియా



- యూపీలో గుర్తించిన శివ్ నాడార్ వర్సిటీ శాస్త్రవేత్తలు
- పాలీస్టెరేన్‌ను విచ్ఛిన్నం చేస్తున్నట్టు నిర్ధారణ
- ఇది ప్లాస్టిక్ భూతాన్ని నియంత్రించే సహజసిద్ధ పరిష్కారమని వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** పర్యావరణానికి పెను ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్‌ను ఆహారంగా తీసుకునే బ్యాక్టీరియాను భారతీయ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఉన్న 'శివ్ నాడార్ యూనివర్సిటీ'కి చెందిన పరిశోధకులు ఈ ఘనత సాధించారు. తమ వర్సిటీ పక్కనున్న తడి భూముల్లో ప్లాస్టిక్‌ను తినే రెండు రకాల బ్యాక్టీరియాను కనుగొన్నట్టు వర్సిటీ జీవశాస్త్ర విభాగం, స్కూల్ ఆఫ్ నాచురల్ సైన్సెస్ పరిశోధకులతో కూడిన బృందం ప్రకటించింది. వీటికి 'ఎక్సిగొ బ్యాక్టీరియం సిబిరికమ్ డీఆర్-11, ఎక్సిగొ బ్యాక్టీరియం అండే స్ట్రెయిన్ డీఆర్-14' అని పేర్లు పెట్టింది. ఇవి ప్లాస్టిక్‌లోని ముఖ్య రసాయన సమ్మేళనమైన 'పాలీస్టెరేన్'ను విచ్ఛిన్నం చేసి, దానిలోని కార్బన్‌ను ఆహారంగా తీసుకుంటున్నట్టు వెల్లడించింది. క్యారీ బ్యాగ్‌లు, టీ కప్పులు, ప్యాకింగ్ కవర్లు వంటి ఒకేసారి వాడి పారేసే ప్లాస్టిక్‌లో (సింగిల్ యూజ్ ప్లాస్టిక్-ఎస్‌యూపీ) 'పాలీస్టెరేన్' కీలక సమ్మేళనం. దీనిలోని అణువులు బరువుగా ఉండటంతోపాటు బలమైన బంధాలతో పెనవేసుకొని ఉంటాయి. దీంతో ఎస్‌యూపీ విచ్ఛిన్నం కావడానికి ఏండ్ల సమయం పడుతున్నది. 'మేము కనుగొన్న డీఆర్-11, డీఆర్-14 బ్యాక్టీరియా.. ప్లాస్టిక్‌లోని పాలీస్టెరేన్ అణువులను ఆవాసంగా చేసుకొని తమ సంతతిని పెంచుకుంటాయి. ఆ అణువులపై ఒక జీవపొర మాదిరిగా ఏర్పడుతాయి. అనంతరం అవి విడుదల చేసే 'హైడ్రోలైజింగ్ ఎంజైమ్' పాలీస్టెరేన్‌లోని కార్బన్ అణువుల మధ్య బంధాలను బలహీనం చేస్తుంది. చివరగా ప్లాస్టిక్ విచ్ఛిన్నం అవుతుంది' అని పరిశోధకులు వివరించారు. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న ప్లాస్టిక్ భూతానికి తమ పరిశోధన పరిష్కారం చూపుతుందని వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, పరిశోధకుల బృందానికి సారథ్యం వహించిన రిచా ప్రియదర్శిని తెలిపారు. ప్రస్తుతం తాము ఈ రెండు రకాల బ్యాక్టీరియా జీవక్రియల వేగాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దీంతో ఎంజైమ్ అధికమొత్తంలో విడుదలయ్యి పర్యావరణానికి మేలు కలిగే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఈ బ్యాక్టీరియా ముడి ప్లాస్టిక్‌ను కూడా తినగలవని గుర్తించామన్నారు. తమ పరిశోధన ఫలితాలతో సమీప భవిష్యత్తులో 'సహజసిద్ధంగా, సమర్థవంతంగా, వేగంగా, చౌకగా' ప్లాస్టిక్‌ను విచ్ఛిన్నం చేయగల ఆవిష్కరణలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్లాస్టిక్‌ను సహజసిద్ధంగా విచ్ఛిన్నం చేసే విధానాన్ని కనుగొన్నందుకు చాలా సంతోషంగా ఉన్నదని వర్సిటీ వీసీ రూపామంజరి ఘోష్ పేర్కొన్నారు. సాధారణంగా తడి భూములు అనేక రకాల సూక్ష్మజీవులకు నిలయంగా ఉంటాయని, క్యాంపస్‌లోని తడి భూముల్లో ఏయే జీవజాతులు ఉన్నాయో తెలుసుకునేందుకు పరిశోధనలు ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో మానవాళి మొత్తానికి మేలుచేసే బ్యాక్టీరియాను గుర్తించినట్టు చెప్పారు. వీరి పరిశోధన వ్యాసం రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురితమైంది.

### ఎస్‌యూపీ ఉత్పాతం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను భారీ మొత్తంలో ఉత్పత్తి చేస్తుండటం, విచ్చలవిడిగా వాడుతుండటంతో పర్యావరణానికి పెనుముప్పుగా మారింది. వాటి వ్యర్థాల నిర్వహణ తలకుమించిన భారంగా తయారైంది. ప్రపంచవ్యాప్తంగా రోజూ వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల్లో ఐదో వంతు ఎస్‌యూపీలే అని అంచనా. నిపుణుల అంచనా ప్రకారం భారత్‌లో ఏటా 1.65 కోట్ల టన్నుల ప్లాస్టిక్‌ను, 1.4 కోట్ల టన్నుల పాలీస్టెరేన్‌ను వినియోగిస్తున్నారు. ఇదంతా పర్యావరణంలోకి చేరి కాలుష్యాన్ని వెదజల్లుతున్నది. భూమితోపాటు సముద్ర జీవజాతులకు పెనుముప్పుగా మారుతున్నది. ఉదాహరణకు మనం వాడే ఒక ఎస్‌యూపీ చెంచా విచ్చిన్నం కావడానికి దాదాపు 450 సంవత్సరాలు పడుతుందని చెప్తున్నారు.

# 'నవల'కు నోబెల్ కిరీటం

**2018, 2019 సాహిత్య నోబెల్ విజేతలను ప్రకటించిన కమిటీ**

ఇద్దరు నవలా రచయితలకు పురస్కారం

ఓల్గా టొకార్స్కుజుక్, పీటర్ హండ్కే ఎంపిక



ఓల్గా టొకార్స్కుజుక్



పీటర్ హండ్కే

**స్టాక్‌హోం, అక్టోబర్ 10:** నోబెల్ కమిటీ ఈసారి 'నవల'కు పట్టం కట్టింది. సాహిత్య విభాగానికి సంబంధించి ఈ ఏడాదితోపాటు గత ఏడాది విజేతను కూడా ప్రకటించింది. లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో గత ఏడాది సాహిత్య నోబెల్‌ను ఎవరికీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 2018కి సంబంధించి పోలండ్‌కు చెందిన మహిళా రచయిత ఓల్గా టొకార్స్కుజుక్‌ను, ఈ ఏడాదికి ఆస్ట్రియాకు చెందిన నవల, నాటక రచయిత పీటర్ హండ్కేను ఎంపికచేసినట్టు నోబెల్ కమిటీ గురువారం ప్రకటించింది. నోబెల్ పురస్కారాల చరిత్రలో ఇప్పటి వరకు మొత్తం 116 సాహిత్య బహుమతులను అందించగా.. ఈ పురస్కారం అందుకున్న 15వ మహిళగా ఓల్గా టొకార్స్కుజుక్ నిలిచారు. ఒకప్పుడు సాహిత్య నోబెల్ బహుమతిని రద్దు చేయాలని గట్టిగా వాదించిన పీటర్ హండ్కేకు ఈసారి పురస్కారం దక్కడం మరో విశేషం. టొకార్స్కుజుక్‌ను ఆమె తరం రచయితల్లో అత్యంత ప్రతిభాశాలిగా నోబెల్ కమిటీ అభివర్ణించింది. 'ఆమె సరిహద్దులకు అతీతంగా మానవ జీవితాలను అంతులేని విజ్ఞాన తృష్ణతో తన రచనల్లో అక్షరీకరించారు' అని ప్రశంసించింది. 'ఆమె నవలల్లో బహుళవర్ణ ప్రపంచం కదలాడుతూ ఉంటుంది. పాత్రలన్నీ సజీవంగా అనిపిస్తాయి. అక్షరాల్లో కవితాత్మకత తొణికిసలాడుతుంది' అని కొనియాడింది. అదేసమయంలో పీటర్ హండ్కే మానవుల అనుభవాలను అన్వేషించి తన భాష చాతుర్యం ద్వారా వారి అనుభూతులను అక్షరీకరించారని కమిటీ కొనియాడింది. ఫలితంగా రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఐరోపాలో అత్యంత ప్రభావవంతమైన రచయితగా నిరూపించుకున్నారని ప్రశంసించింది. ఆయన రచనల్లో.. కొత్తదనాన్ని అందించాలన్న తపన, సరికొత్త సాహితీ వ్యక్తీకరణలను కనుగొనాలన్న కోరిక కనిపిస్తున్నాయని కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది.

**రద్దు చేయమన్న వ్యక్తికే పురస్కారం**

ప్రస్తుతం జీవించి ఉన్న అతికొద్ది మంది ప్రతిభావంతులైన జర్మన్ రచయితల్లో పీటర్ హండ్కే(76) ఒకరు. నవల, నాటక రచయితగా, కవిగా, అనువాదకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉన్నది. కొందరు ఆయనను విప్లవ రచయితగా అభివర్ణిస్తుంటారు. ప్రస్తుత సమాజం పోకడలకు, సంస్కృతికి భిన్నంగా ఆయన రచనలు సాగుతూ ఉంటాయి. హండ్కే గతంలో సాహిత్య నోబెల్ బహుమతిని రద్దు చేయాలని గట్టిగా వాదించారు. విజేతలను కీర్తించడం తప్ప ఈ పురస్కారంతో ఒరిగేది ఏమీ ఉండదని, అనర్హులను కూడా అందలం ఎక్కిస్తున్నారని హండ్కే 2014లో విమర్శించారు. 1942లో జన్మించిన హండ్కే.. 1966లో 'ద హార్నెట్స్' అనే నవలతో సాహితీ రంగప్రవేశం చేశారు. ఆయన మొదటి నాటకం అఫెండింగ్ ద ఆడియన్స్. ఈ రెండూ ప్రజాదరణ పొందడంతో ఆయన వెనుదిరిగి చూడలేదు. షార్ట్ లెటర్-లాంగ్ ఫేర్వెల్, ద ఇన్నర్ వరల్డ్ ఆఫ్ ద ఔటర్ వరల్డ్ ఆఫ్ ద ఇన్నర్ వరల్డ్, ఏ సారో బియాండ్ డ్రీమ్స్ వంటివి ఆయన ఇతర రచనలు.

**రచయిత.. రాజకీయ నేత.. ఉద్యమకారిణి**

ఓల్గా టొకార్స్కుజుక్ (57) రచయిత మాత్రమే కాదు.. రాజకీయ నేత, పర్యావరణ ఉద్యమకారిణి కూడా. 2015లో ఆమె బహిరంగంగా పోలండ్ ప్రభుత్వాన్ని విమర్శించడంతో చంపేస్తామంటూ బెదిరింపులు కూడా వచ్చాయి. 1962లో జన్మించిన ఓల్గా మొదటి నవల 'ద జర్నీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ద బుక్' 1993లో విడుదలైంది. అది మంచిపేరు తీసుకురావడంతో పూర్తిస్థాయి రచయితగా మారారు. ఆమె డజనుకుపైగా పుస్తకాలు రాశారు. అవి 28 భాషల్లోకి అనువాదమయ్యాయి. బుకర్ ప్రైజ్, మ్యాన్ బుకర్ ప్రైజ్, పోలండ్ ప్రభుత్వం అందించే నైక్ లిటరసీ అవార్డ్ సహా అనేక పురస్కారాలు అందుకున్నారు. ఫ్లైట్స్, ద బుక్ ఆఫ్ జాకబ్ వంటివి ఆమె ఇతర రచనలు.

### గతేడాది ఎందుకివ్వలేదు..

మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి గతేడాది ప్రపంచవ్యాప్తంగా 'మీటూ ఉద్యమం' ఉవ్వెత్తున ఎగిసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో స్వీడిష్ అకాడమీ సభ్యురాలు కేథరీనా ఫ్రోస్టన్సెన్ భర్త, స్వీడన్ సాహితీవేత్త అయిన జీన్ క్లాడ్ ఆర్నాల్ట్‌పై 18 మంది లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. దీనిపై ఏర్పాటైన జ్యూడిషియల్ కమిటీ ఆరోపణలు నిజమేనని తేల్చడంతోపాటు ఆర్నాల్ట్ పలువురు నోబెల్ విజేతల పేర్లను ముందే లీక్ చేశాడని తేల్చింది. దీంతో కేథరీనాను నోబెల్ కమిటీ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆరుగురు సభ్యులు రాజీనామా చేశారు. 18 మంది అకాడమీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం ఆర్నాల్ట్‌ను వెనుకేసుకురాగా, మరోవర్గం ఆయనకు వ్యతిరేకంగా వాదించింది. ఈ కేసులో ఆర్నాల్ట్‌కు రెండేండ్ల జైలు శిక్ష పడింది. 'ఈ ఘటనతో అకాడమీపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సాహిత్య నోబెల్ పురస్కారానికి ఎవరినీ ఎంపిక చేయడం లేదు. వచ్చే ఏడాదికి వాయిదా వేస్తున్నాం' అని అకాడమీ ప్రకటించింది. 70 ఏండ్ల నోబెల్ బహుమతుల చరిత్రలో మొదటిసారి వాయిదా వేశారు. ఏడాది కాలంలో కమిటీని పునర్ వ్యవస్థీకరించారు. 2016లో అమెరికా గాయకులు బాబ్ డైలాన్‌కు సాహిత్య పురస్కారాన్ని అందించినప్పుడు సైతం నోబెల్ కమిటీపై తీవ్ర విమర్శలు చెలరేగాయి.

## ఆఫ్రికాతో మైత్రికి భారత్ ప్రాధాన్యం

ఉప రాష్ట్రపతి వెంకయ్య వెల్లడి



కామరోస్‌లో వెంకయ్యకు స్వాగతం పలికిన ఆ దేశాధ్యక్షుడు అజాలి

**మొరోని/కామరోస్, అక్టోబర్ 10:** ఆఫ్రికా దేశాలతో సంబంధాలు మరింత పటిష్ఠం చేసుకోవడానికి భారత్ ప్రాధాన్యం ఇస్తున్నదని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. కామరోస్, సియెర్రా లియోన్ దేశాల పర్యటన నిమిత్తం గురువారం ఆయన ఢిల్లీ నుంచి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు మాట్లాడుతూ గత ఐదేండ్లలో ఆఫ్రికా ఖండంలో రాష్ట్రపతి, ప్రధాని, తాను 32 సార్లు పర్యటించామని, దీన్ని బట్టే ఆఫ్రికా దేశాలకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యం అర్థమవుతున్నదన్నారు. ఆఫ్రికా ఖండంలో 18 కొత్త రాయబార కార్యాలయాలను ఏర్పాటు చేయాలని భారత్ నిర్ణయించినట్లు తెలిపారు. కాగా కామరోస్‌కు చేరుకున్న వెంకయ్యనాయుడికి ఆ దేశ అధ్యక్షుడు అజాలి అసోమని ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రవాస భారతీయులతో జరిగిన సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడారు. శుక్రవారం ఆయన కామరోస్ అధ్యక్షుడు అజాలీతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు కుదురనున్నాయి. ఉప రాష్ట్రపతి వెంట వెళ్లిన మీడియా బృందంలో నమస్తే తెలంగాణ బ్యూరో చీఫ్ ఒరుగంటి సతీశ్ కూడా ఉన్నారు.

# శివసేనకు ఎదురుదెబ్బ

- 26 మంది కార్పొరేటర్లు, 300 మంది కార్యకర్తలు పార్టీకి రాజీనామా
- కల్యాణ్ తూర్పు నియోజకవర్గం సీటును బీజేపీకి కేటాయించడంపై తీవ్ర నిరసన



ధనంజయ్ బోదరే




**ముంబై:** ఎన్నికల వేళ శివసేన పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన 26 మంది కార్పొరేటర్లు, దాదాపు 300 మంది కార్యకర్తలు శివసేనకు రాజీనామా చేస్తూ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేకు గురువారం లేఖ పంపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే పొత్తులో భాగంగా కల్యాణ్ తూర్పు నియోజకవర్గం సీటు బీజేపీకి వెళ్లింది. దీనిని నిరసిస్తూ వీరంతా రాజీనామా చేశారు. వీరిలో 16 మంది కార్పొరేటర్లు కల్యాణ్ దోంబివాలి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందినవారు ఉన్నారు. రాజీనామా చేసిన వారిలో ఒకరైన శరద్ పాటిల్ మాట్లాడుతూ 'కల్యాణ్ తూర్పు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి పోటీ చేయనున్నారని, ఆయనకు శివసేన కార్యకర్తలు మద్దతుగా నిలువాలని పార్టీ కోరింది. ఇది మాకు నచ్చలేదు. అందుకే రాజీనామా లేఖ పంపాం' అని తెలిపారు. కాగా రాష్ట్రంలో 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో బీజేపీ 150 చోట్ల, శివసేన 124 చోట్ల పోటీ చేయనున్నాయి. కల్యాణ్ తూర్పు నియోజకవర్గం టికెట్‌ను శివసేన నాయకుడు ధనంజయ్ బోదరే ఆశించారు. కానీ ఈ స్థానం నుంచి బీజేపీ పోటీ చేయనుండటంతో తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు ఆయన ప్రకటించారు.

# నేనే తప్పూ చేయలేదు!

పరువునష్టం కేసులో రాహుల్ పునరుద్ఘాటన



సూరత్ కోర్టుకొస్తున్న రాహుల్

**సూరత్, అక్టోబర్ 10:** గత లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో 'దొంగలంతా తమ పేరు చివర మోదీ అని ఉన్న వాళ్లే' అంటూ తాను చేసిన వ్యాఖ్యల్లో తప్పేమీలేదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఈ కేసులో భాగంగా గుజరాత్‌లోని సూరత్ కోర్టుకి గురువారం ఆయన హాజరయ్యారు. తాను ఏ తప్పూ చేయలేదని ఆయన కోర్టుకు తెలిపారు. న్యాయస్థానానికి వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన అవసరం లేకుండా వెసులుబాటు కల్పించాలని రాహుల్ తరుపు న్యాయవాది కోర్టును కోరారు. ఈ అభ్యర్థనపై నిర్ణయాన్ని డిసెంబర్ 10న తెలియజేస్తామన్న కోర్టు.. ఆ రోజు విచారణకు రాహుల్ రావాల్సిన అవసరం లేదని పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏప్రిల్ 13న కర్ణాటకలో రాహుల్ సభ నిర్వహించారు. 'నీరవ్ మోదీ, లలిత్ మోదీ, నరేంద్ర మోదీ.. దొంగలందరి పేరు చివరన మోదీ అని ఎలా ఉంది?' అని ప్రజల్ని అడిగారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలు మోదీ సామాజిక వర్గం గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయంటూ బీజేపీ సూరత్ వెస్ట్ నియోజకవర్గం ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ కోర్టును ఆశ్రయించారు.

## హత్యలపై బెంగాల్‌లో రాజకీయ దుమారం

**ముర్షీదాబాద్:** పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలో ఓ ఉపాధ్యాయుడి కుటుంబాన్ని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన ఘటనపై రాజకీయ దుమారం రేగుతున్నది. చనిపోయిన వ్యక్తి తమ మద్దతుదారుడని రాష్ట్రీయ్ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) ప్రకటించింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారాయని బీజేపీ మండిపడింది. జరిగిన ఘటన మానవత్వానికి సిగ్గుచేటని ఆ రాష్ట్ర గవర్నర్ జగ్‌దీప్ ధన్‌కర్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. దోషుల్ని కఠినంగా శిక్షించాలని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మమత సర్కారును డిమాండ్ చేశారు. జైగంజ్‌లో ఉంటున్న బంధు గోపాల్ పాల్, అతని భార్య బ్యూటీపాల్,ఎనిమిదేండ్ల కొడుకును గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి హత్య చేశారు.

## రాజద్రోహం కేసులో.. పోలీసులపై నిరసన పిటిషన్

**ముజఫర్‌పూర్, అక్టోబర్ 10::** దేశంలో పెరిగిపోతున్న మూక దాడులను నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై నమోదైన రాజద్రోహం కేసు అంశం మరో కీలక మలుపు తిరిగింది. ఆధారాలు లేకపోవడంతో రాజద్రోహం కేసును మూసివేసిన పోలీసులపై ఫిర్యాదుదారుడు, న్యాయవాది సుధీర్ కుమార్ ఓఝా గురువారం నిరసన పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పోలీసులు ఈ కేసును మూసివేశారని ఆరోపించారు. ఈ కేసును కోర్టు స్వయంగా పర్యవేక్షించాలని, సీబీఐకు బదిలీ చేయాలని కోర్టుకు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## కశ్మీర్‌లో రక్తపాతం జరుగుతుందన్నారు

- కానీ ఒక్క బుల్లెట్ కూడా పేలలేదు
- కాంగ్రెస్, ఎన్సీపీపై అమిత్ షా ధ్వజం
- ఆర్టికల్ 370 రద్దుకు ప్రపంచ దేశాలన్నీ మద్దతుగా ఉన్నాయని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లు వ్యతిరేకించాయని బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. గురువారం మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ 'ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ వ్యతిరేకించారు. వాళ్లు ఎందుకు వ్యతిరేకించారో ప్రజలకు చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాళ్లు ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించారన్నారు. అంతేగాక ఆర్టికల్ 370ని రద్దు చేస్తే కశ్మీర్‌లో రక్తపాతం జరుగుతుందని రాహుల్ పేర్కొన్నారని, కానీ అక్కడ ఒక్క బుల్లెట్ కూడా పేలలేదని తెలిపారు. ఇటీవల ఐక్యరాజ్యసమితిలో జరిగిన సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొన్నారని, ఆర్టికల్ 370 రద్దు విషయంలో ప్రపంచ దేశాలన్నీ మోదీకి అండగా నిలిచాయని పేర్కొన్నారు. మోదీ నేతృత్వంలో భారత భద్రత పటిష్ఠంగా తయారైందని, శత్రువుల చేతుల్లో మన జవాన్ ఒక్కరు చనిపోతే 10 మంది శత్రువులను భారత్ మట్టుబెడుతుందని ప్రపంచానికి తెలుసునని చెప్పారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు పాక్ ఉగ్రవాదులు తరుచూ సరిహద్దు దాటి దేశంలోకి ప్రవేశించేవారని, కానీ మోదీ ప్రధాని అయిన తర్వాత సరిహద్దు భద్రతను పటిష్ఠం చేశారని తెలిపారు.

## నేడు హర్యానా కాంగ్రెస్ మ్యానిఫెస్టో

**చండీగఢ్:** హర్యానాలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నది. అందులో రైతులు, పేదలు, మహిళలు, యువతకు ప్రాధాన్యం ఇస్తామని హర్యానా కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ కన్వీనర్ అఫ్తాబ్ అహ్మద్ గురువారం పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. బలహీన వర్గాలు, దళితులు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, ఇతర అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పథకాలను ప్రవేశ పెడతామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి వచ్చిన సూచనల ఆధారంగానే మ్యానిఫెస్టో రూపొందించామని, మహిళలు ప్రధానంగా పథకాలను ప్రారంభిస్తామన్నారు.

## కేరళ కిల్లర్ లేడీకి ఆరు రోజుల కస్టడీ

నిందితురాల్ని చూడటానికి గుమిగూడిన జనం



**తిరువనంతపురం:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేరళ వరుస హత్యల నిందితురాలు జాలీకి కోజికోడ్‌లోని స్థానిక కోర్టు గురువారం ఆరు రోజుల కస్టడీని విధించింది. జాలీ స్నేహితుడు ఎంఎస్ మాథ్యూ, ఆమెకు సైనేడ్ సరఫరా చేసినట్టు అనుమానిస్తున్న ప్రజికుమార్‌కు కూడా ఆరు రోజులపాటు పోలీసు కస్టడీని విధించింది. వచ్చే బుధవారం జాలీని కోర్టు ముందు ప్రవేశపెట్టాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు. విచారణ కోసం వచ్చిన జాలీని చూడటానికి వందలాది మంది కోర్టు ఆవరణలో గుమిగూడారు. మరోవైపు, ఖననం చేసిన మృతదేహాల నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించడానికి దేశ విదేశాల్లోని నిపుణులను సంప్రదిస్తున్నామని డీజీపీ లోక్‌నాథ్ బెహ్రా తెలిపారు.

## ప్రేమించనందుకు యువతికి నిప్పంటించాడు

ఆపై తానూ అగ్నికి ఆహుతి.. కేరళలో ఘటన



దేవిక

**కొచ్చి:** కేరళలోని కొచ్చి నగర పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో దేవిక (17) అనే యువతిపై మిథున్ అనే ఓ ఉన్మాది గురువారం వేకువజామున కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తర్వాత తనకు కూడా నిప్పంటించుకున్నాడు. దేవికను కా పాడబోయిన ఆమె తండ్రికి కూడా గాయా లు కావడంతో ఆయన చికిత్స పొందుతున్నాడు. ఇన్ఫో పార్క్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అథానీలోని కక్కనాడ్‌లో ఈ ఘటన జరిగింది. మిథున్ గురువా రం రాత్రి దేవిక ఇంటి కి వచ్చి తలుపు కొట్టాడు. ఆమె తండ్రి షలాన్ తలుపు తెరిచిన తర్వాత దేవికను చూడాలని పట్టుబట్టాడు. ఆమె తన గది నుంచి బయటకు రాగానే కిరోసిన్ పోసి నిప్పంటించి, తానూ నిప్పంటించుకున్నాడు. గాయపడిన ఇద్దరినీ చికిత్స కోసం దవాఖానకు తరలించారు. కానీ అప్పటికే మరణించారని వైద్యులు చెప్పారు.

## యూపీలో 'నాథూరామ్ రాజ్యం'

ఎస్పీ అధినేత అఖిలేశ్ ఆరోపణ

**ఝాన్సీ:** ఉత్తర్‌ప్రదేశ్‌లో 'రామరాజ్యం' సాగడం లేదని, 'నాథూరామ్ రాజ్యం' సాగుతున్నదని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. యూపీలో మూక దాడులు, పోలీసు దాడులు పెరిగిపోయాయన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుష్పేంద్ర యాదవ్‌ది ఎన్‌కౌంటర్ కాదని, హత్య అని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమ ఇసుక మైనింగ్ జరుపుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పుష్పేంద్ర యాదవ్ ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. పెట్రోలింగ్ టీంపై కాల్పులు జరిపిన పుష్పేంద్ర యాదవ్.. తాము జరిపిన ఎదురు కాల్పుల్లో మరణించాడని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) తెలిపారు.

# సింధు ప్రజలు ఇలా ఉండేవారు

సీఎఫ్ఆర్ విధానంలో ఇద్దరి ముఖాలను పునఃసృష్టించిన శాస్త్రవేత్తలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** సింధులోయ నాగరికత కాలంలో జీవించి ఉన్న వ్యక్తుల ముఖాలను శాస్త్రవేత్తలు పునఃసృష్టించారు. హర్యానాలోని హిస్సార్ జిల్లా రాఖీఘరీ ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో ఓ సమాధి బయల్పడింది. ఇందులో దాదాపు 4,500 ఏండ్ల కిందట పూడ్చిపెట్టిన 37 మంది వ్యక్తుల అవశేషాలు లభ్యమయ్యాయి. వీటిలోని రెండు పుర్రెల ముఖాలను 'అప్లయిడ్ క్రానియోఫేషియల్ రీకన్‌స్ట్రక్షన్' (సీఎఫ్ఆర్) విధానంలో పునఃసృష్టించారు. అంటే జీవించినప్పుడు వారి ముఖాకృతి పోలిన ప్రతిరూపాన్ని కంప్యూటర్ సాయంతో సృష్టించారు. ఈ పరిశోధనలో భారత్‌తోపాటు బ్రిటన్, దక్షిణ కొరియాలోని ఆరు విద్యాసంస్థలకు చెందిన 15 మంది శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు. వీరికి డబ్ల్యూజే లీ, వసంత్ షిండే నేతృత్వం వహించారు. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ సహకారం అందించింది. 'సింధు ప్రజలు ఎలా ఉంటారో ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. మా పరిశోధనతో కొంత అవగాహన కలిగింది' అని వసంత్ షిండే పేర్కొన్నారు. ఆయన రాఖీఘరీలో పురావస్తు శాఖ ప్రాజెక్టుకు కూడా నేతృత్వం వహిస్తున్నారు. సింధు నాగరికత కాలం నాటి సమాధులను ఇప్పటివరకు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని, వారి అస్థిపంజరాల ఆధారంగా పరిణామ క్రమాన్ని అంచనా వేయలేదని షిండే చెప్పారు. దీంతో అప్పటి ప్రజల ముఖాకృతులు మనకు తెలియకుండా పోయాయన్నారు. సీఎఫ్ఆర్ విధానంలో వాటిని పునఃసృష్టించడం పెద్ద ముందడుగుగా అభివర్ణించారు. వారు విడుదల చేసిన 3డీ వీడియో ప్రకారం.. ఇద్దరు సింధుప్రజల ముఖాలు పొడవైన ముక్కుతో నైరుతి ఆసియా ప్రజల పోలికలతో ఉన్నాయి. వీరి పరిశోధనా వ్యాసం 'అనాటమికల్ సైన్సెస్ ఇంటర్నేషనల్' జర్నల్‌లో ప్రచురితమైంది.

## ఆర్మీ ఏవియేషన్ కోర్‌కు ప్రెసిడెంట్స్ కలర్స్

**నాసిక్:** ఆర్మీ ఏవియేషన్ కోర్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రతిష్ఠాత్మక ప్రెసిడెంట్స్ కలర్స్ పురస్కారాన్ని అందజేశారు. గురువారం మహారాష్ట్రలోని నాసిక్‌లో గల కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్ ఆవరణలో జరిగిన వేడుకలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కోవింద్ మాట్లాడుతూ.. అంకిత భావంతో జాతికోసం ఆర్మీ ఏవియేషన్ కోర్ చేస్తున్న సేవలు అభినందనీయం అని చెప్పారు. యుద్ధం, శాంతి సమయంలోనూ అంకిత భావంతో ఏండ్ల తరబడి ఆర్మీ ఏవియేషన్ కోర్ అందిస్తున్న ప్రతిభావంతమైన సేవలకు గుర్తింపుగా ప్రెసిడెంట్ కలర్స్ పురస్కారాన్ని అందుకుంటున్నది. ఆర్మీ ఏవియేషన్ కోర్ సభ్యులకు రెండు మహావీర్ చక్ర, 16 వీర్ చక్ర, 13 శౌర్య చక్ర, 115 సేనా పతకాలు రాష్ట్రపతి కోవింద్ అందజేశారు.

## మహిళను హిప్నటైజ్ చేసి.. లైంగికదాడి యత్నం

నోయిడాలో అమెజాన్ డెలివరీ బాయ్ దుశ్చర్య

**నోయిడా:** దేశ రాజధాని ఢిల్లీ నగరానికి సమీపంలోని నోయిడాలో ఒక మహిళ (43)ను ఈ-కామర్స్ రిటైల్ సంస్థ అమెజాన్ డెలివరీ బాయ్ హిప్నటైజ్ చేసి.. లైంగిక దాడికి యత్నించాడు. సోమవారం జరిగిన ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు మహిళ వద్ద నుంచి ఐదు బాక్స్‌ల వస్తువులను తిరిగి తీసుకెళ్లేందుకు వచ్చిన డెలివరీ బాయ్ భూపేంద్ర పాల్.. వాటిని తీసుకెళ్లేందుకు నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. నిందితుడు బాధితురాల్ని హిప్నటైజ్ చేయడంతో స్పృహ కోల్పోయారు. ఆమెకు స్పృహ వచ్చే సరికి అతడు అర్ధనగ్నంగా ఉన్నాడు. దీంతో ఆమె కేకలేస్తూ బాత్‌రూమ్‌లోకి వెళ్లి.. అక్కడ ఉన్న వైపర్ తీసుకుని అతడ్ని కొట్టడంతో పారిపోయాడు. ఈ ఘటనపై అమెజాన్ ప్రతినిధి స్పందిస్తూ తమ డెలివరీ సర్వీస్ ప్రొవైడర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

## వెల్లివిరిసిన మతసామరస్యం

### వేలంలో దుర్గామాత చీరెను దక్కించుకున్న ముస్లిం యువకుడు

**ఏటూరునాగారం (ములుగు):** ములుగు జిల్లా ఏటూరునాగారం లో మత సామరస్యం వెల్లివిరిసింది. దేవీశరన్నవరాత్రి ఉత్స వా ల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వాహకులు నిర్వహిం చిన వేలంలో ముస్లిం యువకుడు అక్తర్ పాల్గొని అమ్మవారి చీరెను దక్కించుకున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారి అలంకరణలో భాగంగా కట్టిన చీరెలను నిర్వాహకులైన స్టార్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు వేలంవేశారు. శాకంబరి అవ తారంలో అమ్మవారికి ధరింపజేసిన చీరెను రూ.6,501కు అక్తర్ దక్కించుకున్నారు.


అమ్మవారి చీరెను స్వీకరిస్తున్న అక్తర్

విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మా నందేంద్రసరస్వతి స్వామి గురువారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం లోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.
- మల్యాల



కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన బాన్సువాడ లోని పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. పలు కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బాన్సువాడ, నమస్తేతెలంగాణ





# సాఫీగా ప్రయాణం


మంచిర్యాలలో బస్సులో ధరల పట్టికను అతికిస్తున్న అధికారులు

## రద్దీకి అనుగుణంగా సర్వీసులు

- రాష్ట్రంలో తిరిగిన బస్సులు 5,580
- నిరంతర పర్యవేక్షణలో అధికారులు
- ఆరోరోజూ కనిపించని సమ్మె ప్రభావం
- ఖమ్మంలో షెడ్యూల్ ప్రకారం ప్రజారవాణా
- వనపర్తి జిల్లాలో 85 శాతం నడిచిన బస్సులు
- అధికమొత్తం వసూలుచేసిన ముగ్గురు కండక్టర్లపై కేసు


గురువారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో ప్లాట్‌ఫారాలపై సిద్ధంగా ఉన్న బస్సులు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** పండుగ ప్రయాణం ప్రశాంతంగా సాగుతున్నది. పండుగ కోసం ఊరెళ్లిన వారంతా తిరిగొస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్యను పెంచి నడిపిస్తున్నారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో కంట్రోలింగ్ పాయింట్లను ఏర్పాటుచేసి బస్సుల రాకపోకలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలతో ఆరో రోజైన గురువారం కూడా ఆర్టీసీ సమ్మె ప్రభావం కన్పించలేదు. గురువారం మొత్తం 5,580 బస్సులు తిరగ్గా అందులో 3,540 ఆర్టీసీ, 2,040 అద్దె బస్సులున్నాయి. వీటికి అదనంగా మరో ఆరువేల ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మ ఉన్నతాధికారులతో సమీక్షిస్తూ ప్రజారవాణాకు ఆటంకం కలుగకుండా రద్దీ ప్రాంతాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా గుర్తిస్తూ అధికారులు తగిన సూచనలిస్తున్నారు. ఆయా రూట్లలో అదనపు బస్సులు నడిపిస్తున్నారు. ఆయా స్టేజీల టికెట్ ధరలను సైతం పట్టిక రూపంలో బస్సుల్లో ఏర్పాట్లుచేశారు. ఎవరైనా అధిక మొత్తం వసూలుచేస్తే హెల్ప్‌డెస్క్‌లకు సమాచారం ఇవ్వాలని బస్టాండ్లలో ప్రయాణికులకు సూచిస్తున్నారు.

**వరంగల్ రీజియన్‌లో..**
వరంగల్ రీజియన్‌లోని తొమ్మిది డిపోల్లో 594 బస్సులు నడిచాయి. ఉమ్మడి జిల్లాకు ప్రధానమైన హన్మకొండ బస్‌స్టేషన్ రద్దీగా మారింది. జనగామ, భూపాలపల్లి, తొర్రూర్, మహబుబాబాద్, పరకాల బస్‌స్టేషన్లలో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా కనిపించింది. వరంగల్ రూరల్ జిల్లాలోని నర్సంపేట, పరకాల బస్‌డిపోల నుంచి 88 బస్సులు నడిచాయి. 130 మంది తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు డ్యూటీ చేశారు. నర్సంపేట డిపో నుంచి 44, పరకాల డిపో నుంచి కూడా 44 బస్సులు తిరిగాయి.

**కరీంనగర్ రీజియన్‌లో..**
కరీంనగర్ రీజియన్‌లో 364 ఆర్టీసీ, 203 అద్దె, 107 కాంట్రాక్టు క్యారియర్, 25 స్కూల్, 200 మ్యాక్సీ క్యాబ్‌లు నడిపారు. కరీంనగర్– హైదరాబాద్ మధ్య ఎక్కువ సర్వీసులు తిరిగాయి. ఉమ్మడి మెదక్ రీజియన్ ఎనిమిది డిపోల పరిధిలో 633 బస్సులు సేవలు అందించాయి. 453 ఆర్టీసీ, 180 ప్రైవేట్(అద్దె ప్రాతిపదికన) బస్సులు తిరిగాయి.

**ఖమ్మం జిల్లాలో..**
ఖమ్మం జిల్లాలో బస్సులు రోజువారీ షెడ్యూల్ తరహాలో తిరిగాయి. ఖమ్మం డిపో నుంచి 85 ఆర్టీసీ, 67 అద్దె బస్సులు, మధిర డిపోలో 31 ఆర్టీసీ, 21 అద్దె బస్సులు, సత్తుపల్లి డిపోలో 67 ఆర్టీసీ, 30 అద్దె బస్సులు, ప్రైవేట్ బస్సులు 29, మ్యాక్సీక్యాబ్, మోటర్ క్యాబ్‌లు 80 వరకు నడిపించారు.

✦ నల్లగొండ జిల్లాలో 283 బస్సులు నడిపించారు. నల్లగొండ డిపో నుంచి 42 ఆర్టీసీ, 34 ప్రైవేటు, దేవరకొండ నుంచి 41 ఆర్టీసీ, 28 ప్రైవేటు, నార్కట్‌పల్లి నుంచి 37 ఆర్టీసీ, 14 ప్రైవేటు, మిర్యాలగూడ నుంచి 51 ఆర్టీసీ, 36 ప్రైవేటు బస్సులు తిరిగాయి. సూర్యాపేట జిల్లాలోని కోదాడ డిపో నుంచి 42 ఆర్టీసీ, 31 అద్దె బస్సులు, సూర్యాపేట డిపోలో 65 ఆర్టీసీ, 45 అద్దె బస్సులు నడిచాయి. కోదాడలో 15, సూర్యాపేటలో 27 స్కూల్ బస్సులు తిరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట డిపో నుంచి 165 వాహనాలు తిరిగాయి. 50 ఆర్టీసీ, 15 అద్దె బస్సులతోపాటు ఇతర ప్రైవేట్ వాహనాలతో కలిపి మొత్తం 165 వాహనాలు నడిపించారు. తాత్కాలికంగా 65 డ్రైవర్, 65 కండక్టర్లను తీసుకున్నారు.

✦ వికారాబాద్ జిల్లాలో పరిగి, వికారాబాద్, తాండూరు డిపోల నుంచి 262 బస్సులు ప్రయాణికులను గమ్యాలకు తరలించాయి. వికారాబాద్ డిపోలో 59, తాండూరులో 66, పరిగి డిపోలో 51 బస్సు సర్వీసులు నడిచాయి.

✦ ఆదిలాబాద్ డిపోలో 60 శాతం, ఉట్నూర్ డిపోలో 70 శాతం బస్సులు నడిచాయి. జిల్లా వ్యాప్తంగా 140 తిరిగాయి.

✦ నిర్మల్ జిల్లాలో 223 వాహనాలను నడిపించారు. 72ఆర్టీసీ, 78 అద్దె బస్సులు, ఎనిమిది ట్రావెల్స్, 65 మ్యాక్సీ క్యాబ్‌లు నడిపించారు.

✦ మంచిర్యాల జిల్లాలో 40 ఆర్టీసీ, 56 హైర్ బస్సులు, 18 ప్రైవేట్ బస్సులు, 60 క్యాబ్‌లు నడిచాయి. ఇవేకాకుండా 40 నుంచి 60 వరకు ఆటోలు, టాటా ఏస్ ట్రాలీలు తిరిగాయి.

✦ కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి డిపోలో 65 ఆర్టీసీ, 33 హైర్ బస్సులు, బాన్సువాడ డిపోలో 50 ఆర్టీసీ, 20 హైర్ బస్సులు, 29 ఇతర వాహనాలు నడిచాయి.

✦ మహబూబ్‌నగర్ జిల్లాలో 53 ఆర్టీసీ, 32 హైర్ బస్సులతో కలిపి మొత్తం 85 బస్సులు ప్రయాణికులను చేరవేశాయి. ప్రైవేటు బస్సులు 60కిపైగా తిగిగాయి. దాదాపు 15 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించాయి.

✦ జోగుళాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా 92 బస్సులు నడిచాయి. 65 ఆర్టీసీ, 20 హైర్ బస్సులు తిరిగాయి. అలంపూర్ స్టేజ్ నుంచి జోగుళాంబ ఆలయం వరకు ఏడు స్కూల్ బస్సులను నడిపారు.

✦ నారాయణపేట జిల్లాలో 45 బస్సులు, 30 హైర్ బస్సులు తిరిగాయి. 70కిపైగా ప్రైవేటు తూఫాన్ వాహనాలతోపాటు కార్లు, జీపులు, ఆటోలు తిరిగాయి.

✦ వనపర్తి జిల్లాలో 85 శాతం బస్సుల నడిచాయి. జిల్లావ్యాప్తంగా 79 బస్సులు సేవలందించాయి.

### తాత్కాలిక కండక్టర్లపై చీటింగ్ కేసులు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ప్రయాణికుల నుంచి టికెట్‌కు మించి డబ్బులు వసూలుచేస్తున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన రామాంజనేయులు అనే తాత్కాలిక కండక్టర్‌ను విధుల నుంచి తొలిగించి చీటింగ్ కేసు నమోదు చేసినట్టు నల్లగొండ ఎస్పీ రంగనాథ్ తెలిపారు. గురువారం ఆయన పలు డిపోలను సందర్శించి ప్రయాణికులతో మాట్లాడారు. ప్రయాణికుల నుంచి అధికంగా డబ్బులు వసూలుచేస్తున్న ఖమ్మం డిపోకు చెందిన కండక్టర్ నాగేశ్వర్‌రావుపై, మిర్యాలగూడ డిపోకు చెందిన రజాక్‌పై కూడా కేసులు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

## యథావిధిగా బస్సు సర్వీసులు

- ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఏర్పాట్లపై హైకోర్టుకు నివేదిక అందించిన ప్రభుత్వం
- కౌంటర్ దాఖలు చేయాలని కోరిన హైకోర్టు
- విచారణ 15కు వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని, యథావిధిగా బస్సు సర్వీసులను నడిపిస్తున్నామని హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. సమ్మెను విరమింపజేసి, ప్రజల ఇబ్బందులు తొలిగించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గురువారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. పిటిషనర్ తరపు న్యాయవాది పీవీ కృష్ణయ్య వాదనలు కొనసాగిస్తూ.. కార్మిక సంఘాలు, యాజమాన్యం పంతానికి పోయి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. సమ్మె చట్టవిరుద్ధమా? కాదా? అనేది తర్వాత తేల్చుకోవచ్చని, ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరేలా ఆదేశించాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. చార్జీల భారం, సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారని, ఈ అంశాన్ని ప్రజల కోణం నుంచి చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జే రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే ఆర్టీసీ కార్మికులు చట్ట విరుద్ధంగా సమ్మెకు వెళ్లారని చెప్పారు. సమ్మె కొనసాగుతున్నా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ, అద్దె, ప్రైవేటు బస్సులను నడుపుతున్నామని విన్నవించారు. తాత్కాలిక పద్ధతిన డ్రైవర్లు, కండక్టర్లను నియమించి యథావిధిగా బస్సులు నడిపిస్తున్నట్టు పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొన్న వారిపై చర్యలు తప్పవని తెలిపారు. రైల్వే, మెట్రో అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎక్కువ సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. నిత్యం సగటున ఎనిమిది వేలపైచిలుకు వాహనాలను తిప్పుతున్నట్టు పేర్కొన్నారు.

**దాడులు చేస్తున్నారు..**
పోలీసులు, ఇతర విభాగాల సహకారంతో ప్రభుత్వం బస్సులు నడిపిస్తుంటే కొందరు దాడులు చేస్తున్నారని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్.. ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కొత్తగా వచ్చిన డ్రైవర్లతో ప్రమాదాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయని ధర్మాసనం పేర్కొనగా.. అర్హతలు, లైసెన్స్‌లు ఉన్నవారినే విధుల్లోకి తీసుకున్నామని ఏజీ చెప్పారు. ప్రమాదాలకు వేరే కారణాలేమైనా ఉండొచ్చని వివరించారు. కార్మిక సంఘాల తరపున సీనియర్ అడ్వకేట్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ సమ్మె చట్టవిరుద్ధం కాదని తెలిపారు. కేవలం ఆర్టీసీ విలీనం కోసమే సమ్మె చేయడం లేదని, ఇతర ముఖ్యమైన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు.

**ఇబ్బందులు లేకుండా చూడాలి**
ఆర్టీసీ బస్సుల్లో బస్‌పాసులను అనుమతించడం లేదని, అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో సందేశాలు వస్తున్నాయని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ప్రభుత్వానికి సూచించింది. బస్‌పాసులను అనుమతించాలని, అధిక చార్జీల వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీచేశామని ఏఏజీ జే రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రభుత్వం సమర్పించిన నివేదికలో కొన్ని వివరాలు లేవని, పూర్తి వివరాలతో ప్రభుత్వం, కార్మిక సంఘాలు కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను 15కు వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

## డిమాండ్లు నెరవేరేవరకు సమ్మె

### రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతాం: ఆర్టీసీ జేఏసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేవరకు యథాతథంగా సమ్మె కొనసాగిస్తామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి స్పష్టంచేశారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలతో జరిపిన సమావేశం అనంతరం ఆర్టీసీ జేఏసీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించింది. శుక్రవారం ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత, శనివారం అన్ని డిపోల ఎదుట నిరసనలు, గాంధీ, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాల వద్ద మౌన ప్రదర్శనలు చేపడుతామని వెల్లడించింది. ప్రజలంతా మద్దతుగా నిలువాలని, పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. సమ్మెకు పూర్తి మద్దతు ఉంటుందని పలు రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు స్పష్టంచేశాయి. తెలంగాణ పెన్షనర్ల జేఏసీ కూడా మద్దతు ప్రకటించింది. సమ్మెపై హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో వాదనలు వినిపించామని అశ్వత్థామరెడ్డి హైకోర్టు వద్ద ప్రెస్‌మీట్‌లో తెలిపారు.

**సమ్మెపై గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు**
ఆర్టీసీ సమ్మెపై గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ నేతల బృందం కలిసింది. కార్మికుల డిస్మిస్ ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కితీసుకోవడంతోపాటు ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ బీజేపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. బృందంలో ఎమ్మెల్సీ రామచంద్రరావు, పార్టీ నేతలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ


జనగామలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు


కరీంనగర్‌లో డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్‌తో డంకన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న అధికారి

## కృష్ణకు స్థిరంగా వరద

- సాగర్ రెండుగేట్లు ఎత్తివేత
- శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

**హైదరాబాద్/జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి/ అయిజ/మెండోరా/మహదేవపూర్/కాళేశ్వరం, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. మరోవైపు గోదావరిలో ప్రవాహం తగ్గుముఖం పట్టింది. కర్ణాటకలోని ఆల్మట్టికి 21 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. దిగువకు అదే స్థాయిలో నీటిని వదులుతున్నారు. నారాయణపురకు 35 వేల క్యూసెక్కులు వస్తుండగా.. అవుట్‌ఫ్లో 41 వేల పైచిలుకు క్యూసెక్కులుగా నమోదవుతున్నది. ఉజ్జయిని నుంచి ఆరువేల క్యూసెక్కులపైబడి వరద వస్తున్నది. జూరాల జలాశయానికి 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అంతేమేరలో అవుట్‌ఫ్లో నిర్వహిస్తున్నారు. కర్ణాటక ఎగువప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలశయానికి 12,782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. మూడు స్పిల్ గేట్ల ద్వారా 4,611 క్యూసెక్కుల నీరు కిందికి వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి 55 వేల క్యూసెక్కులకుపైగా వస్తుండగా.. అవుట్‌ఫ్లో 94 వేల పైచిలుకు నమోదవుతున్నది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 67,661 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా గురువారం సాగర్ రెండు క్రస్టు గేట్లను ఎత్తి 16,158 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు.

**గోదావరిలో తగ్గుతున్న వరద**
గోదావరి బేసిన్‌లో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గురువారం ఉదయం 6 గంటలకు 15,571 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోరాగా.. మధ్యాహ్నం 4,650 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం జలాశయంలో 79 టీఎంసీల వరకు నీటి నిల్వ ఉంది. మరో 11 టీఎంసీలు వస్తేగానీ పూర్తిస్థాయి నిల్వకు చేరుకోదు. శ్రీరాజరాజేశ్వర, లోయర్ మానేరుకు ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. కడెంకు స్వల్పంగా 650 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 2,795 క్యూసెక్కుల వరద వస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ(మేడిగడ్డ)బరాజ్‌లో 11 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. జిల్లాలోని కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి నది 3.5 మీటర్ల ఎత్తులో పారుతున్నది.


30 రోజుల ప్రణాళికలో నెల రోజులపాటు శ్రమించిన పంచాయతీ కార్మికులకు మంత్రి కేటీఆర్ సొంత డబ్బుతో బీమా చేయిస్తున్నారు. సిరిసిల్లలో బుధవారం పర్యటించిన మంత్రి కేటీఆర్ రూ.4 లక్షల బీమా సొమ్మును కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు అందించడంతో గురువారం జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు సంబురాలు జరుపుకొన్నారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి సర్పంచ్ జక్కుల రవీందర్, టీఆర్‌ఎస్వీ నేత జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులు క్షీరాభిషేకం చేశారు. - సిరిసిల్ల రూరల్

# నాలుగు జిల్లాల్లో భారీ వర్షాలు

### మరో ఐదు జిల్లాల్లో ఓ మోస్తరు
### అత్యధికంగా ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో 12 సెం.మీ.


ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం తాళ్లపెంట - చీన్యా తండాలో చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జోగుళాంబ గద్వాల జిల్లాలతోపాటు గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం కురువగా వికారాబాద్, నల్లగొండ, ములుగు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పిడుగులు పడగా ఇద్దరు మరణించారు. నల్లగొండ జిల్లాలో ఓ ఇంటి గోడ కూలింది. అత్యధికంగా ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో 12 సెం.మీ., వర్షపాతం నమోదైంది.

ఖమ్మం జిల్లాలోని ఏన్కూర్, పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. పెనుబల్లి మండలం చీన్యాతండా–తాళ్లపెంట మధ్య రహదారిలో చప్టాపై వరదనీరు ప్రవహించడంతో మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చర్ల, చండ్రుగొండ మండలాలతోపాటు కొత్తగూడెం పట్టణంలో భారీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వికారాబాద్ మండలం ధారూరు, కోట్‌పల్లి, నవాబుపేట, మర్పల్లిలో కురుస్తున్న వర్షానికి గొట్టిముక్కల వాగు, మద్గుల్ చిట్టంపల్లి వాగులు పొంగిపొర్లుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ములుగు జిల్లాలోని వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, వాజేడు, మంగపేట, వెంకటాపురం(నూగూరు) మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండ పట్టణ శివారులోని పానగల్లు, చర్లపల్లి గ్రామాల్లో, కనగల్ మండలంలో ఓ మోస్తరు వర్షం పడింది. కనగల్‌మండలంలోని కురంపల్లిలో ఓ ఇంటిగోడ కూలింది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం**
**హైదరాబాద్ సిటీబ్యూరో/నమస్తేతెలంగాణ:** ఉపరితల ఆవర్తనం, క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. అక్కడక్కడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం 6 వరకు అత్యధికంగా కుత్బుల్లాపూర్, గాజులరామారంలో 6.4 సెం.మీ. చొప్పున, జీడిమెట్లలో 5.3 సెం.మీ., అల్వాల్‌లో 5.1 సెం.మీ., శేరిలింగంపల్లి, మాదాపూర్‌లో 4.8 సెం.మీ. చొప్పున, కీసరలో 3.4 సెం.మీటర్ల వర్షపాతం నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు.

**నేడు, రేపు రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు**
హైదరాబాద్, నమస్తేతెలంగాణ: కొమోరిన్ ప్రాంతం నుంచి కోస్తాంధ్ర వరకు తమిళనాడు, రాయలసీమ మీదుగా 0.9 కి.మీ. ఎత్తున ఉపరితల ద్రోణి కొనసాగుతున్నదని, దీని ప్రభావం వల్ల రాష్ట్రంలోని పలుచోట్ల శుక్ర, శనివారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**పలుచోట్ల పిడుగులు.. ఇద్దరు మృతి**
నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్‌లో పిడుగుపడగా లక్ష్మి (40) అనే మహిళ మృతి చెందింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన రవి (23) అనే యువకుడు పిడుగుపాటుకు మరణించాడు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాడు. ఆ చెట్టుపై పిడుగు పడటంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు.



## చింతకుంట్లలో బయటపడిన పురాతన రాతిశిల్పాలు

**దేవరకొండ, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామంలో వారం కిందట కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టగా పురాతన రాతిశిల్పాలు బయటపడ్డాయి. ఎంపీపీ దూది పాల రేఖాశ్రీధర్‌రెడ్డి స్వగ్రామమైన చింతకుంట్లలో 30 రోజుల ప్రణాళికలో భాగంగా కంపచెట్లను తొలగిస్తుండగా నాలుగు రాతి శిల్పాలు బయటపడ్డాయి. ప్రస్తుతం శిల్పాలు బయటపడ్డ ప్రాంతం పక్కనే శివాలయం ఉండేదని, అప్పట్లో పెద్ద జాతర కూడా సాగేదని పూర్వీకులు చెప్పారని గ్రామస్థులు తెలిపారు. పురావస్తుశాఖ, చరిత్రకారులు మరుగున పడిపోయిన చరిత్రను వెలుగులోకి తేవాలని కోరారు.

తొలివిడుత జరిగిన తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా పాల్గొన్నానని, పాఠశాలలో కంటే ఉద్యమంలోనే ఎక్కువగా ఉండేవాడినని రాష్ట్ర ఎన్నికల అధికారి వీ నాగిరెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం జరిగిన 1971-72 విద్యాసంవత్సరం టెన్త్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశను గుర్తుచేసుకున్నారు. గురువులను, మాజీ సైనికులను, ఉత్తమ రైతులను సత్కరించారు.- అందోల్, నమస్తే తెలంగాణ



## తల్లితో సహజీవనం.. కూతురుపై లైంగికదాడికి యత్నం

**అశ్వారావుపేట, నమస్తే తెలంగాణ:** తల్లితో సహజీవనంచేస్తూ ఆమె కూతురుపై లైంగికదాడికి యత్నించాడు ఓ ప్రబుద్ధుడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం దొంతికుంటలో బుధవారం రాత్రి జరిగింది. దొంతికుంటకు చెందిన ముళ్లగిరి శ్రీను పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడికి చెందిన చంద్రకళతో సహజీవనం సాగిస్తున్నాడు. ఆమె భర్తతో వీడిపోయింది. ద్వారకా తిరుమలలో 9వ తరగతి చదువుతున్న తన 14 ఏండ్ల కూతురు దసరా సెలవుల్లో చంద్రకళ వద్దకు వచ్చింది. మద్యంమత్తులో శ్రీను తన ఘర్షణ పడటంతో చంద్రకళ పక్కింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె మార్తెపై శ్రీను లైంగికదాడికి యత్నించగా.. బాలిక కేకలు వేయడంతో తల్లి అక్కడకు చేరుకున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదుచేశారు.



హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రిటైల్ అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న ఫాల్కన్ చైర్మన్ ధీరజ్ లాల్ సువాగియా. చిత్రంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్ నల్లపాటి బసంత్ ఉన్నారు.



## భారత్‌కు మూడీస్ షాక్

- ఈ ఏడాది వృద్ధి 5.8 శాతమే

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్..భారత్‌కు మరోమారు షాకిచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధిరేటు అంచనాను 5.8 శాతానికి తగ్గించింది. గతంలో 6.2 శాతంగా ఉంటుందని అంచనావేసిన రేటింగ్ ఏజెన్సీ..ఆర్థిక మందగమన పరిస్థితులు కొనసాగుతుండటంతో వృద్ధి అంచనాల్లో కోత విధించింది. రిజర్వు బ్యాంక్ అంచనావేసిన 6.1 శాతం వృద్ధి కంటే ఇది తక్కువ. పెట్టుబడులు తగ్గుముఖం పట్టడం, వినిమయం నిరాశావాదంగా ఉండటం, గ్రామీణ గృహస్తులు ఆర్థిక ఒత్తిళ్లకు లోనుకావడం, ఉద్యోగ కల్పన అంతంత మాత్రంగానే ఉండటంతో వృద్ధి అంచనాల్లో కోత విధించినట్లు తెలిపింది. దేశీయంగా, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కూడా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని మూడీస్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ వచ్చే ఏడాదిలో భారత్ 6.6 శాతం వృద్ధిని సాధించనున్నదన్న నమ్మకాన్ని వ్యక్తం చేయడం విశేషం. వరుసగా రెండు సంవత్సరాలపాటు ఏడు శాతం దిగువనే కొనసాగనున్న వృద్ధి స్వల్పకాలం తర్వాత 7 శాతం కంటే అధిక వృద్ధిని నమోదు చేసుకోనున్నదని పేర్కొంది. రెండేండ్ల క్రితం 8 శాతం వృద్ధిరేటుతో ప్రపంచంలో అత్యధిక వేగవంతమైన వృద్ధిని సాధించిన దేశంగా భారత్ కొనసాగినప్పటికీ ప్రస్తుత పరిస్థితులు అంత ఆశాజనకంగా లేకపోవడంతో దిగువముఖం పట్టింది. గత నెలలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనమిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్‌లు భారత వృద్ధి అంచనాల్లో కోత విధించాయి. స్టాండర్డ్ అండ్ పూర్స్ కూడా 7.1 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గించగా, ఫిచ్ 6.6శాతానికి దించింది.




## చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

**పీఎంసీ బ్యాంక్ డిపాజిటర్లకు నిర్మలా సీతారామన్ హామీ**



**ముంబై, అక్టోబర్ 10:** పంజాబ్ మహారాష్ట్ర సహకార(పీఎంసీ) బ్యాంక్ కుంభకోణంపై ఆందోళన చేస్తున్న ఆ బ్యాంక్ ఖాతాదారులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భరోసానిచ్చారు. అంతకుముందు పార్టీ ప్రధాన కార్యాలయం ముందు ఖాతాదారులు చేసిన ఆందోళకు దిగిన నేపథ్యంలో వారితో కలిసి మంత్రి మాట్లాడరు. ఈ విషయంపై రిజర్వు బ్యాంక్ గవర్నర్‌తో మాట్లాడుతాను..పీఎంసీ ఖాతాదారుల ఆందోళనను వారి దృష్టికి తీసుకెళుతాను...అలాగే ఆర్థిక శాఖ కార్యదర్శులతో చర్చించి భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలు తీసుకునేదానిపై ఆలోచన చేస్తామని నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా తెలిపారు. పీఎంసీ బ్యాంక్ ఖాతాదారుల నగదు ఉపసంహరణ పరిమితిని రూ.25 వేలకు పెంచుతూ ఆర్బీఐ తాజాగా నిర్ణయం తీసుకున్నది. మరోవైపు, ఆర్థిక మాంద్యం దెబ్బకు వివిధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

# 1.76 లక్షల కోట్ల నష్టం

- మూడేండ్లలో నిరర్థక ఆస్తుల దెబ్బకు కుదేలైన బ్యాంకులు
- రూ.100 కోట్ల కంటే అధిక మొండి బకాయిదారులు 416
- పెద్ద నోట్ల రద్దు తర్వాత భారీగా రద్దైన రుణాలు : ఆర్బీఐ వెల్లడి

**ముంబై, అక్టోబర్ 10:**

ఆర్థిక మందగమనంలో కొనసాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు మరో చేదువార్త. కుప్పల్లా పెరిగిపోతున్న నిరర్థక ఆస్తుల దెబ్బకు ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు కుదేలవుతున్నాయి. పెద్ద నోట్ల రద్దు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు దేశీయ బ్యాంకింగ్ రంగ సంస్థలకు అక్షరాల రూ.1.76 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. 2014-15 నుంచి ఆయా సంస్థల నుంచి రూ.100 కోట్లకు పైగా రుణాలను తీసుకొని ఎగ్గొట్టిన 416 మంది మొండి బకాయిలదారులు చెల్లించాల్సిన మొత్తం ఇది. సరాసరిగా ఒక్కొక్కరు రూ.424 కోట్లకు పైగా రుణాలు చెల్లించాల్సి ఉంది. ద్రవ్యలోటుతో సతమతమవుతున్న కేంద్ర ప్రభుత్వానికి రిజర్వు బ్యాంక్ అందించనున్న రూ.1.76 లక్షల కోట్లకు ఇది సమానం. సమాచార హక్కు చట్టం ప్రకారం రిజర్వు బ్యాంక్‌ను అడిగిన ప్రశ్నకు ఈ విషయం వెల్లడైంది. 2015 నుంచి 2018 మధ్యకాలంలో ప్రభుత్వ, ప్రైవేట్, కమర్షియల్ బ్యాంకులు నికరంగా నష్టపోయింది రూ.2.17 లక్షల కోట్లు. వీటిలో తొలి ఏడాది 109 మంది రుణ గ్రహీతలకు చెందిన రూ.40,798 కోట్ల రుణాలను రద్దుచేసిన ప్రభుత్వరంగ బ్యాంకులు.. మార్చి 31, 2016 నాటికి 199 మంది మొండి బకాయిదారులకు సంబంధించిన రూ.69,976 కోట్లు రద్దు చేశాయి. భారీగా రుణాలను రద్దు చేస్తున్నప్పటికీ బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బకాయిలు మాత్రం తగ్గడం లేదు. ఏడాది ఏడాదికి అంతకు పెరుగుతున్నాయి.



### నోట్ల రద్దు తర్వాత పెరిగిన మొండి బకాయిలు

నల్లధనాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ పెద్ద నోట్లను రద్దు చేస్తు తీసుకున్న నిర్ణయం మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపింది.. ఇదే సమయంలో మొండి బకాయిలు అంతకంతకు పెరిగాయి. అంతకుముందు 343 మొండి బకాయిదారులు ఉండగా, ఆ తర్వాత మరో 144 మంది జతయ్యారు. పెద్ద నోట్ల రద్దు చేసిన నాటికంటే ముందు రూ.69,926 కోట్లుగా ఉన్న రుణాల రద్దు ఆ తర్వాత ఏకంగా రూ.1,27,797 కోట్లకు పెరిగాయి. అంటే నికరంగా రూ.57,821 కోట్లు పెరిగినట్లు అయ్యాయి. మార్చి 31, 2018 నాటికి రుణాలు తీసుకొన్ని ఎగ్గొట్టిన వారి సంఖ్య 525కి చేరారు. ఇదే సమయంలో మొండి బకాయిలు రూ.1.27 లక్షల కోట్ల నుంచి రూ.2.17 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 2014 కంటే ముందువున్న మొండి బకాయిల వివరాలు మాత్రం సెంట్రల్ బ్యాంక్ వెల్లడించలేదు.

### తిరిగి వసూలు చేసింది స్వల్పమే..

కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్లు ఉన్నది బ్యాంకుల వ్యవహారం. కార్పొరేట్ సంస్థలకు వేలాది కోట్ల రూపాయలు రుణాలు ఇచ్చి తిరిగి వసూలు చేయడంలో మాత్రం విఫలమయ్యాయి. కేవలం 15-20 శాతం వరకు మాత్రమే రుణాలను రికవరీ చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆర్థిక మందగమన పరిస్థితుల నేపథ్యంలో రుణాలు తీసుకున్న వారు తిరిగి కట్టలేక చేతులెత్తేసిన వారి నుంచి రుణాలను వసూలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకున్నప్పటికీ నిరాశే మిగిలింది.




# అంచనాలకు చేరుకోని టీసీఎస్

**తొలి త్రైమాసికంలో రూ.8,042 కోట్ల లాభం.. 450 శాతం డివిడెండ్ ప్రకటించిన సంస్థ**

**ముంబై, అక్టోబర్ 10:** కార్పొరేట్ల ఆర్థిక ఫలితాల బోణి బెదిరింది. దేశీయ సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలకు చేరుకోలేకపోయింది. సెప్టెంబర్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.8,042 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.7,901 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం 1.8 శాతం పెరుగుదల నమోదైంది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.8 శాతం ఎగబాకి రూ.38,977 కోట్లకు చేరుకున్నది. నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ సంస్థ..వాటాదారులకు భారీ స్థాయిలో డివిడెండ్‌ను ప్రకటించింది. రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు మధ్యంతర డివిడెండ్ కింద రూ.5, ప్రత్యేక డివిడెండ్ కింద మరో రూ.40 చెల్లించనున్నట్లు తెలిపింది. ఆర్థిక సేవల్లో అనిశ్చితి ఉన్నప్పటికీ ఈ త్రైమాసికానికి స్థిరమైన వృద్ధితో ముగించామని టీసీఎస్ సీఈవో, ఎండీ రాజేష్ గోపినాథన్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ సేవలకు మధ్యస్థ, దీర్ఘకాలికంగా డిమాండ్ ఉంటుందన్న నమ్మకంతో ఉన్నట్లు పేర్కొన్న ఆయన..రెండో త్రైమాసికంలో వచ్చిన ఆర్డర్ బుకింగ్ చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. గడిచిన ఆరు త్రైమాసికాలుగా ఇదే గరిష్ఠం. బ్యాంకింగ్, రిటైల్ రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా లాభాల్లో భారీ వృద్ధిని నమోదు చేసుకోలేకపోయామని ఆయన పేర్కొన్నారు. తొలి ఆరు నెలల్లో నిరాశాజనక పనితీరు కనబరిచినప్పటికీ రెండో ఆరు నెలల్లో మాత్రం ఇంతకంటే మెరుగైన పనితీరును నమోదు చేసుకుంటామన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, సేవలు, బీమా రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా ఈ విభాగ వృద్ధి 8 శాతానికి పడిపోయిందన్నారు. ఆపరేటింగ్ మార్జిన్ 24 శాతంగా ఉండగా, నెట్ మార్జిన్ 20.6 శాతంగా నమోదైంది. ప్రతి షేరుకు రూ.21.43 ఆర్జించినట్లు అయింది. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో డిజిటల్ విభాగం నుంచి 27.9 శాతం సమకూరగా, లైఫ్ సైన్స్ అండ్ హెల్త్‌కేర్ నుంచి 16 శాతం, కమ్యూనికేషన్స్ అండ్ మీడియా నుంచి 11.8 శాతం లభించింది. అలాగే బ్రిటన్ వ్యాపారంలో 13.3 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, యూరప్ 16 శాతం పెరిగింది.



ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా టీసీఎస్ సీఈవో రాజేశ్ గోపినాథన్‌తో పలువురు ఉన్నతాధికారులు

### 6.4 బిలియన్ డాలర్ల ఒప్పందాలు

గడిచిన త్రైమాసికంలో టీసీఎస్ 6.4 బిలియన్ డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకున్నది. యూరప్, ఇంగ్లాండ్ దేశాల నుంచి వచ్చిన ఆదాయం భారీగా పెరుగగా, అమెరికా నుంచి తగ్గుముఖం పట్టగా, మధ్య తూర్పు, ఆసియా-పసిఫిక్ దేశాలు బలహీనంగా ఉండటం దెబ్బతీసిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గత త్రైమాసికంలో నికరంగా 14 వేల మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకున్నది సంస్థ. దీంతో మొత్తం సంఖ్య 4.50 లక్షలకు చేరుకున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ల ద్వారా 30 వేల మందిని నియమించుకోనున్నట్లు సంస్థ ప్రకటించింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర స్వల్పంగా తగ్గి రూ.2,004.40 వద్ద ముగిసింది.



## ఐపీఏ అధ్యక్షుడిగా సతీష్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 10:** రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి..ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్(ఐపీఏ) అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ పదవిలో రెండేండ్లపాటు ఉండనున్నారు. పినాసియా బయోటెక్ లిమిటెడ్ ఎండీ రాజేశ్ జైన్ వైస్-ప్రెసిడెంట్‌గా కొనసాగనున్నారు. ఇండస్ట్రీ అసోసియేషన్, ప్రభుత్వ ప్యానెళ్లలో కీలక పాత్ర పోషిస్తున్న సతీష్ రెడ్డి..ఫార్మాస్యూటికల్స్ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపైన ఔషధ ధరలు, దిగుమతుల మార్గదర్శకాలపై దృష్టి సారించనున్నారు. ఆయన గతంలో 2013-15 మధ్యకాలంలో అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఐపీఏ కార్యదర్శి జనరల్ సుదర్శన్ జైన్ మాట్లాడుతూ..ఫార్మా రంగంలో విశేష అనుభవం ఉన్న సతీష్ రెడ్డి, రాజేష్ జైన్‌లకు మరోసారి ఐపీఏ స్వాగతం పలుకుతున్నదని, అంతర్జాతీయ ఫార్మా రంగంలో భారత్ మెరుగైన వృద్ధికి వీరి అనుభవాలు ఎంతో ఉపయోగపడనున్నాయన్నారు.

## అరడజన్ బ్యాంకుల వడ్డీరేట్ల తగ్గింపు

**చెన్నై, అక్టోబర్ 10:** మరో అరడజన్ ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక వడ్డీరేట్లను తగ్గించాయి. వీటిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకులు రిటైల్, సూక్ష్మ-చిన్న మధ్యతరహా రుణాలపై వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించినట్లు ప్రకటించాయి. గతవారంలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావు శాతం తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్‌లు ఈ నిర్ణయం తీసుకుంటున్నాయి. తగ్గించిన రేట్లు నవంబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ తెలిపింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో హౌజింగ్, వాహన, విద్య, మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌లు తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీరేటు 8.25 శాతం నుంచి 8 శాతానికి తగ్గనున్నది. బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఒకరోజు కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్‌ఆర్‌ను 15 బేసిస్‌పాయింట్లు తగ్గించగా, ఏడాది రుణాలపై 5 బేసిస్ పాయింట్లు దించింది. ఈ నూతన రేట్లు గురువారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. కాగా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కూడా మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేట్లను పది బేసిస్ పాయింట్లు కోత విధించింది. దీంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్‌ఆర్ 8.40 శాతానికి తగ్గనున్నది. ఈ కొత్త రేట్లు ఈ నెల 8 నుంచే అమలులోకి వచ్చినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. వీటితోపాటు ఒకరోజు నుంచి ఆరు నెలల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు తగ్గించడంతో ఇవి 8.05 శాతం నుం చి 8.30 శాతం మధ్యలోకి చేరాయి. రెపో రేట్లతో అనుసంధానం చేసిన రుణాలను కూడా బ్యాంక్ పావు శాతం తగ్గించడంతో 8.20 శాతానికి తగ్గింది. అంతకుముందు ఇది 8.45 శాతంగా ఉన్నది. బ్యాంక్ బేస్ రేటును 9.50 శాతం యథాతథంగా ఉంచింది. ప్రస్తుత పండుగ సీజన్‌లో రుణ గ్రహీతలకు ఊరట కల్పించాలనే ఉద్దేశంతో రెపో బేస్డ్ లెండింగ్ రేటుని 25 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలలో తెలిపింది. ఈ రేట్లు ఈ నెల 10 నుంచి అమలులోకి రానున్నాయి. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో గృహ రుణాలపై వడ్డీరేటు 8 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గనుండగా, ఎంఎస్‌ఎంఈ రుణాలపై 8.95 శాతం నుంచి 9.50 శాతానికి తగ్గనున్నది. గతంలో ఇది 9.20 శాతం నుంచి 9.75 శాతంగా ఉన్నది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ కూడా తన ఎంసీఎల్‌ఆర్‌ని 8.40 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించింది.




## జీఎస్టీ వసూళ్ల పెంపునకు ప్రత్యేక కమిటీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** ఏడాదిన్నర కనిష్ఠ స్థాయికి పడిపోయిన వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జీఎస్టీ ఎగవేతలను నివారించడానికి, పన్ను వసూళ్లను పెంచడానికి తీసుకునే నిర్ణయాలను ఈ కమిటీ సమీక్షించి వచ్చే పదిహేను రోజుల్లో తన నివేదికను సమర్పించనున్నది. జీఎస్టీ వసూళ్ళను పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ర్టాల వారీగా జీఎస్టీ కమిషనర్లు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఈ కమిటీ సమాచారాన్ని సేకరించనున్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. మొత్తం ఆరు పాయింట్ల ఆధారంగా తీసుకునే చర్యలపై ప్రధానంగా చర్చించి తొలి నివేదికను వచ్చే పక్షం రోజుల్లో ఇవ్వాలని కమిటీని కేంద్రం సూచించింది. అలాగే జీఎస్టీలో చేయాల్సిన మార్పులకు సంబంధించిన దానిపై కూడా ఒక నివేదికను ఇవ్వాలని కోరింది. సెప్టెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు 19 నెలల కనిష్ఠ స్థాయి రూ.92 వేల కోట్లకు తగ్గడంపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. ఇప్పటికే ఆర్థిక మాంద్యం ఉరుముతుంటే మరోవైపు జీఎస్టీ వసూళ్ళు తగ్గిపోవడంతో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది కేంద్రం.




వన్‌ప్లస్ మొబైళ్లను ఆవిష్కరిస్తున్న బిగ్ 'సి' ప్రచారకర్త సమంత. చిత్రంలో కంపెనీ ఫౌండర్ బాలు చౌదరి

## బిగ్‌'సి'లో వన్‌ప్లస్ మొబైళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 10:** ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్‌'సి'లో అంతర్జాతీయ బ్రాండ్ వన్‌ప్లస్‌కు చెందిన అన్ని రకాల మొబైళ్లు లభించనున్నాయి. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కంపెనీ రిటైల్ అవుట్‌లెట్‌లో ప్రముఖ సినీతార సమంత వన్‌ప్లస్ మొబైళ్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ..దేశీయ, అంతర్జాతీయ బ్రాండ్లన్ని తమ మొబైల్ రిటైల్ అవుట్‌లెట్ ద్వారా విక్రయించాలని ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఆన్‌లైన్ కంటే రిటైల్ అవుట్‌లెట్‌లో కొనుగోలు చేయడం ద్వారా ప్రయోజనకరంగా ఉంటుందని వినియోగదారులు భావిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వన్‌ప్లస్ మొబైళ్లను కొనుగోలు చేసిన వారికి రూ.1,500 నగదు రాయితీ, ఆరు నెలలపాటు ఈఎంఐలపై ఎలాంటి వడ్డీ విధించడం లేదని పేర్కొంది.

# బ్యాంకింగ్ షేర్లు ఢమాల్

**298 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**ముంబై, అక్టోబర్ 10:** స్టాక్ మార్కెట్ల భారీ ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఆర్థిక, వాహన రంగ షేర్లు కుదుపునకు లోనుకావడం, భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలహీనపడుతున్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ప్రారంభం కావడం కూడా మార్కెట్లలో అలజడి సృష్టించింది. ఒక దశలో 375 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 297.55 పాయింట్లు తగ్గి 37,880.40 వద్దకు జారుకున్నది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా మరో 78.75 పాయింట్లు పతనం చెంది 11,234.55 వద్ద ముగిసింది. మదుపరులు అంచనావేసినట్లుగా కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు లేకపోవడం, భారత వృద్ధి అంచనాను 6.2 శాతం నుంచి 5.8 శాతానికి తగ్గిస్తున్నట్లు మూడీస్ ప్రకటించడం స్టాక్ మార్కెట్లు పతనానికి ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. యెస్ బ్యాంక్, టాటా మోటర్స్, వేదాంత, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్‌ల షేర్లు 5.21 శాతం వరకు నష్టపోయాయి. కేవలం భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా 5.05 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. వీటితోపాటు ఆర్ఐఎల్, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటోల షేర్లు రెండు శాతానికి పైగా బలపడ్డాయి. సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో మొండి బకాయిలు మరింత పెరిగే అవకాశం ఉన్నదన్న అంచనాతో బ్యాంకింగ్ రంగ షేర్లు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకెక్స్, రియల్టీ, ఫైనాన్స్, మెటల్, ఆటో రంగ షేర్లు 2.61 శాతం వరకు నష్టపోగా..టెలికం, ఇంధనం, టెక్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు నాలుగు శాతం వరకు లాభపడ్డాయి.



### భారీగా లాభపడ్డ టెలికం షేర్లు

స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయినప్పటికీ టెలికం రంగ షేర్లు మాత్రం భారీగా లాభపడ్డాయి. ముకేశ్ అంబానీకి చెందిన టెలికం రిలయన్స్ జియో కాల్ కనెక్ట్ చార్జీలను విధిస్తున్నట్లు ప్రకటించడంతో ఇతర టెలికం కంపెనీల షేర్లు ఆరు శాతంవరకు ఎగబాకాయి. భారతీ ఎయిర్‌టెల్ 7.19 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.385కి చేరింది. వొడాఫోన్ ఐడియా షేరు ధర కూడా 5.82 శాతం బలపడి రూ.6.18కి చేరింది. జియో చార్జీలు విధించడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2.76 శాతం బలపడి రూ.1,362.40 వద్దకు చేరింది.

## ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభంలో భారీ వృద్ధి

ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,400.96 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.920.34 కోట్లతో పోలిస్తే 52.2 శాతం అధికం. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆదాయం రూ.6,755.37 కోట్ల నుంచి రూ.8,877.53 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ బ్యాంక్ మొండి బకాయిలు మరింత పెరిగాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 1.09 శాతంగా ఉన్న బ్యాంక్ నిరర్థక ఆస్తుల విలువ గత మూడు నెలల్లో 2.19 శాతానికి చేరుకున్నాయి. నికర ఎన్‌పీఏ కూడా0.48 శాతం నుంచి 1.12 శాతానికి చేరాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ నిధుల కేటాయింపులు కొనసాగుతున్నాయని, గత త్రైమాసికంలో కూడా రూ.737.71 కోట్ల నిధులను వెచ్చించింది.







## డ్యూరోఫ్లెక్స్ నుంచి నూతన శ్రేణి పరుపులు

- గరిష్ఠ ధర రూ.50 వేలు

**హైదరాబాద్, అక్టోబర్ 10:** ప్రముఖ పరుపుల తయారీ సంస్థ డ్యూరోఫ్లెక్స్..మార్కెట్లోకి నూతన శ్రేణి పరుపులను విడుదల చేసింది. నడుం నొప్పిని నివారించే ఈ పరుపులను నేషనల్ హెల్త్ అకాడమీ ధృవీకరించిన దేశంలో మొట్టమొదటి ఆర్థోఫెడిక్ మ్యాట్రెస్ ఇదేనని తెలిపింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ మథ్యూ చాండీ మాట్లాడుతూ..హైదరాబాద్‌తోపాటు బెంగళూరుల్లో నూతన శ్రేణి పరుపులకు విపరీతంగా డిమాండ్ ఉన్నదన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్లుగా నమోదైన టర్నోవర్..వచ్చే మార్చి నాటికి 20 శాతం వృద్ధితో రూ.600 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదన్నారు. దేశవ్యాప్తంగా ఆరు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసిన సంస్థ..గతేడాది మేడ్చల్‌లో రూ.100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన యూనిట్‌లో ప్రతిరోజు 500 పరుపులు తయారవుతున్నాయి. ఈ నూతన శ్రేణి పరుపులు రూ.7,500 మొదలుకొని రూ.50 వేల లోపు లభించనున్నాయి. రూ.10 వేల కోట్ల స్థాయిలో ఉన్న పరుపుల పరిశ్రమలో కంపెనీ వాటా పది శాతం లోపేనని, వచ్చే ఏడాది రెండంకెల వృద్ధిని సాధించనున్నట్లు పేర్కొన్నారు.

# పశుసంపద పెంపుతో ఆర్థికాభివృద్ధి

### విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**కనగల్:** పశు సంపదను పెంపొందించుకోవడం ద్వారా గ్రామాల్లో ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని, ఇది ప్రతి ఒక్కరికీ ఆదాయ మార్గంలా నిలుస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కనగల్ మండలం జి.ఎడవెల్లి గ్రామంలో పశువులకు ఉచిత కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పాడి పశువుల్లో జన్యు సామర్థ్యాలను వృద్ధి చేయ డం, ఉత్పాదకతను పెంపొందించే కీలక విధానాల్లో కృత్రిమ గర్భధారణ ఒకటని తెలిపారు. ఆంబోతులు, దున్నల వినియోగ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ఇది చవకైన విధానమని, వ్యాధులు రాకుండా అడ్డుకుంటుందని వెల్లడించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలోని మైల సముద్రం, జి.ఎడవెల్లి ఊర చెరువుల్లో చేప పిల్లలనువది లారు.



నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ ఎడవెల్లి గ్రామంలో కృత్రిమ గర్భధారణ పశువులకు ట్యాగ్‌వేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



గురువారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లి చెరువులో పసుపు, కుంకుమ చల్లి పూజచేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## సీఎం కేసీఆర్ కృషితోనే చెరువుల్లో జలకళ

### చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**రామడుగు:** సీఎం కేసీఆర్ కృషితోనే చొప్పదండి నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లి ఊరచెరువు నీటితో నిండటంతో గురువారం ఎంపీపీ కలిగేటి కవిత, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, మత్స్య కార్మికులతో కలిసి చెరువులో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచు కోల రమేశ్, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ మండల కన్వీనర్ జూపాక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మూసీగేటు బిగింపు పనులు ముమ్మరం

**కేతేపల్లి:** నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టు ఐదో రెగ్యులేటరీ గేటు బిగింపు పనులను అధికారులు ముమ్మరం చేశారు. గేటు ఊడిన ప్రాంతం నుంచి నీరు వృథాగా పోవడంతో గురువారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 619 అడుగులు (0.41 టీఎంసీలు)లకు తగ్గింది. 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గేటు భాగం నుంచి 6,700 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. నూతన స్టాప్‌లాగ్ గేటు భాగాలను తిరుపతి నుంచి తీసుకురాగా మిగతా భాగాలు హైదరాబాద్‌లో తయారవుతున్నాయి. శుక్రవారం నూతన గేటును బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

**సిరికొండ:** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో గురువారం రాత్రి రైతులు జంగంపేట గంగారామ్(65), చాకలి చేగంటి గంగారామ్(65) విద్యుదాఘాతంతో మృతిచెందినట్టు సిరికొండ ఎస్సై నరేందర్ తెలిపారు. పంట చేనులో అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి రైతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్టు పేర్కొన్నారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

## ప్రారంభమైన రైళ్ల రాకపోకలు

### పట్టాలెక్కిన బీటీఎం రైలింజన్

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/నమస్తే తెలంగాణ:**

కాచిగూడ–డోన్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ రైల్వేస్టేషన్ వద్ద బీటీఎం రైలింజన్‌ను అధికారులు పట్టాలెక్కించారు. బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బలాస్ట్ క్లీనింగ్ మెషీన్ (బీటీఎం) రైలు మన్యంకొండ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు తప్పడంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాచిగూడ నుంచి పలు రైళ్లు మహబూబ్‌నగర్ వరకే నడిచాయి. తిరుపతి, చిత్తూరు, మైసూరు, చెన్నై నుంచి వచ్చే రైళ్లను గుంతకల్, రాయిచూర్, వాడి, వికారాబాద్ మీదుగా దారి మళ్లించారు. కాచిగూడ నుంచి చెన్నై, బెంగళూరు, తిరుపతి వైపు వెళ్లాల్సిన రైళ్లను సైతం వాడి, రాయిచూర్, గుంతకల్ మీదుగా మళ్లించారు. బుధవారం రాత్రి 8 గంటల నుంచి నిరంతరాయంగా పనులు చేపట్టిన రైల్వేశాఖాధికారులు గురువారం తెల్లవారుజామున 3 గంటల తర్వాత బీటీఎం రైలును పట్టాలపైకి తీసుకొచ్చారు. తర్వాత ఈ మార్గంలో రాకపోకలను పునరుద్ధరించారు.

## రూ.23 లక్షల విలువైన గుట్కా పట్టివేత

**గుడిహత్నూర్:** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ సమీప దాబా వద్ద కంటెయినర్ వాహనంలో నిషేధిత గుట్కాను గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. సుమారు రూ.23 లక్షల విలువైన గుట్కాప్యాకెట్ల సంచులను పట్టుకున్నారు. కంటెయినర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



పోలీసులు పట్టుకున్న గుట్కా ప్యాకెట్ల సంచులు


































నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
# జిందగీ
శుక్రవారం 11 అక్టోబర్ 2019
/nt.zindagi

## మానవత్వాన్ని చాటుకున్నది!

కరీంనగర్



**వైద్యవృత్తిని చేపట్టిన డాక్టర్లు తాము ఎట్టి పరిస్థితుల్లో అయినా రోగుల ప్రాణాలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తారు. మేఘాలయలోని వెస్ట్ గారో జిల్లాకు చెందిన డాక్టర్ బల్నాంచి సంగ్మా ప్రాణాపాయంలో ఉన్న ఇద్దరు గర్భిణులను కాపాడి ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నది.**

ఇద్దరు గర్భిణులు ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పెద్ద దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించారు. అంబులెన్స్ అందుబాటులో ఉంది. కానీ, డ్రైవర్ సెలవులో ఉన్నాడు. 108 సర్వీస్‌కు ఫోన్ చేద్దామంటే సంబంధిత సిబ్బంది తమ హక్కుల సాధన కోసం బంద్ ప్రకటించారు. ఆ సమయంలో డాక్టర్ బల్నాంచి సంగ్మా డ్యూటీలో ఉన్నది. డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో సంగ్మానే అంబులెన్స్ డ్రైవర్‌గా మారింది. 36 కిలో మీటర్ల దూరం అంబులెన్స్ నడిపి ఆ ఇద్దరి మహిళల ప్రాణాలను కాపాడింది. సరైన సమయానికి ఆమె వారిని ఆసుపత్రికి చేర్చడం వల్లే వారికి వైద్యం అందింది. దీంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. 'వైద్యులంటే కేవలం వైద్యం చేయడం మాత్రమే కాదు.. ప్రాణాలకు ముప్పు ఉన్నప్పుడు ఎలాగైనా కాపాడే ప్రయత్నం చేయడం మా కర్తవ్యమని' సంగ్మా చెబుతున్నది. సంగ్మా అంబులెన్స్ నడుపుతున్నప్పుడు చాలామంది ఫోన్లలో వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ 'వైద్యులంటే ఇలా ఉండాలంటూ' సంగ్మాను ప్రశంసిస్తున్నారు. 'వైద్యురాలిగా తాను చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నానని, ఇందులో తాను చేసిన గొప్ప ఏమీ లేదని' సంగ్మా చెబుతున్నది. అందరు వైద్యులూ సంగ్మాలా రోగుల పట్ల ఇలా మానవత్వం చూపిస్తే బాగుంటుందని నెటిజన్‌లు కోరుతున్నారు.

# పాత చీరకు.. కొత్త బ్లౌజ్!

**పండుగల సమయంలోనో.. ఇంట్లో ఫంక్షన్ అయితేనో.. కొత్త చీర కట్టుకోవాలని ఆశపడుతారు చాలామంది. కానీ, వేరే ఫంక్షన్లకు వెళ్లాలన్నప్పుడు.. ప్రతీసారి కొత్త చీర కట్టలేం కదా! అందుకే.. పాత చీరను కొత్త లుక్‌తో అదరగొట్టేయొచ్చు. అదెలాగంటే.. బ్లౌజ్‌ను మార్చేస్తే లుక్ మారిపోతుంది.. మీ లుక్‌నే కాదు.. వార్డ్‌రోబ్‌ని ఇలా స్టైలిష్‌గా చేసుకోవడానికి.. ఈ బ్లౌజ్‌ల ఎంపిక తప్పనిసరి అని మర్చిపోకండి..**



స్టైలిష్‌గా కనిపించాలంటే ఈ బ్లౌజ్ కుట్టించాల్సిందే! గోల్డ్, సిల్వర్ జరీతో వచ్చిన ఆకుపచ్చని పట్టు చీర ఇది. దీని మీదకి గ్రీన్ కలర్ రాసిల్క్ బ్లౌజ్‌ని తీసుకున్నాం. దాన్ని స్లీవ్‌లెస్‌గా కుట్టాం. కుడి చేతి దగ్గర మాత్రం హార్ట్ షేప్‌లో కట్ చేసి.. దానిచుట్టూ ముత్యాలతో హైలైట్ చేశాం. డిటాచెబుల్ కాలర్ నెక్ దీనికి అదనపు ఆకర్షణ. ఈ కాలర్ నెక్‌కి రెండు వైపులా చిన్న గోల్డెన్ బ్రోచెస్‌ని ఇచ్చాం.

రామాగ్రీన్, మెరూన్ కాంబినేషన్‌లో వచ్చిన కంచి పట్టు చీర. దీనికి ఆరెంజ్ కలర్ ప్రింటెడ్ బెనారస్‌ని ఎంచుకొని 'వి'నెక్‌తో బ్లౌజ్ కుట్టాం. ఎర్రని ప్లెయిన్ పట్టుని నెక్ లైన్ దగ్గర ప్లీట్స్ కుట్టాం. ఇదే ఫ్యాబ్రిక్‌ని చేతులకు ఉపయోగించాం. కింద మళ్లీ.. పట్టు జరీ, థ్రెడ్ వర్క్‌తో హెవీగా డిజైన్ చేశాం. ఈ బ్లౌజ్‌కి హ్యాండ్స్ కాస్త డిఫరెంట్‌గా ఉండేలా చూశాం.

స్కైబ్లూ, నేవీ బ్లూ కాంబినేషన్ ఎప్పటికీ ఎవర్‌గ్రీన్. ఈ కాంబినేషన్‌లో వచ్చిన పట్టు చీర ఇది. దీనికి నేవీ బ్లూ రాసిల్క్‌ని బ్లౌజ్‌గా ఎంచుకున్నాం. పైన మాత్రం హెవీ ప్లీట్స్‌తో 'యూ'షేప్‌లో కుట్టాం. కింద ఒక స్టోన్‌తో హైలైట్ చేశాం. నెక్‌లైన్ చుట్టూ కూడా థ్రెడ్స్‌తో హ్యాంగింగ్స్‌లా ఇచ్చాం. స్లీవ్స్‌కి కూడా ప్లీట్స్ కనిపించేలా డిజైన్ చేశాం. కింద స్కైబ్లూ బెనారస్ పట్టీ ఇవ్వడంతో పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అయింది.

రాయల్ బ్లూ కలర్ సిల్వర్ జరీ వచ్చిన పట్టు చీర ఇది. దీనికి బ్లూ కలర్ సిల్క్ మెటీరియల్‌ని స్లీవ్‌లెస్ బ్లౌజ్‌గా కుట్టాం. సిల్వర్ జరీతో కట్ వర్క్ చేసినటువంటి కేప్‌ని జతచేశాం. పైన రాసిల్క్‌తో స్టాండ్ కాలర్‌ని ఇచ్చి.. మధ్యలో స్టోన్స్‌తో ఇచ్చిన పువ్వు చీర అందాన్ని రెట్టింపు చేసింది.

పింక్, బ్లూ కాంబినేషన్‌లో వచ్చిన పట్టు చీర ఇది. దీనికి గోల్డెన్ ఫర్ ఫ్యాబ్రిక్‌ని బ్లౌజ్‌గా ఎంచుకున్నాం. దీన్ని బాడీ పార్ట్ వరకు ఇచ్చాం. హ్యాండ్స్‌కి మాత్రం బ్లూ కలర్ చెక్స్ ప్యాటర్న్ వచ్చిన ఆర్గంజాని తీసుకున్నాం. దీనిమీద.. గోల్డ్, పింక్ కలర్ కాంబినేషన్‌లో థ్రెడ్ వర్క్ చేయించడంతో సూపర్‌గా మెరిసిపోతున్నది.

## పోషకాహారాన్ని అందించడానికి..





**ఎనిమిదేండ్ల చరణ్ చాలా రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అతడి తల్లిదండ్రులకు భయం వేసి ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల్లో చరణ్‌కు చిన్న పేగు దెబ్బ తిన్నదని తేలింది. ఇటువంటి సమస్యతో మరెంతోమంది చిన్నారులు బాధపడుతున్నారనీ తెలిసింది ఆ తల్లిదండ్రులకు. తమ కుమారుడిలా మరెవరూ బాధపడకూడదని అనుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందుకొచ్చారు.**

మార్కెట్‌లో లభించే తినుబండారాల్లో గ్లుటెన్ పదార్థం ఎక్కువగా ఉంటున్నది. దానివల్ల చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. వారి కొడుకు అనారోగ్యం పాలవడానికి కూడా ఆ గ్లుటెనే కారణం అని తేలింది. అందుకే హాని లేని ఉత్పత్తులను తమ పిల్లలకు అందించడానికి జైపూర్‌కు చెందిన అమ్రిష్ మాలిక్, కిరణ్ రతన్ మాలిక్ దంపతులు ప్రయత్నించారు. అటువంటివి మార్కెట్‌లో లేకపోవడంతో వారిద్దరూ కలిసి సొంతగా తినుబండరాలు తయారు చేయాలనుకున్నారు. 'నేచర్ ప్రో' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు కిరణ్ రతన్ మాలిక్‌కు కొన్నేండ్ల పాటు ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలో పని చేసిన అనుభవం ఉన్నది. ఆ అనుభవంతో ఎటువంటి అనారోగ్య కారకాలు లేని తినుబండారాలను తయారు చేయడం ప్రారంభించాడు. అలా కిరణ్, అమ్రిష్‌లు నాణ్యమైన పోషకాహారాన్ని అందించడం మొదలు పెట్టారు. ముందుగా తమ కాలనీ వాసుల్లో గ్లుటెన్ ఉండే ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. దానివల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. సామాజిక మాధ్యమాల్లో 'నేచర్ ప్రో' ఉత్పత్తుల గురించి ప్రచారం చేశారు. ఆరోగ్యకరమైనవి తినకపోవడంతో భారతదేశంలో 90 శాతం మంది ఉదర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని అమ్రిష్ దంపతులు చెబుతున్నారు. 'చిన్నారులకు సరైన పోషకాహారం అందక చనిపోతున్న ఉదంతాలెన్నో మనం చూస్తున్నాం' అని కిరణ్ అంటున్నాడు. వారి సంస్థ ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు అందించడంతో రోజురోజుకీ గిరాకీ పెరుగుతున్నది. దీంతో ఎక్కువమందికి ఉపాధి కల్పించగలుగుతున్నామని చెబుతున్నది అమ్రిష్. మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఎక్కువ మంది గృహిణులకు తమ సంస్థలో పనిచేసే అవకాశం ఇస్తున్నామని ఈ దంపతులు చెబుతున్నారు.

### వంటింటి చిట్కాలు



- నెయ్యి తాజాగా ఉండి చాలాకాలం నిల్వ ఉండాలంటే వెన్న కాచేటప్పుడు ఒక తమలపాకు వేసి కాస్తే సరిపోతుంది.
- పుదీనా కొత్తిమీర చట్నీ చేసేటప్పుడు అందులో కొద్దిగా పెరుగు వేసి చేస్తే మరింత రుచిగా ఉంటుంది.
- వెల్లుల్లిని ఫ్రిజ్‌లో ఉంచితే ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. పొట్టు కూడా సులువుగా తీయవచ్చు.
- కాఫీ మరింత రుచిగా ఉండాలంటే డికాషన్‌లో చిటికెడు ఉప్పు వేస్తే చాలు.
- బాదాంను పావుగంట పాటు నీళ్లలో నానబెడితే పొట్టు సులువుగా వస్తుంది.

## రక్తహీనతకు విరుగుడు బెల్లం



- టీలో పంచదారకు బదులు బెల్లం పొడి వాడితే మధుమేహ బెడద ఉండదు. బెల్లంలోని పొటాషియం రక్తపోటును నివారిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను తగ్గించడానికి ఉపయోగపడుతుంది. మానసిక ఒత్తిడిని దూరం చేసి కంటి నిండా కునుకు పట్టడానికి ఇందులోని పొటాషియం ఉపయోగపడుతుంది.
- పిల్లల ఎదుగుదలకు, ఎముకలు బలంగా ఉండడానికి బెల్లంలోని కాల్షియం ఉపయోగపడుతుంది. రక్తహీనత ఉన్నవారు రోజూ 50 గ్రాముల బెల్లం తింటే తగినంత ఐరన్ అందుతుంది. గర్భిణులు బెల్లం తినడం వల్ల శిశువులు ఆరోగ్యంగా పుడతారు.
- బెల్లం మన శరీరంలోని లివర్‌కు ఎంతగానో మేలు చేస్తుంది. కాలేయాన్ని ఇది శుభ్రపరుస్తుంది. రోజూ బెల్లం తింటే లివర్‌లో ఉండే హానికర వ్యర్థాలు, విషపదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. లివర్ శుభ్రంగా ఉంటుంది. కాలేయ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. బెల్లం తింటే కండరాలు బలంగా ఉంటాయి.
- బెల్లం రక్తాన్ని ప్యూరిఫై చేస్తుంది. దీన్ని తరచుగా కొద్దిమొత్తంలో తీసుకుంటే రక్తం శుద్ధి అవుతుంది. శరీరంలోని హిమోగ్లోబిన్ పరిమాణాన్ని కూడా పెంచుతుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. తరచూ బెల్లం తినేవారికి బ్లడ్ ప్రెషర్ నియంత్రణలో ఉంటుంది.
- బెల్లంలో యాంటీఆక్సిడెంట్స్, జింక్, సెలెనియం వంటి ఖనిజాలున్నాయి. ఇవి సూక్ష్మక్రిముల ద్వారా శరీరానికి జరిగే హానిని అరికడతాయి. ఇన్‌ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడుతాయి.

## మొటిమలు మటుమాయం

**మొటిమలు ముఖాన్ని అందవిహీనం చేస్తాయి. టీనేజ్‌లో ఉన్నవారైతే వీటి బాధ తట్టుకోలేకపోతుంటారు. గిల్లుతూ ఉంటారు. ఏవేవో క్రీమ్‌లు రాస్తుంటారు. అలాంటి వారు ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు. మొటిమలు తొలగిపోతాయి.**



- చిటికెడు పసుపు, కొన్ని తులసి ఆకులు, కర్పూరం తీసుకొని కొన్ని నీళ్లు చేర్చి మిక్సీ పట్టుకోవాలి. ఈ గుజ్జును రాత్రి పడుకునే ముందు ముఖంపై రాసుకోవాలి. ఉదయం లేచాక గోరువెచ్చని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా వారం పాటు చేయడం వల్ల ముఖంపై ఉన్న మొటిమలు తొలగిపోతాయి.
- తులసి ఆకుల్ని పేస్ట్ చేసి ఒక గిన్నెలో తీసుకోవాలి. ఇందులో కొద్దిగా శనగపిండిని జోడించాలి. కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి నల్లబడిన మెడ, ముఖం, మోచేతుల దగ్గర రాయాలి. ఇలా వారం రోజులు రాత్రి పడుకునే ముందు రాయడం వల్ల చర్మం నిగారిస్తుంది.
- కాచిన పాలల్లో కొద్దిగా నిమ్మరసాన్ని జోడించాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. ఇలా చేయడం వల్ల డ్రై స్కిన్ సాఫ్ట్‌గా మారుతుంది. ఇందుకోసం గోరువెచ్చని పాలను మాత్రమే వాడాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడిగేస్తే సరిపోతుంది.
- వేప ఆకులకు కొద్దిగా నీరు చేర్చి పేస్ట్‌లా చేయాలి. ఈ పేస్టును ముఖానికి అప్లై చేసి పూర్తిగా ఆరే వరకు ఉంచాలి. ఆ తర్వాత కడిగితే ముఖం మెరిసిపోతుంది. ఇలా ప్రతిరోజూ చేయవచ్చు.
- బొప్పాయి గుజ్జును తీయాలి. ఒక గిన్నెలో రోజ్ వాటర్‌ను పోసి గుజ్జులో కలపాలి. ముఖానికి పట్టించాలి. పావుగంట తర్వాత కడిగితే ముఖం మెరుస్తుంది. మచ్చలు పోతాయి.

II.

# నమస్తే తెలంగాణ శాస్త్ర

[ కరీంనగర్ ]
శుక్రవారం 11 అక్టోబర్ 2019

వైద్యవిజ్ఞాన శాస్త్రం

## కృత్రిమ నడక



పక్షవాతం వచ్చిన మనిషిని బాహ్య అస్తి పంజర వ్యవస్థ ద్వారా శాస్త్రవేత్తలు నడిపించారు. కృత్రిమమైన ఈ నడకను ఆ వ్యక్తి తన మెదడుతోనే నియంత్రించుకోగలిగాడని వారు పేర్కొన్నారు.

**రెండు** ఊర్ధ్వ (అధో) అంగాల పక్షవాతాని (tetraplegia)కి గురైన పేషెంటు (28 సం॥లు)ను శాస్త్రవేత్తలు నాలుగు అవయవాలతో కూడిన రోబోటిక్ (బాహ్య అస్తిపంజరం) వ్యవస్థ ద్వారా విజయవంతంగా నడిపించగలిగారు. ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ గ్రెనోబుల్' (Grenoble) పరిశోధకులు దీనిని సాధించారు. అతను తన మెదడుతో సందేశాలను పంపడం ద్వారా దీనిని నియంత్రించినట్లు వారు ప్రకటించారు. ఒక సెన్సర్ల వ్యవస్థను అతని మెదడువద్ద అమర్చారు. దానితో సమాచారాన్ని అతని మొత్తం దేహానికి ఏర్పరచిన బాహ్య అస్తిపంజరానికి చేరవేశారు. 'లాన్సెట్ న్యూరాలజీ' పత్రికలో ఇటీవల ఈ పరిశోధన ప్రచురితమైంది. ప్రస్తుతానికి దీనిని ప్రయోగాత్మక నమూనాగానే రూపొందించారు. నాలుగు కృత్రిమ అవయవాలను ఉత్తేజపరచగల దీనిని 'మొట్టమొదటి అర్ధ హానికర (first semi-invasive) వైర్‌లెస్ బ్రెయిన్ కంప్యూటర్ వ్యవస్థ' గానూ వారు అభివర్ణిస్తున్నారు. 'ఇప్పటి వరకూ మెదడులో 'హానికర సెన్సర్ల'ను అమర్చే విధానమే అందుబాటులో ఉన్నదని, అది కూడా వైర్ల సహాయంతో ఒకే అవయవానికి మాత్రమే కదలికను సాధించగలిగారని' అంటూ, 'ఈ కొత్త పద్ధతిని అద్భుత విజయం'గా వారు పేర్కొన్నారు.

ఎవరేమన్నారు?



విజ్ఞానశాస్త్రం,ప రిశోధ నల్లో విజయం అన్నది ఆయాస మస్యలు, అంశాలనుజా గ్రత్తగా ఎంపికచేసు కొని,తె లివిగాము ందడుగు వేయడం వల్లనే సాధ్యమవుతుంది.అం తే కానీ,అప రిమితమైనలే దా భారీస్థాయిలో వనరులనుఏర్ప రచుకోవడంవల్ల కాదు. మొత్తంమీద ౹శ్రమ,ని రంతరకృషి,అం కిత భావాలు ఇందులోత ప్పనిసరి..

**-లాల్ బహదూర్ శాస్త్రి**
మన దేశ రెండో ప్రధానమంత్రి
జయంతి: అక్టోబర్ 2, జీవితకాలం: 1904-1966

జంతు వింత

## ప్రాణం తీసే చేప!



**ప్రపంచంలోనే** అత్యంత ప్రమాదకరమైన, విష తుల్యమైన చేప ఏదంటే, 'స్టోన్‌ఫిష్'. 'సినాన్సీయా' (Synanceia) గా పిలిచే ఈ చేపలు మనుషుల పాలిట మృత్యుజీవులు. ఇది విడుదల చేసే విషంతో రక్తనాళాలు వేగంగా ముడుచుకొనిపోతై. ఖర్మకాలి ఇది కనుక మనల్ని కుట్టిందో, ఇక అంతే సంగతులు. కేవలం కొద్ది గంటలలోనే దీనికి 'విషనిరోధక పదార్థం'తో చికిత్స అందించాలి. లేకపోతే మెదడు అఘాతం, పక్షవాతం, ఆయాసం, వికారం, వాంతి, చెమట, మానసిక అవ్యవస్థ (delirium), తీవ్ర జ్వరం (pyrexia), గుండెపోటు, శ్వాసబాధ వంటి వాటితోసహా చివరకు ప్రాణం మీదికే రావచ్చు. అదృష్టవశాత్తు గట్టెక్కినా, దీని తాలూకు లక్షణాలు సుదీర్ఘకాలం (రోజులనుంచి వారాల తరబడి) కొనసాగుతాయని, పూర్తిగా కోలుకోవడానికి కొన్ని నెలలు పట్టవచ్చునని నిపుణులు అంటారు.

విశ్వశోధనలు

## పాలపుంతకు పెనుప్రమాదం?



మరో 400 కోట్ల సంవత్సరాల కాలవ్యవధిలో మన భూమికి ఆవాసమైన సౌరవ్యవస్థను కలిగి ఉన్న 'పాలపుంత' (గెలాక్సీ) నక్షత్ర మండలాన్ని సమీపంలోని మరో భారీ గెలాక్సీ 'ఆండ్రోమెడా' మింగి వేయవచ్చునని ఇటీవలి ఒక పరిశోధన వెల్లడించింది.

**మనకు** అతిసమీపంలోని భారీ నక్షత్రమండలం 'ఆండ్రోమెడా' (Andromeda) మరో 4 బిలియన్ (400 కోట్లు) సంవత్సరాలలో మన నక్షత్ర మండలమైన పాలపుంత (Milky Way) తో ఢీకొన నున్నట్లు శాస్త్రవేత్తలు తాజాగా అంచనా వేశారు. ఆస్ట్రేలియాకు చెందిన 'ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ' పరిశోధకులు ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. 'అండ్రోమెడా' నక్షత్ర మండలం భూమినుండి సుమారు 25 లక్షల (2.537 మిలియన్) కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. మనకు అతిసమీప గెలాక్సీ ఇదే. 'మెస్సియర్- 31 (Messier), ఎం31, లేదా ఎన్‌జీసీ 224 పేర్లతో పిలిచే దీనిని ఒక 'నెబ్యులా' (నిహారిక లేదా ఖగోళ ధూళి-వాయు మేఘం)గానూ వ్యవహరిస్తారు. ఇది ఇప్పటికే తన జీవితకాలం (10 బిలియన్/ 1000 కోట్ల సంవత్సరాలు)లో అనేక చిన్న గెలాక్సీలను మింగేసిందని, ఇక దీని తదుపరి లక్ష్యం మన పాలపుంతగానేక నిపిస్తున్నదనివా రంటున్నారు.

'అండ్రోమెడా' ఇప్పటి దాకా మింగిన గెలాక్సీల ఆధారంగానే, రానున్న దీని భవిష్యత్ లక్ష్యాన్ని పై శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఇప్పటికి ప్రధానంగా రెండు మహా ఘర్షణల (collides)తోనే ఇదింతగా విస్తరించినట్లు వారు భావిస్తున్నారు. ఒకటి గత కొన్ని బిలియన్ సంవత్సరాల కిందటిది కాగా, రెండోది దాని నడివయసులో, అత్యంత ప్రాచీన శకానికి చెందింది. అమెరికాకు చెందిన హవాయిలోని మౌన కేయా (Mauna Kea) పర్వత శిఖరం మీది 'కెనడా-ఫ్రాన్స్-హవాయి టెలిస్కోప్'ద్వారా 'పాన్-అండ్రోమెడా ఆర్కియాలజికల్ సర్వే'లో వెలుగుచూసిన ఖగోళ అవశేషాల బృహత్ దృశ్యాలు, సమాచారం ఆధారంగా వారు ఈ పరిశోధన జరిపారు. ఈ మేరకు వారు రూపొందించిన నక్షత్రమండల పురావిశేషాల (galactic archeology) లో భాగంగా ప్రస్తుత అండ్రోమెడా స్థితిగతులను అంచనా వేశారు. 'ఇక జరగబోయే ఘర్షణ మాత్రం పాలపుంతకు, అండ్రోమెడాకు నడుమేనని, ఇది మహాసంక్షోభాలకుదా రితీయవచ్చు'నని వారంటున్నారు.



'కెనడా-ఫ్రాన్స్-హవాయి' టెలిస్కోప్

మన పాలపుంతకూడా తన గురుత్వాకర్షణ శక్తితో కొన్ని గెలాక్సీలను మింగేసేదే అయినా, దీనిని మించిన స్థాయి 'వీరావేశం' (ravenous) అండ్రోమెడాదిగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే, పాలపుంతతో ఇది ఢీ కొనడం వల్ల మన సూర్యుని వంటి (ప్రత్యేక వ్యవస్థలతో కూడిన) నక్షత్రాలపై పెద్దగా ప్రభావం పడకపోవచ్చునని వారు అంటున్నారు. రాబోయే అత్యాధునాతన దూరదర్శిని ఈఎల్‌టీ (యూరొపియన్ ఎక్స్‌ట్రీమ్‌లీ లార్జ్ టెలిస్కోప్) అబ్జర్వేటరీలు పనిచేయడం ప్రారంభించిన తర్వాత దీనికి సంబంధించిన మరింత లోతైన సమాచారం లభించగలదనివా రు భావిస్తున్నారు.

## శనిగ్రహానికే ఎక్కువచం దమామలు



**సౌరవ్యవస్థలోని** రెండో అతిపెద్దది, సూర్యుని నుంచి ఆరోగ్రహమైన శనికి శాస్త్రవేత్తలు తాజాగా మరో 20 చందమామలను కనుగొన్నారు. దీంతో సౌర కుటుంబంలో ఇప్పటిదాకా అత్యధిక చందమామలను కలిగి ఉన్న గురుగ్రహాన్ని ఇది మించిపోయింది. మన సౌరవ్యవస్థలోని అతిపెద్దది, సూర్యునినుంచి అయిదవది అయిన గురువు(బృహస్పతి)కు 79 సహజ సిద్ధమైన ఉపగ్రహాలు (చందమామలు) ఉండగా, ఇప్పుడు ఈ రికార్డును ఆరోగ్రహమైన శని అధిగమించింది. శనిగ్రహం చుట్టూ సంచరిస్తున్న మరొక 20 చందమామలను శాస్త్రవేత్తలు తాజాగా కనుగొనడంతో దానిచుట్టూ సంచరిస్తున్న సహజ ఉపగ్రహాల సంఖ్య ఇప్పుడు 82కు చేరింది. వీటిలో 53 చందమామలకు లాంచనంగా పేర్లు పెట్టినా, మిగిలిన వాటికి నామకరణం జరగలేదు. వీటన్నింటిలోకెల్లా 'టైటాన్' చందమామ అతిపెద్దది. కొత్తగా మరిన్ని చందమామలను కనుగొన్న తరుణంలో ఇటీవల (అక్టోబర్ 7న) అమెరికాలోని 'కార్నెగీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' వారు వాటికి పేర్లు సూచించే అపురూప అవకాశాన్ని ప్రజలకు కల్పించారు. నామకరణాల విషయంలో ఇంకా తుది నిర్ణయమేదీ తీసుకొన్నట్టు లేదు. వీటన్నింటికీ తోడు ఇంకా డజన్లకొద్ది మరిన్ని చిన్ని చందమామలు (moonlets) సుమారు 40-500 మీటర్ల చుట్టుకొలతతోనే శనిగ్రహ వలయాలలో సంచరిస్తున్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శనిగ్రహం మన భూమి సమీపానికి వచ్చినప్పుడు రెండింటి నడుమ దూరం సుమారు 120 కోట్ల కి.మీ.ఉ ంటున్నట్టు అంచనా.

సజీవశాస్త్రం

# సూక్ష్మ జీవ ప్రపంచం!

బ్యాక్టీరియా(సూక్ష్మజీవులు)కు సమాజాలు లేవు. ఊళ్లు, నగరాలు కట్టుకోవాలన్న ఆశ అంతకన్నా లేదు. అయినా, అవి మన సౌరమండలం కొనసాగినంత కాలం ఉండి తీరతాయి. భూగ్రహం నిజానికి వాటి స్వంతం. అవి మనం పుట్టక ముందునుంచీ ఉన్నాయి. అంటే, మానవజాతికన్నా ముందున్నాయి. ఈ మానవజాతి కనిపించకుండా పోయిన తర్వాత కూడా అవి ఉండి తీరతాయి. అవి దయ తలచి మనలను ఉండనిస్తున్నాయి కనుకే, మనం మరి కొంతకాలం ఇక్కడ ఉంటాం.



**ఈ విశ్వం** చాలా విశాలమైంది. దాని పొడవు వెడల్పుల కొలతలు మన ఊహలకు కూడా అందవు. ఇందులోని గెలాక్సీ (నక్షత్ర మండలం)ల సంఖ్య ఆలోచనలకు అందదు. లెక్కలేనన్ని ఆ గెలాక్సీలలో ఒక్కో దాంట్లో లెక్కలేన్నని చుక్కలు (నక్షత్రాలు) ఉన్నాయి. వాటిలో మన సూర్యుడు కూడా ఒకటి. ఈ సూర్యుని చుట్టూ వివిధ గ్రహాలు తిరుగుతున్నాయి. వాటిలో మన భూమి ఒకటి. ఈ భూమిమీద బిలియన్ల (వందల కోట్లు) సంఖ్యలో జనం ఉన్నారు. వారిలో మనం ఉన్నాం. ఈ లెక్కన చూస్తే విశ్వంలో మనం సూక్ష్మజీవులం. మన శరీరం మీద ట్రిలియన్‌ల (లక్షల కోట్లు) సంఖ్యలో సూక్ష్మజీవులు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంటే, అవి ఎంత చిన్నవో మనం ఊహించలేమని అర్థం. వాటిని పట్టించుకునే వాళ్లు చాలాకాలంగానే కొందరు ఉన్నారు. లూయి పాశ్చర్ అనే పెద్దమనిషి ఫ్రాన్స్ దేశానికి చెందినవారు. 'సూక్ష్మజీవులను పరిశీలించడం' అన్న విషయాన్ని ఒక ప్రత్యేక రంగంగా నిలబెట్టిన ఘనత ఆయనది. ఒక భూతద్దం చేత పట్టుకుని కనిపించిన ప్రతివస్తువునూ పరిశీలించేవాడట. తిండి పెడితే తినడం కన్నా పరిశీలన ముఖ్యం అనుకునే వాడు. పక్కింటి వాళ్లు భోజనానికి పిలిస్తే భూతద్దం పట్టుకుని వెళ్లేవాడు. కొన్నాళ్ల తర్వాత వాళ్లు పిలవడం మానేశారు.

సూక్ష్మజీవులు కనిపించవు కనుక 'అవి లేవు' అనుకుంటే మనకన్నా అమాయకులు ఎవరూ ఉండరు. అవి మన మీద, చుట్టుపక్కల, ఎటుచూస్తే అటు, ఆలోచనకు అందనంత సంఖ్యలో అంతటా నిండి ఉన్నాయి. మనం పూర్తి ఆరోగ్యంగా ఉండవచ్చు. సబ్బు పెట్టి ఒళ్లంతా తెగ తోముకొని వుండవచ్చు. మన ఒంటిమీద గుంపులు గుంపులుగా సెంటిమీటర్ చర్మానికి లక్షసంఖ్యలో బ్యాక్టీరియా (సూక్ష్మజీవులు) ఉండనే ఉంటుంది. మన చర్మం నుంచి ప్రతి నిత్యం బిలియన్‌ల సంఖ్యలో పొలుసులు ఊడి పడుతుంటాయి. పాశ్చర్ లాగా భూతద్దం పెట్టి చూసినా అవి కనిపించవు. కనిపిస్తే మన పడక మనకు నరకం లాగా అనిపిస్తుంది. ఈ పొలుసులను తింటూ సూక్ష్మజీవులు మనమీద కాపురం ఉంటాయి. అక్కడ వాటికి మనం వదిలిన పొట్టు మాత్రమే కాక రుచికరమయిన నూనెలు, లవణాలు, ఖనిజాలు కూడా దొరుకుతాయి. వాటికి కనుక రుచి తెలిసే పద్ధతి ఉంటే మన ఒంటిమీద మంచి విందు దొరుకుతున్నదని అర్థం. ఒంటినిండా రంధ్రాలున్నాయి. కావలసినన్ని పగుళ్లు ఉన్నాయి. వాటిలో నుంచి సూక్ష్మజీవులకు తిండి సరఫరా నిరంతరాయంగా జరుగుతూనే ఉంటుంది. మనకు తిండి అప్పుడప్పుడు దొరుకుతుంది. వాటికి మాత్రం ఎప్పుడూ దొరుకుతుంది.

విందు తింటూ బతికే సూక్ష్మజీవులు చర్మం మీద మాత్రమే కాదు, శరీరం మొత్తంలో, లోపల, బయట కూడా అదే పద్ధతిలో అంటే లెక్కించలేని సంఖ్యలో ఉన్నాయి. పేగుల్లోకి వెళితే పెద్ద సంఖ్యలో ఉండే బ్యాక్టీరియా లేకుండా మనకు తిండి అరగదన్నది మనం అత్యవసరంగా తెలుసుకోవలసిన సత్యం. ముక్కులోపల కావలసినన్ని సూక్ష్మజీవులు ఉన్నాయి. కనుగుడ్డుమీది తేమలో అవి ఈదుతూ ఉంటాయి. దంతాల మీది పింగాణి పొరలో రంధ్రాలు చేస్తూ ఉంటాయి. మనిషి జీర్ణాశయంలో వంద ట్రిలియన్‌లకు పైబడి బ్యాక్టీరియా ఉన్నట్టు లెక్క తేలింది. అందులో కనీసం నాలుగు వందల రకాలు ఉన్నట్టు కూడా గుర్తించారు. వాటిలో కొన్ని చక్కెరలను అరిగిస్తాయి. కొన్ని పిండిపదార్థాలను పట్టించుకుంటాయి. మరికొన్ని మిగతా సూక్ష్మజీవులమీద దాడి చేస్తాయి. కడుపులో అంటే పేగుల్లో ఉన్న సూక్ష్మజీవులు అన్నీ ఇంచుమించు మనకు సాయం చేసేవే. అయితే, ఏం పని చేస్తాయని తెలుసుకోవడానికి వీలు కుదరని రకాలు కూడా కొన్ని అక్కడ ఉన్నాయి. అవి పేగుల్లో అలా మనకు తెలియకుండానే కలకాలం కాపురం ఉంటాయి. వాటికి అలా ఉండడం అనుకూలంగా ఉంటుంది.

మానవుని శరీరంలో సుమారు పది క్వాడ్రిలియన్ కణాలు ఉంటాయని లెక్క తేల్చారు. ఇక తరువాతి వాక్యం చదవాలంటే గుండె గట్టిగా పట్టుకొని ధైర్యంగా ఉండాలి. సగటు మానవుని శరీరంలో బ్యాక్టీరియాల సంఖ్య వంద క్వాడ్రిలియన్‌ల కన్నా ఎక్కువగా ఉంటుంది. అందుకే మైక్రోబయాలజీ రంగం వారు మనిషిని మనిషి అనే కన్నా మరేదో అంటే బాగుంటుందని అంటారు. మనిషిలో మనిషి కణాలకన్నా మైక్రోబ్స్ కణాలు పదిరెట్లు ఎక్కువ ఉన్నాయి మరి. 'మనిషిమీద సూక్ష్మజీవులు బతుకుతున్నాయా లేక వాటి మీద మనిషి బతుకుతున్నాడా?'- ఇటువంటి ప్రశ్నలు వినడానికి కొంచెం ఇబ్బందిగా ఉన్నా విషయంగా తెలుసుకోవడానికి మనకు కొంచెం ఆసక్తికరంగా కూడా ఉంటాయి. అసలు విషయం ఒప్పుకోవాలంటే మన శరీరంలో శరీరం కన్నా ఎక్కువ సూక్ష్మజీవులు ఉన్నాయి. వాటి మధ్యన మనం కూడా ఉన్నాము.

బ్యాక్టీరియా అనగానే రోగాలు కలిగిస్తాయని అందరికీ ఒక ఆలోచన కలుగుతుంది. చాలా తెలివిగా వాటిని మట్టు పెట్టడానికి మనం సబ్బులు, ఆంటీబయాటిక్స్ వంటివి కనుగొని మనలను మనం కాపాడుకుంటున్నామని భ్రమ పడుతున్నాం. వ్యాధులు కలిగించే సూక్ష్మజీవులను తొలగించుకుంటున్నామన్నది నిజం. కానీ, అంతకన్నా పెద్ద సంఖ్యలో బ్యాక్టీరియాలను పెంచి పోషించుకుంటున్నామన్నది అంతకన్నా పచ్చి నిజం. ఈ మాటకూడా కొంతవరకు నిజం కాదేమో అని అనుమానం. బ్యాక్టీరియాలకు సమాజాలు లేవు. ఊళ్లు, నగరాలు కట్టుకోవాలన్న ఆశ అంతకన్నా లేదు. అవి మన సౌరమండలం కొనసాగినంత కాలం ఉండి తీరతాయి. భూగ్రహం నిజానికి వాటి స్వంతం. అవి మనం పుట్టక ముందు నుంచీ ఉన్నాయి. అంటే, మానవజాతికన్నా ముందు ఉన్నాయి. ఈ మానవజాతి కనిపించకుండా పోయిన తర్వాత కూడా అవి ఉండి తీరతాయి. అవి దయతలచి మనలను ఉండనిస్తున్నాయి కనుక, మరి కొంతకాలం ఇక్కడ మనం కూడా ఉంటాం.

బిలియన్‌ల సంవత్సరాలుగా భూమిమీద రకరకాల సూక్ష్మజీవులు కొనసాగాయి. మన తరువాత కూడా మనిషి లేకున్నా అవి ఉండి తీరతాయి. ఇక్కడ మనం ఒక విషయం లెక్కలోకి తీసుకోవాలి. మనం లేనప్పుడు సూక్ష్మజీవులు ఉన్నాయి కానీ సూక్ష్మజీవులు లేనిదే మనుషులం ఒక్కరోజు కూడా బతకజాలం. మనం వదిలిన మురికిని వదిలించడానికి సూక్ష్మజీవుల మీద ఆధారపడుతున్నామన్న సంగతి చాలామందికి తెలియక పోవచ్చు. పడేసిన వస్తువులు, అది పాచి అన్నం కావచ్చు, పశువులు, జంతువుల కళేబరాలు కావచ్చు. కుళ్లడం బ్యాక్టీరియాల వల్లనే జరుగుతున్నది. అవి కుళ్లకుండా వుంటే వ్యర్థ ప్రదార్థాలన్నీ అలాగే ఉండిపోతాయి. కుళ్లితేనే అవి మట్టిలో కలుస్తాయి. ఆ రకంగా మట్టిసారం పెరుగుతుంది. మనకు తెలిసిన, తెలియని జీవులను, మొక్కలను కుళ్లించడం ద్వారా సూక్ష్మజీవులు పై మట్టిని హ్యూమస్ (humus: organic component of soil)గా మారుస్తున్నాయి. అట్లా మారినందుకే మట్టిలోకి పోషకపదార్థాలు మళ్లీ చేరుతున్నాయి. కనుకనే అదే పొలంలో అయినా మళ్లీ పంటలు పండుతున్నాయి.

వాతావరణంలో సూక్ష్మజీవుల పాత్ర గురించి చెప్పుకోవాలంటే ఆశ్చర్యకరమైన వివరాలను అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. మనకు తెలిసి మన చుట్టూఉన్న గాలిలో ఎక్కువగా ఉండే భాగం నత్రజని అనే వాయువు. సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని వాడుకొని మాంసకృత్తులకు ఆధారమైన అమైనో ఆమ్లాలను తయారుచేస్తాయి. డిఎన్ఎలో ఉండే భాగాలను కూడా సూక్ష్మజీవులే తయారుచేస్తాయి. ఇది మనకు నిజానికి అర్థం కాని అద్భుతం. అపార్థానికి గురైన అమాయక జీవులు తెలియకుండానే మనకు చేస్తున్న మహోపకారం ఇది. పరిశ్రమలో నత్రజని ఎరువులను తయారుచేయడానికి 500 డిగ్రీల సెల్సియస్ వేడిమి అవసరమవుతుంది. ఒత్తిడికూడా చాలా ఎక్కువగా వాడవలసి ఉంటుంది. సూక్ష్మజీవులు మాత్రం ఈ చిక్కులేవీ లేకుండానే మనకు కావలసిన పదార్థాలను తయారు చేసి పెడతాయి. కంటికి కనపడకుండా జరుగుతున్న ఈ ఉత్పత్తి కార్యక్రమం వల్లనే చిన్ననుండి పెద్ద జీవులన్నీ తమ బతుకులను కొనసాగించగలుగుతున్నాయి.

విశ్వంలో మానవులనే మనం ఉండి, మనకు మనమూ ఉపకారం చేసుకోలేకపోతున్నాం. మెదడు అంటూ ఒకటుంది కనుక, మనమెందుకు ఉన్నామని ప్రశ్నించుకోగలుగుతున్నాం. జవాబు దొరకక అసంతృప్తితో బతుకును కొనసాగిస్తున్నాం. మనం రాకముందే భూమిమీద మనుగడ సాగిస్తున్న సూక్ష్మజీవులు మాత్రం కొత్తగా వచ్చిన మనలను ఈసడించుకోకుండా ఉపకారం చేస్తున్నాయి. ఎందుకు అని అవి ప్రశ్నించుకోలేదు. చేతనైంది కనుక తమకు తెలిసిన పనిని చేస్తున్నాయి. మనకు మాత్రం ఆ మంచితనం మనసులోకికూడా రాదు. అపార్థాలకు అనుమానం లేకుండా చోటు ఇస్తున్నాం. ఒక వేలు ఎత్తి ఒకరిని అనేముందు మిగతా మూడువేళ్ల గురించి పట్టించుకోవలసిన పరిస్థితి సూక్ష్మజీవుల విషయంలో ముమ్మాటికి నిజం.

### నీటిశుద్ధి నుంచి ఆరోగ్యసిద్ధి వరకూ!



మంచినీళ్లు శుభ్రంగా ఉండాలని మనం రకరకాల ఏర్పాట్లు చేస్తుంటాం. బ్యాక్టీరియా కారణంగా నీటి నాణ్యత తగ్గుతుంది. కానీ, బ్యాక్టీరియా కారణంగానే మరొక పరిస్థితిలో పెద్ద ఎత్తున నీళ్లు పరిశుభ్రమవుతున్నాయి కూడా. నీటిలో చేరిన వ్యర్థ పదార్థాలను కుళ్లించినందుకే ఆ మకిలి అడుగుకు చేరుతుంది. పైన తేటనీళ్లను తాగగలుగుతాం. పేగుల్లోని బ్యాక్టీరియా మనకు అవసరమైన వైటమిన్‌లను తయారుచేస్తాయి. మందుబిళ్లలు తెచ్చి మింగనవసరం లేకుండానే మనకు అవసరమైన పోషక పదార్థాలు సూక్ష్మజీవులవల్ల అందుతుంటాయి. మనం తిన్న తిండిని చక్కెరలుగా మార్చేది సూక్ష్మజీవులే. బయటి నుంచి వచ్చిన బ్యాక్టీరియామీద లోపల ఉన్న సూక్ష్మజీవులు తెల్లరక్తకణాలకన్నా ముందే పోరాటాన్ని మొదలుపెడతాయి. తిండి అరగడం, ఆరోగ్యం నిలబడడం వీటివల్లే జరుగుతున్నది. దీన్నిబట్టి ఇవి మనకెంత అవసరమో అర్థమవుతుంది.

**డా॥ కె.బి.గోపాలం,** సెల్: 9849062055

శాస్త్రీయం

## విపత్తు రక్షణ మన చేతుల్లోనే!

'విపత్తు ప్రమాదాల తగ్గింపే' లక్ష్యంగా అంతర్జాతీయ ప్రత్యేక దినోత్సవం త్వరలో (అక్టోబర్ 13) జరుపుకోనున్నాం. ఈ సందర్భంగా రక్షణ చర్యల ప్రాధాన్యాన్ని తెలియజెప్పే చిన్న ప్రస్తావన.

**ప్రత్యేకించి** ప్రకృతి విపత్తులు మన చేతుల్లో ఉండవు. కానీ, ప్రకృతిని వికృతిగా మార్చకుండా ఉండడం కొంతవరకు మన వల్ల అయ్యే పనే. రానురాను ప్రకృతి పెనువిషాదాలు అంతకంతకూ పెరిగిపోతుండడానికి మూలకారణాల్లో మానవచర్యలు ఒకటి అని శాస్త్రవేత్తలు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. విపత్తులన్నవి ప్రకృతిపరంగానేకాక మానవచర్యలవల్ల కూడా సంభవిస్తుంటాయి. ఉదా॥కు వాహనాలు, యంత్రాలు వంటివాటి వల్ల సంభవించేవి, అగ్నిప్రమాదాలు వంటివి. కొన్ని మనం చేజేతులా కొనితెచ్చుకొనేవే ఉంటాయి. ప్రకృతివైనా, ప్రకృతేతరమైనా విపత్తు నిర్వహణ, తత్సంబంధ వ్యవస్థలను మనమెంత భద్రంగా, కట్టుదిట్టంగా ఏర్పాటు చేసుకొంటున్నప్పటికీ దీని కన్నా ముఖ్య విషయం అవి రాకుండా జాగ్రత్త పడడం. నిజమే, వీటి పర్యవసానంగా సంభవించే ప్రాణనష్టాల్ని వీలైనంత వరకు తగ్గించుకోగలగాలి. ఇందుకోసమే ఐక్యరాజ్య సమితి (ఐరాస) ఒక 'ప్రత్యేక అంతర్జాతీయ దినోత్సవాన్ని' జరపాలని మూడు దశాబ్దాల కిందటే పిలుపు నిచ్చింది. ఈ




మేరకు 'ఇంటర్నేషనల్ డే ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్' రూపొందింది.

ప్రతి ఏడాది ఆయా దేశాలు అక్టోబర్ 13న ఈ ప్రత్యేక దినాన్ని నిర్వహిస్తున్నాయి. విపత్తు నివారణ, తీవ్రత తగ్గింపు, ముందుజాగ్రత్త చర్యలు వంటివాటిపై ప్రజలలో అవగాహన కలిగించడమే లక్ష్యంగా దీనిని పాటిస్తున్నారు. ఈ మేరకు విపత్తు ప్రమాదాల తగ్గింపు చర్యలు, రక్షణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా పెంపొందించడానికి ఐరాస సాధారణ సభ (జనరల్ అసెంబ్లీ) నిర్ణయం మేరకు 1989 నుంచీ ఈ అంతర్జాతీయ దినోత్సవాన్ని ఆయా దేశాలు నిర్వహిస్తున్నాయి. 'మౌలిక వసతులు, ప్రాథమిక సేవలకు అంతరాయం కలక్కుండా విపత్తులను తగ్గించుకోవాలి' అన్నది ఈ ఏడాది (2019) ప్రచారాంశం (థీమ్)గా ఐరాస వెల్లడించింది. 2016లో ప్రారంభమైన 'సెండాయ్ సెవన్' (ఏడు లక్ష్యాలు- ఏడేండ్లు) కార్యక్రమం ఈ ఏడు నాలుగో సంవత్సరానికి చేరగా, ఇది 2022 (ఏడేండ్ల) వరకు కొనసాగుతుంది.

ముఖ్యంగా వరదలు, భూకంపాలు, సునామీలు సంభవించినప్పుడు అత్యధిక సంఖ్యలో ప్రాణనష్టం సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. స్కూళ్లు, ఆసుపత్రులను అత్యంత సురక్షిత ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాలలో మరీ ముఖ్యంగా కాల్వలు, చెరువుల సమీపాలలో ప్రజల నివాసాలు ఉండకుండా ప్రభుత్వాలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి. విపత్తులకు ఆస్కారం గల ప్రదేశాలలో, పరిస్థితులలో, సమయాలలో ప్రమాదాలు, నష్టనివారణ చర్యల విషయంలో ప్రజలలో అవగాహన పెంపొందింపచేయాలి. ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలు, సంపన్నులూ ముందుకు వచ్చి విపత్తుల నివారణకు తమ వంతు కార్యక్రమాలను చేపట్టాలి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

### సీసీఎల్‌లో

సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్)లో జూనియర్ ఓవర్‌మ్యాన్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** జూనియర్ ఓవర్‌మ్యాన్
- **మొత్తం ఖాళీలు:** 75
- **అర్హతలు:** వ్యాలిడిటీ కలిగి ఉన్న ఓవర్‌మ్యాన్ సర్టిఫికెట్ఆ ఫ్ కా ంపిటెన్సీ, గ్యాస్ టెస్టింగ్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లను కలిగి ఉండాలి.
- **వయస్సు:** నవంబర్ 10 నాటికి 18-30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 10
- **వెబ్‌సైట్:** www.centralcoalfields.in

### బీహెచ్ఈఎల్‌లో అప్రెంటిస్‌లు

తిరుచిరాపల్లిలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) గ్రాడ్యుయేట్, టెక్నికల్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.




- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 191
- **విభాగాల వారీగా ఖాళీలు:** మెకానికల్-11, ఎలక్ట్రికల్& ఎలక్ట్రానిక్స్-17, ఈసీఈ-7, సీఎస్/ ఐటీ-20, సివిల్-29, కెమికల్-3.
- **కాలవ్యవధి:** 12 నెలలు
- **స్టయిఫండ్:** నెలకు రూ.6000/-
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీ/ టెక్నాలజీ ఉత్తీర్ణత.
- **వయస్సు:** అక్టోబర్ 28 నాటికి 18-27 ఏండ్ల మధ్య ఉండాలి.

**టెక్నీషియన్ అప్రెంటిస్**

- **మొత్తం ఖాళీలు:** 260
- **విభాగాలు:** మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్&కమ్యునికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** అక్టోబర్ 28 నాటికి 18-27 ఏండ్ల మధ్య ఉండాలి.
- పై రెండు అప్రెంటిస్‌లకు

**ముఖ్యతేదీ వివరాలు**

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 11
- **వెబ్‌సైట్:** http://trichy.bhel.com

### ఐఐటీలో

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

**పోస్టులు-ఖాళీలు:**

- జూనియర్ ఇంజినీర్-4, టెక్నికల్ సూపరింటెండెంట్-1, లాంగ్వేజ్ ఇన్‌స్ట్రక్టర్-1, స్టూడెంట్ కౌన్సెలర్-1, అసిస్టెంట్ (ఎడిటోరియల్)-1, జూనియర్ డిజైన్ అసిస్టెంట్-1 ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 14
- **వెబ్‌సైట్:** http://www.iitb.ac.in

### ఐఐఏలో

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- ఇంజినీర్ సీ-1
- **అర్హత:** ఎంఈ/ఎంటెక్ (ఎలక్ట్రానిక్స్/ఈఈ)
- అకౌంట్స్ ఆఫీసర్-1
- **అర్హతలు:** యూజీ, పీజీలో కామర్స్ ఉత్తీర్ణత.
- సెక్షన్ ఆఫీసర్-1
- **అర్హత:** బీఏ/బీఎస్సీ/బీకాం లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 28
- **వెబ్‌సైట్:** http://www.iiap.res.in

## హెల్త్ వాచ్

## నైట్ డ్యూటీ చేస్తున్నారా?



సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందిన తరువాత నైట్ డ్యూటీలు కామన్ అయిపోయాయి. క్రమంగా ఇతర రంగాల్లో కూడా నైట్ డ్యూటీలు కనిపిస్తున్నాయి. అయితే ఇలా నైట్ డ్యూటీ ఉద్యోగాలు చేసే వారికి పిల్లలు పుట్టే అవకాశం తగ్గుతున్నట్టు ఇటీవలి అధ్యయనాల్లో వెల్లడైంది. ప్రతి విషయానికీ ఓ సమయం ఉంటుంది. ఆకలి, నిద్ర.. ఇలా మన ఒంట్లోని అన్ని పనులూ ఓ పద్ధతి ప్రకారం జరుగుతాయి. సమయాన్ని బట్టి మన జీవగడియారమే ఈ ప్రకారం నడుచుకుంటుంది. ఇలాంటి తరుణంలో నిద్ర వేళలను మార్చేసే షిఫ్ట్ ఉద్యోగాల కారణంగా అతి పెద్ద సమస్య అయిన సంతానలేమి సమస్య ఎదుర్కొంటున్నారు చాలామంది. కొన్నిరోజులు పగలు, కొన్ని రోజులు రాత్రి పూట ఉద్యోగాలు చేయడం వల్ల నిద్ర వేళలు మారిపోయి జీవగడియారం దెబ్బతింటోంది. నైట్ డ్యూటీలు చేసే మహిళల్లో సమయానికి అండం విడుదల కాకపోవడం, ఫలితంగా గర్భధారణ జరుగకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటికి తోడు బయటి తిండి, పోషకాలు లేని జంక్‌ఫుడ్ తినడం కూడా సమస్యకు దారితీస్తున్నాయి. అండాశయంలో నీటి తిత్తులు ఏర్పడుతున్నాయి. దీంతో అండం సరిగా విడుదల కావడం లేదు. ఇక నైట్ డ్యూటీకి ఊబకాయం తోడవడంతో మగవారిలో ఈస్ట్రోజన్ స్థాయిలు ఎక్కువవుతున్నాయి. ఈ కారణంగా స్తంభన సమస్యలు ఎదురవుతున్నాయి. వీర్యకణాల సంఖ్య కూడా తగ్గుతుంది. రాత్రి షిఫ్ట్ జాబ్స్ చేయడం వల్ల ఒత్తిడి ఎక్కువవుతుంది. ఈ కారణంగా శృంగారాసక్తి కూడా తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి ఇలాంటి నైట్ ఉద్యోగాల్లో ఉన్నవాళ్లు ఉద్యోగ వేళలు మార్చుకోలేకపోయినా కనీసం ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రెగ్యులర్‌గా వ్యాయామం చేస్తూ హార్మోన్ సమస్యలు రాకుండా జాగ్రత్తపడాలి.

## క్యాన్సర్‌పై బ్యాక్టీరియా అస్త్రం



క్యాన్సర్ అనగానే ముందు కీమోథెరపీ అంటే భయం ఎక్కువగా ఉంటుంది. దానితో వచ్చే దుష్ప్రభావాల గురించిన ఆందోళనే ఎక్కువగా ఉంటుంది. అయితే మందులతో పనిలేకుండా బ్యాక్టీరియాతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చని కనుక్కున్నారు పరిశోధకులు. మందులతో పనిలేకుండా క్యాన్సర్ కణితులను నిర్మూలించడం సాధ్యమేనని నిరూపించారు కొలంబియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. ఇందుకు ఇ-కోలి బ్యాక్టీరియాను అస్త్రంగా మలచుకున్నారు. కొన్నిసార్లు మన రోగ నిరోధక కణాలు తమకు తామే క్యాన్సర్ కణాలను గుర్తించి, చంపేస్తుంటాయి. అయితే కణితులు వీటి కంట పడకుండా తప్పించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటాయి. సీడీ 47 అనే జన్యువు నుంచి విడుదలయ్యే ప్రొటీన్లను తమ మీద పొరలా అమర్చుకొని రోగ నిరోధక వ్యవస్థ కళ్లు కప్పేస్తుంటాయి. దీన్ని ఛేదించడానికి శాస్త్రవేత్తలు ఇ-కోలి బ్యాక్టీరియాను ఉపయోగించుకున్నారు. వీటిని జన్యుపరంగా మార్పు చేసి ఎలుకల కణితుల్లోకి చొప్పించారు. వీటి నుంచి వెలువడే నానోబాడీలు క్యాన్సర్ కణాలతకు అతుక్కుపోయి సీడీ47 ప్రొటీన్ల పొరను కప్పేస్తాయి. దీంతో రోగ నిరోధక కణాలు క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటి పని పడతాయి. వినూత్నమైన ఈ పద్ధతి ఇప్పటికిప్పుడు అందుబాటులోకి రాకపోయినా మున్ముందు సంప్రదాయ మందుల దుష్ప్రభావాలేవీ లేకుండా క్యాన్సర్లకు కచ్చితమైన చికిత్స చేయడానికి ఉపయోగపడగలదన్నది పరిశోధకుల భావన.

## కొలెస్ట్రాల్ టాబ్లెట్లతో షుగర్!



కొలెస్ట్రాల్ తగ్గించే మాత్రలు వేసుకుంటే షుగర్ వచ్చే అవకాశాలుంటాయని హెచ్చరిస్తున్నాయి ఇటీవలి పరిశోధనలు. శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువైతే గుండె రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే అవకాశం పెరుగుతుంది. అందుకే ఈ కొవ్వు తగ్గించడానికి మాత్రలు ఇస్తుంటారు వైద్యులు. వీటినే స్టాటిన్స్ అంటారు. అయితే ఈ సమస్యకు టాబ్లెట్లు వాడడానికి బదులుగా కొవ్వు తగ్గించే వ్యాయామాలు చేస్తూ, మంచి ఆహారం తీసుకోవడమే మంచి మార్గమని సూచిస్తున్నారు పరిశోధకులు. చాలా కామన్ అయిపోయిన డయాబెటిస్ జబ్బు రావడానికి ఈ కొలెస్ట్రాల్ మాత్రలు కూడా దోహదం చేస్తున్నాయంటున్నారు. బ్రిటన్‌కి చెందిన సైంటిస్టులు 45 ఏళ్లు పైబడిన 9 వేల 5 వందల మందిపై 15 సంవత్సరాలపాటు అధ్యయనం చేసి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. క్లినికల్ ఫార్మాలజీ బ్రిటిష్ జర్నల్‌లో ఈ అధ్యయన ఫలితాలు ప్రచురితమయ్యాయి. కొవ్వు స్థాయిని తగ్గించే ఈ స్టాటిన్ మాత్రలు వాడని వాళ్లతో పోలిస్తే, స్టాటిన్స్ తీసుకునేవాళ్లలో టైప్ 2 మధుమేహం కనిపిస్తున్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. స్టాటిన్స్ వల్ల రక్తంలో చక్కెర స్థాయి, ఇన్సులిన్ నిరోధకత పెరిగి టైప్ 2 డయాబెటిస్ వస్తుందంటున్నారు పరిశోధకులు. అందుకే ఇలాంటి టాబ్లెట్ల అవసరం రాకుండా సహజ పద్ధతిలో కొవ్వు తగ్గించుకుంటే మంచిదని సూచిస్తున్నారు. ఇక రోజూ వ్యాయామం చేస్తూ, ఫాస్ట్‌ఫుడ్స్‌కి దూరంగా ఉంటూ స్టాటిన్స్ అవసరం రాకుండా చూసుకోండి మరి.



ఆర్మీ ర్యాలీకి వచ్చిన అభ్యర్థులు

## ఉత్సాహంగా ఆర్మీ ర్యాలీ

**కరీంనగర్ స్పోర్ట్స్ :** కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల ఏడున ప్రారంభమైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. జనరల్ డ్యూటీ విభాగంలో ఉద్యోగాల కోసం రాష్ట్రానికి చెందిన 4,486 మంది దరఖాస్తు చేసుకోగా.. గురువారం సుమారు 3,900 మంది నియామక ప్రక్రియకు హాజరయ్యారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అభ్యర్థుల అడ్మిట్ కార్డులను పరిశీలించి 1.6 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహించారు. ఇందులో అర్హత సాధించినవారికి ఇతర శరీర దృఢత్వ పరీక్షలు పెట్టి సర్టిఫికెట్లను పరిశీలించారు. అన్ని అంశాల్లో అర్హత పొందిన యువకులను వైద్య పరీక్షలకు ఎంపికచేశారు. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో పది రోజులపాటు ఎంపిక ప్రక్రియలు జరుగనున్నాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

## రాష్ట్ర సరిహద్దులో ప్రైవేటు బస్సు బోల్తా

- తప్పిన పెనుప్రమాదం.. ప్రయాణికులు సురక్షితం



**సత్తుపల్లి, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ నుంచి అమలాపురం వెళ్తున్న ఒడిశాకు చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారుజామున ఖమ్మం జిల్లా సత్తుపల్లి దాటాక బోల్తాపడింది. బస్సులో 46 మంది ప్రయాణికులున్నారు. తెలంగాణ రాష్ట్ర శివారు గ్రామమైన పాకలగూడెం దాటాక డ్రైవర్ బస్సును రోడ్డుకిందకు దింపడంతో ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. ప్రయాణికులు భయంతో కిందకు దూకారు. అనంతరం బస్సును రోడ్డుపైకి తెచ్చే క్రమంలో పూర్తిస్థాయిలో బస్సు బోల్తాపడింది. అప్పటికే బస్సులోని ప్రయాణికులు కిందికి దిగడంతో పెనుప్రమాదం తప్పింది. ఎవరికీ గాయాలు కాలేదు. కల్లూరు ఏసీపీ వెంకటేశ్, సీఐ సురేశ్ ఘటనాస్థలానికి చేరుకొని ప్రయాణికులను ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు పంపించారు.

## కర్ణాటకలో కాంగ్రెస్ నేతల ఇండ్లపై ఐటీ దాడులు

### మాజీ డిప్యూటీ సీఎం పరమేశ్వర, రాజేంద్ర ఇండ్లలో సోదాలు

**బెంగళూరు, అక్టోబర్ 10:** కర్ణాటక కాంగ్రెస్ నేతలు మాజీ డిప్యూటీ సీఎం జీ పరమేశ్వర, మాజీ ఎంపీ ఆర్ఎల్ జాలప్ప కొడుకు రాజేంద్ర ఇండ్లపై ఆదాయపుపన్ను అధికారులు గురువారం దాడులు జరిపారు. పరమేశ్వర కుటుంబం సిద్ధార్థ గ్రూప్ విద్యా సంస్థలను నిర్వహిస్తున్నది. ఈ సంస్థలను పరమేశ్వర తండ్రి హెచ్ఎం గంగాధరయ్య 58 ఏండ్ల క్రితం స్థాపించారు. పరమేశ్వర ఇంటితోపాటు విద్యా సంస్థల్లో కూడా ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. పరమేశ్వర సోదరుడు శివప్రసాద్, వ్యక్తిగత సహాయకుడు రమేశ్ ఇండ్లపై కూడాదాడులు జరిగినట్టు అధికారులు తెలిపారు. కోలార్ జిల్లా దొడ్డబల్లపురలో ఆర్ఎల్ జాలప్ప ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని రాజేంద్ర నిర్వహిస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించి కోట్లాది రూపాయల పన్ను ఎగవేత ఆరోపణలపై ఈ దాడులు జరిగినట్టు తెలుస్తున్నది. దాదాపు 300 మంది ఐటీ సిబ్బంది ఇద్దరు నేతలకు సంబంధించిన 30 ప్రాంతాలలో దాడులు చేసినట్టు అధికారులు చెప్పారు. కర్ణాటకతోపాటు రాజస్థాన్‌లోని వారి కార్యాలయాలపై కూడా దాడులు జరిగినట్టు తెలిసింది. తుమకూరు నగరంలో శ్రీ సిద్ధార్థ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని రెండు మెడికల్ కాలేజీల్లో నిర్వహించిన నీట్ పరీక్షల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. అభ్యర్థులకు బదులుగా వేరొకరు పరీక్షలు రాసినట్టు, ఈ క్రమంలో లక్షల రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే ఐటీ అధికారులు దాడులు నిర్వహించినట్టు తెలుస్తున్నది. దాడులపై పరమేశ్వర స్పందిస్తూ, తనకు ఎటువంటి సమాచారం లేదని, దాడులు ఎందుకు జరుగుతున్నాయో కూడా తెలియదని చెప్పారు. తమకు విద్యా సంస్థలు తప్ప ఇతర వ్యాపారాలు లేవని, తాము క్రమం తప్పకుండా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నామని తెలిపారు. ఐటీ దాడులను మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, మాజీ సీఎం సిద్ధరామయ్య తదితరులను ఖండించారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ దాడులు జరిగినట్టు వారు ఆరోపించారు.

# నేడే మోదీ-జిన్‌పింగ్ భేటీ

- అగ్ర నేతల కోసం ముస్తాబైన మామల్లాపురం
- రెండురోజులపాటు ఉన్నతస్థాయి సమావేశాలు
- ఐదువేల మంది పోలీసులతో భారీ భద్రత
- తాత్కాలిక పోలీస్ ఔట్‌పోస్టులు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు



జిన్‌పింగ్‌కు స్వాగతం పలుకుతూ గురువారం చెన్నైలో విద్యార్థులు మాండరిన్ భాషలో ఆయన పేరిట ఏర్పాటుచేసిన ఆకృతి, తీర ప్రాంతంలో గస్తీ

**మామల్లాపురం, అక్టోబర్ 10:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ కోసం చెన్నై సమీపంలోని పురాతన పట్టణం మామల్లాపురం ముస్తాబైంది. ఇద్దరు అగ్రనేతలు రానుండటంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పట్టణ సుందరీకరణను చేపట్టారు. ఐదువేల మందికిపైగా పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ పట్టణం తీర ప్రాంతంలో ఉండటంతో ఇప్పటికే ఒక కోస్ట్‌గార్డ్ నౌకను సముద్రంలో మోహరించారు. మరో నౌక గస్తీ నిర్వహిస్తున్నది. భారత్, చైనా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం కోసం జిన్‌పింగ్‌తో మోదీ రెండు రోజులపాటు భేటీ కానున్నారు. ఇది ఈ ఇద్దరునేతల మధ్య జరుగుతున్న రెండో అనధికార సమావేశం కావడం విశేషం. వీరిద్దరి భేటీ నేపథ్యంలో.. పట్టణానికి వచ్చే సందర్శకులపై గట్టి నిఘా వేశారు. అనేకచోట్ల తాత్కాలిక పోలీస్ ఔట్‌పోస్టులను, 800కుపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మోదీ, జిన్‌పింగ్ బీచ్‌లో కొద్దిసేపు గడుపనున్న నేపథ్యంలో ఆ చుట్టుపక్కల బారికేడ్లు నిర్మించారు. బీచ్ వద్దనున్న దుకాణాలు కనిపించకుండా తాత్కాలికంగా ఒక గోడను నిర్మించి, దానిపై కొన్ని కళాకృతులను ఏర్పాటు చేశారు. ఇద్దరు అగ్రనేతలు శుక్రవారం, శనివారం రెండు రోజులపాటు ఈ పట్టణంలో గడుపనుండగా, గురువారం నుంచే ఆ ప్రాంతంలో చేపల వేటను నిషేధించారు. ఇప్పటికే పట్టణమంతా అణువణువూ తనిఖీ చేశారు. వందల సంఖ్యలో కార్మికులను నియమించి ఇక్కడి పురాతన కట్టడాల సుందరీకరణ పూర్తి చేశారు. పట్టణంలో సుమారు 100 ప్రత్యేకమైన లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు పలుచోట్ల స్వాగత ద్వారాలు నిర్మించారు. ఆ ద్వారాలపై స్వాగత సందేశాలు తమిళంతోపాటు హిందీ, చైనీస్ భాషల్లో ఉన్నాయి.

**మామల్లాపురం ఎందుకు?**

క్రీ.శ. 6వ శతాబ్దంలో పల్లవుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన మామల్లాపురం మోదీ, జిన్‌పింగ్ భేటీ నేపథ్యంలో మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నది. పల్లవరాజులు, చైనాలోని టాంగ్ రాజవంశం మధ్య ఆర్థిక, రక్షణ, సాంస్కృతిక సంబంధాలు కూడా ఉండేవట. ఈ నేపథ్యంలోనే జిన్‌పింగ్, మోదీ భేటీకి ఈ పట్టణాన్ని ఎంపిక చేసినట్టు తెలుస్తున్నది. బీచ్‌లో జిన్‌పింగ్‌తో కలిసి వాహ్యాళికి వెళ్లిన సమయంలో మోదీ ఉభయ దేశాల మధ్యనున్న పురాతన చరిత్రను ఆయనకు వివరిస్తారని సమాచారం. చెన్నై నుంచి పాండిచ్చేరికి వెళ్లే దారిలో ఉన్న ఈ పట్టణాన్ని మహాబలిపురం అని కూడా వ్యవహరిస్తారు. చెన్నై నగరానికి 53 కి.మీ. దూరంలో ఉన్న ఈ పట్టణం శిల్పకళా ప్రాభవంతో ద్రవిడ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అజంతా గుహల్లోని శిల్పకళా నైపుణ్యానికి అబ్బురపడిన పల్లవరాజు మహేంద్రవర్మ, అటువంటి శిల్పాలు తన రాజ్యంలో కూడా ఉండాలనే ఆలోచనతోనే ఈ మహాబలిపురాన్ని నిర్మించారు. శిల్పకారులు ఇక్కడ ఉన్న శిల్పాలను రూపొందించడానికి ఎంతగా శ్రమించారో ఆ కళా నైపుణ్యాన్ని సందర్శించిన వారికి సులభంగా అర్థమవుతుంది. మహాబలిపురానికి మహేంద్రవర్మ మల్లయుద్ధ వీరుడైన తన కుమారుడు నరసింహ వర్మకున్న మరో పేరు మహామల్లును తలపించే విధంగా మామల్లాపురం అని నామకరణం చేశారు. మల్లయుద్ధంలో ఎందరినో జయించడం వల్ల నరసింహ వర్మకు మహామల్లు అన్న బిరుదు లభించింది. ఇక్కడ వందల ఏండ్ల నాటి ఆలయాలు చాలా ఉన్నాయి. ఈ పట్టణం విశిష్టత తెలుసుకున్న యునెస్కో.. దీన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఇక్కడ చూడదగినవి ప్రధానంగా నాలుగు ఉన్నాయి. అవి 1. సముద్రం ఒడ్డున ఆలయం, 2. అర్జునుడు తపస్సు చేసిన ప్రదేశం, 3. పంచ పాండవుల రథాలు, 4. కృష్ణ మండపం. ఆలయం పక్కనే ఉన్న రథాలను ఏకశిలతో చెక్కడం విశేషం.

## ఎజెండాలో పలు కీలక అంశాలు

- కశ్మీర్‌పై చర్చ ఉండకపోవచ్చంటున్న విశ్లేషకులు

**మామల్లాపురం, అక్టోబర్ 10:** భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు, ఉగ్రవాద నిరోధక చర్యలపై చర్చించేందుకు ఇరు దేశాల అధినేతలు నరేంద్రమోదీ, జీ జిన్‌పింగ్ శుక్ర, శనివారాల్లో భేటీ కానున్నారు. ఇద్దరు నేతల మధ్య జరుగుతున్న రెండో అనధికార భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నాయకులు మొదటిసారి చైనాలోని వుహాన్‌లో గత ఏడాది ఏప్రిల్‌లో అనధికారికంగా సమావేశమయ్యారు. డోక్లాంలో భారత్, చైనా సైన్యాల మధ్య ఘర్షణపూర్వక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఆ శిఖరాగ్ర భేటీ జరిగింది. ప్రస్తుతం, కశ్మీర్‌కున్న ప్రత్యేక హోదాను రద్దు చేసిన నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొనడం.. పలు అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌కు చైనా అండగా నిలిచిన నేపథ్యంలో మోదీ, జిన్‌పింగ్ మధ్య రెండో భేటీ జరుగనున్నది. ఈ భేటీ జరుగడానికి 50 గంటల ముందుగా మాత్రమే చైనా నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. ఆ తరువాతనే జిన్‌పింగ్ పర్యటనను భారత్ ధ్రువీకరించింది. ఎటువంటి ఎజెండా లేకుండా ఈ ఇద్దరు అగ్ర నేతలు రెండోమారు అనధికారికంగా భేటీ అవుతున్నప్పటికీ.. ఆ తదనంతరం అనేక సానుకూల పరిణామాలు చోటు చేసుకోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. వుహాన్ భేటీ అనంతరం భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు, పెట్టుబడులు మరింతగా పెరిగాయి. డోక్లాం పరిణామాల మధ్య జరిగిన ఆ భేటీ.. ఉభయ దేశాల మధ్యనున్న విభేదాలు వివాదాలుగా మారరాదన్న సందేశాన్ని ఇచ్చింది. సరిహద్దుల్లో శాంతిని నెలకొల్పడానికి తమ సైన్యాలకు వ్యూహాత్మక దిశానిర్దేశం చేయాలని ఇద్దరు నేతలు ఆ భేటీలోనే అంగీకరించారు. జిన్‌పింగ్ ప్రతిపాదించిన 2+1 నమూనాకు మోదీ అంగీకారం తెలిపారు. దీని ప్రకారం మూడో దేశానికి భాగస్వామ్యం కల్పించే సంయుక్త ప్రాజెక్టుల్లో భారత్‌ను సమాన భాగస్వామిగా చైనా పరిగణిస్తుంది. మామల్లాపురం భేటీ వల్ల కూడా ఇటువంటి సానుకూల ఫలితాలు రావచ్చని భావిస్తున్నారు. ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, ఇండో-పసిఫిక్ సమ్మిళిత అభివృద్ధి, ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం, 5జీ, వాణిజ్య లోటు, ఉభయ దేశాల ప్రజల మధ్య సంబంధాలు తదితర అంశాలపై చర్చిస్తారని సమాచారం. జిన్‌పింగ్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించకపోవచ్చని అంటున్నారు. ఒకవేళ ఆయన ఆ అంశాన్ని లేవనెత్తితే భారత వైఖరిని మోదీ వివరించి చెప్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఇద్దరు నేతలు ఎటువంటి సంయుక్త ప్రకటనను విడుదల చేయరని, రెండు దేశాల విదేశాంగ శాఖలు మాత్రమే భేటీ వివరాలను వెల్లడిస్తాయని స్పష్టం చేశాయి.

## కశ్మీర్‌లో ముగ్గురు నేతల విడుదల

- షరతులతో యావర్ మీర్, నూర్ మహమ్మద్, షోయబ్ లోన్‌లకు విముక్తి
- బాండ్‌పై సంతకానికి నిరాకరించడంతో మెహబూబాతోపాటు పలువురిపై కొనసాగుతున్న నిర్బంధం



నూర్ మహమ్మద్, యావర్ మీర్, షోయబ్ లోన్

**శ్రీనగర్, అక్టోబర్ 10:** జమ్ముకశ్మీర్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాను రద్దు చేసినప్పటి (ఆగస్టు 5) నుంచి నిర్బంధంలో కొనసాగుతున్న ముగ్గురు రాజకీయ నాయకులను ఆ రాష్ట్ర అధికార యంత్రాంగం గురువారం విడుదల చేసింది. విడుదలైనవారిలో యావర్ మీర్, నూర్ మహమ్మద్, షోయబ్ లోన్ ఉన్నారని, వేర్వేరు కారణాలతో వీరు విడుదలయ్యారని అధికారులు తెలిపారు. వీరిలో యావర్ మీర్ పీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కాగా.. షోయబ్ లోన్ ఉత్తర కశ్మీర్ నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీచేసి ఓటమిపాలవడంతోపాటు ఆ తర్వాత ఆ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. నూర్ మహమ్మద్ నేషనల్ కాన్ఫరెన్స్ కార్యకర్త. శ్రీనగర్‌లోని ఉగ్రవాద ప్రభావిత ప్రాంతమైన బట్మలూలో ఆయన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ఇకపై శాంతియుతంగా సత్ప్రవర్తనతో మెలుగుతానని విడుదలకు ముందు ఆయనతో ఓ ఒప్పందం (బాండ్)పై సంతకం చేయించినట్టు అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్ ప్రభుత్వం గత నెల 21న పీపుల్స్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఇమ్రాన్ అన్సారీ, సయ్యద్ అఖూన్‌లను ఆరోగ్య కారణాలతో విడుదల చేసింది. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 5న రద్దుచేసిన తర్వాత ఆ రాష్ట్రంలో పలువురు రాజకీయ నేతలు, వేర్పాటువాదులు, న్యాయవాదులు సహా వెయ్యి మందికిపైగా వ్యక్తులను నిర్బంధించిన విషయం తెలిసిందే. వీరిలో మాజీ ముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబాముఫ్తీ కూడా ఉన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాను కఠినమైన ప్రజా భద్రతా చట్టం కింద నిర్బంధించగా.. ఇతర రాజకీయ నాయకుల్లో చాలామందిని నేర శిక్షాస్మృతిలోని వేర్వేరు సెక్షన్ల కింద నిర్బంధించారు.

**ఏ చట్టప్రకారం షరతులు విధించారు:**

ఈ ముగ్గురు నేతల విడుదల విషయంలో రాష్ట్ర అధికార యంత్రాంగం 'నిర్దిష్ట విధానమేమీ లేకుండా' వ్యవహరించిందని, బాండ్‌పై సంతకం చేయాలన్న షరతుతో వారిని విడుదలచేసిందని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా విమర్శించారు. బాండ్‌పై సంతకం చేసేందుకు తన తల్లితోపాటు పలువురు నేతలు నిర్ద్వంద్వంగా నిరాకరించారని ఆమె తెలిపారు. విడుదల చేసిన నాయకులతో బాండ్లపై ఏ ప్రాతిపదికన సంతకాలు చేయించారని ఇల్తిజా ప్రశ్నించారు. 'నేడు విడుదల చేసిన నాయకులతో బలవంతంగా బాండ్లపై సంతకాలు చేయించినట్టు వార్తలు వస్తున్నాయి. వారిని నిర్బంధించడమే అక్రమం. అలాంటిది వారి విడుదలకు ఏ చట్టం కింద షరతులు విధించారు?' అని ఇల్తిజా ట్విట్టర్‌లో మండిపడ్డారు. మెహబూబా ముఫ్తీ నిర్బంధంలో ఉన్నప్పటినుంచి ఆమె ట్విట్టర్ ఖాతాను ఇల్తిజాయే నడుపుతున్నారు.



గురువారం నాడు శికర్ దాల్ లేక్‌ను సందర్శించిన పర్యాటకులు

## పర్యాటకులకు స్వాగతం

- రెండు నెలల తర్వాత కశ్మీర్‌లోకి అనుమతి

**శ్రీనగర్, అక్టోబర్ 10:** సుందర కశ్మీరంను సందర్శించాలనుకునే పర్యాటకులకు అధికారులు శుభవార్త చెప్పారు. జమ్ముకశ్మీర్‌ను సందర్శించడానికి పర్యాటకులకు గురువారం నుంచి అనుమతినిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో గవర్నర్ సత్యపాల్ మాలిక్ సోమవారం జరిపిన భద్రతా సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉగ్రవాదులు దాడులకు తెగబడే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ఆగస్టు 2 నుంచి జమ్ముకశ్మీర్‌కు పర్యాటకుల సందర్శనను అధికారులు నిలిపివేశారు. అమర్‌నాథ్ యాత్రను సైతం అర్ధంతరంగా రద్దు చేసి, యాత్రికులను వెనక్కి పంపడం తెలిసిందే. ఆ తర్వాత ఆగస్టు 5న కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేసింది. మరోవైపు, కశ్మీర్‌లోని హయ్యర్ సెకండరీ స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీలు బుధవారం మళ్లీ తెరుచుకున్నాయి. శ్రీనగర్‌లోని ప్రఖ్యాత శ్రీ ప్రతాప్ కాలేజీ దగ్గర భద్రతా దళాలు పహారా నిర్వహించాయి. గుర్తింపు కార్డు ఉన్న విద్యార్థులను కాలేజీలోకి అనుమతించారు.

## రాళ్లురువ్వే ఘటనలు పెరిగాయి

- ఆర్టికల్ 370 రద్దు తర్వాత 306 ఘటనలు జరిగాయి
- భద్రత దళాల అంతర్గత నివేదికతో వెల్లడి
- విభేదించిన అధికారులు
- చెదురుముదురు ఘటనలు మాత్రమేనని వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పటికీ కశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొన్నదన్న వాదనపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్టికల్ 370ని రద్దు చేసిన ఆగస్టు 5 తర్వాత దాదాపు 306 రాళ్లు రువ్వే ఘటనలు జరిగినట్టు భద్రతా దళాల అంతర్గత నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ ఘటనల్లో దాదాపు వంద మంది జవాన్లు గాయపడ్డారని పేర్కొంది. అయితే, అక్కడి అధికారుల వాదన దీనికి భిన్నంగా ఉన్నది. చెదురుముదురు రాళ్లు రువ్వే ఘటనలు, అక్కడక్కడా కొన్ని నిరసనలు మినహాయించి జమ్ముకశ్మీర్ ప్రశాంతంగా ఉన్నదని వాళ్లు చెబుతున్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేశాక ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కేంద్ర ప్రభుత్వం అక్కడ పెద్దఎత్తున భద్రత దళాల్ని మోహరించింది. ఫోన్, ఇంటర్నెట్ సేవల్ని రద్దు చేసింది. దాదాపు 4000 మందిని అదుపులోకి తీసుకున్నది. ప్రభుత్వ అంతర్గత లెక్కల ప్రకారం.. ఈ రెండు నెలల్లో కశ్మీర్‌లో ఐదు ఎన్‌కౌంటర్లు జరిగాయి. వీటిలో ఇద్దరు భద్రతా దళ సభ్యులు మరణించగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. అలాగే, పది మంది తీవ్రవాదులు హతమయ్యారు. దీంతో పాటు రెండు గ్రెనేడ్ దాడి ఘటనలు జరిగాయి. కశ్మీర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంపుపై కూడా ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ రెండు నెలల్లో ఒకరు ప్రమాదవశాత్తు చనిపోయినట్టు సర్కారు పేర్కొంది. అస్రర్ అహ్మద్ ఖాన్ అనే 11వ తరగతి విద్యార్థి.. రాళ్లు రువ్వే ఘటనలో తీవ్రంగా గాయపడి చనిపోయాడని ఆర్మీ తెలిపింది. అయితే, తమ కొడుకు పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడి చనిపోయినట్టు బాధితుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

## నోబెల్ గ్రహీత యూనస్‌పై బంగ్లాదేశ్‌లో అరెస్ట్ వారంట్

**ఢాకా, అక్టోబర్ 10:** నోబెల్ అవార్డు గ్రహీత, బంగ్లాదేశ్ ఆర్థిక వేత్త మహ్మద్ యూనస్‌కు ఢాకాలోని ఒక కోర్టు బుధవారం అరెస్ట్ వారంట్ జారీచేసింది. తన సంస్థలోని కార్మికులను తొలిగించిన కేసు విచారణకు గైర్హాజరైనందుకు యూనస్‌కు న్యాయస్థానం అరెస్ట్ వారంట్ జారీ చేసిందని అధికారులు తెలిపారు. గ్రామీణ్ కమ్యూనికేషన్స్ (జీసీ) అధినేత అయిన మహ్మద్ యూనస్.. సంస్థ కార్మికులు కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకోగా ఆగ్రహించడంతోపాటు వారిని తొలిగించారు. ఉద్వాసనకు గురైన కార్మికులు కోర్టును ఆశ్రయించారు. విచారణకు హాజరైన సంస్థ సీఈఓ, సీనియర్ మేనేజర్‌లకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం విదేశాల్లో ఉండటం వల్ల మహ్మద్ యూనస్ విచారణకు హాజరు కాలేదు. 'ఆయన (యూనస్) కోర్టు సమన్లు జారీ చేయకముందే బంగ్లాదేశ్‌ను వీడారు. ఆయన వచ్చిన తర్వాత తగు చర్యలు తీసుకుంటారు' అని యూనస్ తరపు న్యాయవాది తెలిపారు.

## ఎల్వోసీ వద్ద కాల్పుల్లో పాక్ సైనికుడి హతం

**ఇస్లామాబాద్:** సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వద్ద భారత దళాలు జరిపిన కాల్పుల్లో పాక్ సైనికుడు ఒకరు మరణించడంతోపాటు ఇద్దరు మహిళలు గాయపడ్డారని పాకిస్థాన్ సైన్యం గురువారం ప్రకటించింది. బరోహ్-చిరికోట్ సెక్టార్‌లో ఈ కాల్పులు చోటుచేసుకున్నట్టు పాకిస్థాన్ మీడియాకు చెందిన ప్రజా సంబంధాల విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతిగా పాకిస్థాన్ దళాలు జరిపిన దాడుల్లో భాతర సైనిక శిబిరాలు దెబ్బతినడంతో పాటు ప్రాణనష్టం జరిగిందని పేర్కొన్నది. ఎల్వోసీ వద్ద ఎదురుకాల్పుల్లో జరుగుతున్న ప్రాణనష్టం విషయాన్ని ఎప్పటికప్పుడు భారత రాయబారుల దృష్టికి తీసుకెళ్తున్నట్టు తెలిపింది. ఈ నెల 6-7 మధ్య భారత దళాల కాల్పుల ఉల్లంఘనలో ఒక మహిళ మరణించిన విషయాన్ని భారత డిప్యూటీ హైకమిషనర్ గౌరవ్ అహ్లువాలియా దృష్టికి పాక్ విదేశాంగశాఖ తెచ్చి నిరసన తెలిపినట్టు పేర్కొన్నది. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని ఆగస్టు 5న కేంద్రం ఉపసంహరించుకున్న తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే.

## మేకకు ఒకేఈతలో ఐదుపిల్లలు



**కేటీదొడ్డి (ధరూర్) :** మేకకు ఒకేఈతలో ఐదు పిల్లలు పుట్టిన అరుదైన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని నెట్టెంపాడులో జరిగింది. నెట్టెంపాడుకు చెందిన సర్జాపురం గోవిందు గొర్రెల మందలో ఉన్న మేకకు గురువారం ఐదు పిల్లలు పుట్టాయి. సాధారణంగా మేకకు ఒకటి నుంచి మూడు పిల్లలు జన్మిస్తాయి. మేకకు పుట్టిన ఐదు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నాయి.

# విజయం కోసం ఆరేళ్లు ఎదురుచూశా!



మునీష్, తేజస్, వి.వి.వినాయక్, పాయల్ రాజ్‌పుత్, శంకర్‌భాను, సి.కల్యాణ్

'నటనకు ఆస్కారమున్న విలక్షణ పాత్రను పోషించే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయే చిత్రమిది' అని చెప్పింది పాయల్ రాజ్‌పుత్. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'ఆర్‌డీఎక్స్ లవ్'. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. శంకర్‌భాను దర్శకుడు. తేజస్ కంచెర్ల కీలక పాత్రధారి. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ ''ఆర్‌ఎక్స్100' మాదిరిగా ఈ సినిమా పెద్ద హిట్ కావాలి. పాయల్ రాజ్‌పుత్‌తో పాటు అందరికి మంచి పేరు తెచ్చిపెట్టాలి' అని అన్నారు. పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ ''ఆర్‌ఎక్స్100' నా జీవితాన్ని మార్చివేసింది. పెద్ద విజయం కోసం ఆరేళ్లుగా నిరీక్షించిన నా కలను నెరవేర్చింది. ఈ ప్రయాణంలో నేను పడిన కష్టాలే నన్ను అగ్రనాయికగా నిలబెట్టాయి. సామాజిక సమస్యల్ని స్పృశిస్తూ దర్శకుడు శంకర్‌భాను చెప్పిన కథ నచ్చి ఈ సినిమా చేశాను' అని తెలిపింది. నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ 'గ్లామర్ ప్రధానంగా సాగే సినిమా కాదిది. చక్కటి భావోద్వేగాలతో ముడిపడి సాగుతుంది. ఈ చిత్ర విడుదల తర్వాత భవిష్యత్తులో మహిళా ప్రధాన ఇతివృత్తాలతో సినిమా తీయాలనుకునేవారికి పాయల్ గుర్తొస్తుంది' అని పేర్కొన్నారు. 'పాయల్ రాజ్‌పుత్ పాత్ర విభిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర చేయడానికి చాలా ధైర్యం కావాలి. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని కథాంశమిది' అని దర్శకుడు శంకర్‌భాను తెలిపారు. డబ్బు కోసం కాకుండా కథ, మంచి టీమ్‌ను నమ్మి తాను చేసిన సినిమా ఇదని తేజస్ అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి, మునీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'యథార్థ ఘటనల్ని ఆధారంగా చేసుకొని రూపొందించిన క్రాస్ జోనర్ సినిమా ఇది. ఎంతో పరిశోధించి ఈ సినిమా చేశాం' అని అన్నారు సాయికిరణ్ అడివి. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ గోల్డ్‌ఫిష్'. ఆదిసాయికుమార్, శషాచెత్రి, కార్తిక్‌రాజు, పార్వతీశం, నిత్యానరేష్ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.

# ఆపరేషన్ కశ్మీర్



నిత్యానరేష్, ఆది

ప్రతిభా అడివి, కట్టా ఆశిష్‌రెడ్డి, కేశవ్ ఉమాస్వరూప్, పద్మనాభరెడ్డి, గ్యారీబీహెచ్, సతీష్ డేగల తదితరులు నిర్మించారు. ఈ నెల 18న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హీరో నాగార్జున విడుదలచేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'కశ్మీర్ పండిట్స్ సమస్యల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది' అని తెలిపారు. ఆదిసాయికుమార్ మాట్లాడుతూ 'కొన్ని వాస్తవాలకు కల్పిత అంశాలను జోడించి దర్శకుడు సాయికిరణ్ ఈ సినిమాను రూపొందించారు. అర్జున్ పండిట్ అనే కమాండోగా నా పాత్ర నవ్యపంథాలో ఉంటుంది. అంతర్లీనంగా చక్కటి ప్రేమకథ మిళితమై సాగుతుంది' అని చెప్పారు. 'పవర్‌ఫుల్‌గా సాగే విలన్ పాత్ర కోసం చాలా మంది నటుల్ని పరిశీలించాం. కానీ ఎవరూ సరిపోలేదు. ఆ సమయంలో సాయికిరణ్ అడివి మీరే ప్రతినాయకుడి పాత్ర చేయాలని అన్నారు. నాలుగు నెలలు వెంటపడి నన్ను ఒప్పించారు. ఇండియా తాలూకు ఎమోషన్స్‌ను చెబుతున్నాం కాబట్టి సినిమాలో వాస్తవాల్నే చూపించాలనే ఆలోచనతో చాలా కష్టపడ్డాం' అని రచయిత అబ్బూరి రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తిక్‌రాజు, నిత్యానరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జార్జ్‌రెడ్డి జీవితంతో..



సందీప్‌మాధవ్

ధైర్యానికి, సాహసానికి ప్రతీకగా నిలిచి సమసమాజస్థాపన కోసం ఉద్యమించిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు జార్జ్‌రెడ్డి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'జార్జ్‌రెడ్డి'. జీవన్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్‌మాధవ్('వంగవీటి' ఫేం)టైటిల్ పాత్రను పోషిస్తున్నారు. మైక్ మూవీస్, సిల్లీ మంక్స్, త్రీలైన్స్ సినిమా పతాకాలపై అప్పిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సత్యదేవ్, మనోజ్‌నందన్, చైతన్యకృష్ణ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ సినిమా తెలుగు ప్రపంచవ్యాప్త థియేట్రికల్ హక్కులను అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా సొంతం చేసుకున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'విప్లవోద్యమ నాయకుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన జార్జ్‌రెడ్డి జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తున్న చిత్రమిది. 1960-70 కాలం నాటి రాజకీయ, సామాజిక పరిస్థితుల్ని కళ్లకు కట్టినట్లుగా ఈ సినిమాలో చూపిస్తున్నాం. విజయదశమి రోజున విడుదలైన ట్రైలర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. త్వరలో సినిమాను విడుదలచేస్తాం' అని అన్నారు. శత్రు, వినయ్, తిరువీర్, అభయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం సంగీతం:సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సినిమాటోగ్రఫీ: సుధాకర్‌యెక్కంటి.

## జిగేల్‌రాజా ప్రేమాయణం



అన్వేష్, సారిక

అన్వేష్, సారిక జంటగా నటిస్తున్న చిత్రం 'జిగేల్‌రాజా'. మాధవి కేసాని దర్శకురాలు. జి.ఎస్.జాషువారాజు నిర్మిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ ఫిలించాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా దర్శకురాలు మాట్లాడుతూ 'ప్రేమ, వినోదం, కుటుంబ విలువలతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం సమ్మిళితమైన చిత్రమిది' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'బుధవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం. సుమన్, పోసాని కృష్ణమురళితో పాటు పలువురు సీనియర్ నటీనటులు కీలక పాత్రల్ని పోషించనున్నారు' అని చెప్పారు.

## వినోదమే పరమావధిగా



'ఇష్క్ ఈజ్ రిస్క్' ఆడియో ఆవిష్కరణ దృశ్యం

రవిచంద్ర, యుగాయుగేష్, సాయిశ్రీవి నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఇష్క్ ఈజ్ రిస్క్'. రాజ్ కింగ్ దర్శకుడు. ఎస్.చంద్రశేఖర్ నిర్మాత. ఇటీవల హైదరాబాద్‌లో చిత్ర గీతాల్ని విడుదలచేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ దర్శకుడు సాగర్ మాట్లాడుతూ 'టైటిల్, ట్రైలర్స్ బాగున్నాయి. హీరోహీరోయిన్లు కొత్తవారైనా చక్కటి అభినయాన్ని కనబరిచారు' అని తెలిపారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'వినోదానికి పరమావధిగా రూపొందిస్తున్న ప్రేమకథా చిత్రమిది. ఓ ప్రేమజంటకు ఎదురయ్యే అవాంతరాలు నవ్విస్తాయి. వినూత్నమైన పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం'అని తెలిపారు. ప్రేమను రిస్క్‌గా భావించే ఓ యువకుడి జీవితగమనానికి దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు.

## కైలాసపురం కహానీ



గరిమాసింగ్

రమేష్ కుర్మాపు, గరిమాసింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'కైలాసపురం కింగ్స్'. క్రౌడ్ ఫండింగ్ విధానంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కులదీప్ రాజన్ దర్శకుడు. ఈ చిత్ర టీజర్‌ను నిర్మాతలు రాజ్ కందుకూరి, రిజ్వాన్ విడుదలచేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'వైజాగ్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. కైలాసపురంలో ఏం జరిగింది? ఆధిపత్య పోరులో గెలుపు ఎవరిని వరించిందన్నది ఆసక్తిని పంచుతుంది' అని తెలిపారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ 'సినిమా చూశాను. చాలా నచ్చింది. 'కేరాఫ్ కంచెరపాలెం' తరహాలో తెలుగు ప్రేక్షకులకు నవ్యానుభూతిని పంచుతుంది' అని పేర్కొన్నారు. పూర్తిస్థాయి మాస్ ఎంటర్‌టైనర్ ఇదని హీరో రమేష్ అన్నారు. ప్రేమను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిదని గరిమాసింగ్ చెప్పింది.

## వసంతకాలంలో

నయనతార కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'కొలైయుథిర్ కాలం'. చక్రి తోలేటి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని 'వసంతకాలం' పేరుతో నిర్మాత దామెర వి.ఎస్.ఎస్ శ్రీనివాస్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. అనువాద కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం సెన్సార్ జరుపుకుంటున్నది. నిర్మాత మాట్లాడుతూ 'ఇంద్రియవైకల్యంతో బాధపడే ఓ



నయనతార

అనాథ యువతి కథ ఇది. ఓ భవంతిలో ఆమెకు ఎలాంటి భయానక పరిణామాలు ఎదురయ్యాయి?వైకల్యాన్ని అధిగమిస్తూ ప్రాణాలకు తెగించి శత్రువును ఆమె ఎలా ఎదుర్కొన్నదన్నది ఆసక్తిని రేకెత్తిస్తుంది. నయనతార నటన, పాత్రచిత్రణ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. సస్పెన్స్, హారర్, థ్రిల్లర్ ఇతివృత్తంతో ప్రతిక్షణం థ్రిల్‌కు లోనుచేస్తుంది. నవంబర్‌లో సినిమాను విడుదలచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. భూమిక, ప్రతాప్ పోతన్, రోహిణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్‌రాజా.

## కాలేజీ చదరంగం



హరిప్రసాద్ జక్కా, కరుణకుమార్, సుకుమార్, శ్రీనాథ్

''వన్ నేనొక్కడినే', '100%లవ్' చిత్రాలకు కథను అందించిన హరిప్రసాద్ జక్కా ఈ సినిమాకు రచయితగా పనిచేశారు. వినూత్నమైన పాయింట్‌తో అతడు ఈ చిత్ర కథను సిద్ధంచేసుంటాడనే నమ్మకముంది' అని అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. సంజయ్, శ్రీనాథ్ మాగంటి, అహల్యసురేష్, ప్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'. జె.కరుణకుమార్ దర్శకుడు. బి.ఓబుల్‌సుబ్బారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం హైదరాబాద్‌లో దర్శకుడు సుకుమార్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్, పోస్టర్స్ ఆకట్టుకుంటున్నాయి. హరిప్రసాద్ కథను కరుణకుమార్ అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన భావన కలుగుతున్నది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదనే సందేశంతో ఈ సినిమాను రూపొందించాం. సమకాలీన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రతి ఒక్కరిలో ఆలోచనను రేకెత్తిస్తుంది' అని తెలిపారు. మంచి సినిమా చేశాననే సంతృప్తిని మిగిల్చిందని, కళాశాల జీవితంలో ఓ విద్యార్థికి ఎదురైన పరిణామాలేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తమని, యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రయూనిట్ పాల్గొన్నారు.







